Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 186 మేడ్చల్ మల్కాజ్‌గిరి 28 జూలై 2024 ఆదివారం పేజీలు : 4

## కేరళ, బెంగాల్ గవర్నర్ల ఆఫీసులకు నోటీసులు

న్యూఢిల్లీ : పలు బిల్లుల పెండింగ్ విషయమై కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల గవర్నర్ల కార్యాలయాలకు సుప్రీం కోర్టు శుక్రవారంనోటీసులు జారీ చేసింది. ఏ కారణం లేకుండా బిల్లులను గవర్నర్లు ఆమోదించకుండా పెండింగ్‌లో పెట్టారంటూ ప్రతిపక్ష పాలిత కేరళ, బెంగాల్ ప్రభుత్వాలు వేసిన పిటిషన్లను సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ పార్ధివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం విచారించింది. ఈ వ్యవహారంలో కేంద్ర హోంశాఖతో పాటు ఆయా రాష్ట్రాల గవర్నర్ల కార్యదర్శులకు కూడా నోటీసులు జారీ చేసింది. విచారణలో ఇరు రాష్ట్రాల తరఫు న్యాయవాదులు వాదిస్తూ.. 'శాసన సభలు ఆమోదించిన పలు బిల్లులను గవర్నర్లు కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉంచారు. ఇందుకు కారణాలు కూడా వెల్లడించడం లేదు' అని అన్నారు. దీనిపై స్పందించిన కోర్టు.. మూడు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలంటూ ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.

# పంద్రాగస్టు తర్వాతే...!



## టీ కేబినెట్ విస్తరణ ఎప్పుడు?

## పీసీసీ చీఫ్ నియామకం.. కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఫిక్స్..!

హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ ఆగస్టు 15 తర్వాత కొన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. కేబినెట్ విస్తరణతో పాటు పీసీసీ చీఫ్ నియామకం అప్పుడే ఉంటుందని ప్రచారం జరుగుతున్నది. ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ రాష్ట్ర పర్యటన సైతం అప్పుడే ఉండొచ్చని తెలుస్తున్నది. పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పోస్టులూ అదే నెలలో భర్తీ చేసే చాన్స్ కనిపిస్తున్నది. ఆగస్టు 3వ తేదీ ఫారిన్ టూర్ వెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డి అదే నెల 11వ తేదీ రాత్రి తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు. సీఎం హోదాలో ఆయన తొలిసారిగా పంద్రాగస్టు సందర్భంగా జెండావిష్కరణ చేయనున్నారు. తర్వాత రోజు లేదా మర్నాడు ఢిల్లీకి వెళ్లి, పెండింగ్‌లో ఉన్న అంశాలపై అధిష్టానంతో మాట్లాడి వీటన్నింటిపైనా క్లియరెన్స్ తీసుకుంటారని తెలుస్తున్నది.

**శ్రావణ మాసంలోనే కేబినెట్ విస్తరణ?...** పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణ శ్రావణ మాసంలో జరిగే అవకాశం ఉన్నదని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఆగస్టు 5వ తేదీ నుంచి శ్రావణమాసం షురూ కానున్నది. అదే నెల 15వ తేదీ తర్వాతే కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఉండొచ్చని ఏఐసీసీ వర్గాల్లో టాక్ నడుస్తున్నది. వాస్తవానికి జూలై ఫస్ట్ వీక్‌లోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని ప్రచారం జరిగింది. అయితే ఎవరెవరిని తీసుకోవాలనే అంశంపై క్లారిటీ రాకపోవడంతో వాయిదా పడింది. కానీ ఈ సారి మాత్రం పంద్రాగస్టు తర్వాత మంత్రివర్గ విస్తరణ ఖచ్చితంగా ఉంటుందని ఏఐసీసీకి సన్నిహితంగా ఉన్న ఓ మంత్రి కామెంట్ చేశారు. అయితే ప్రస్తుతం సీఎంతో కలుపుకొని మొత్తం 12 మంది మంత్రులున్నారు. మరో ఆరుగురిని కేబినెట్‌లో తీసుకునే ఛాన్స్ ఉండగా నలుగురు లేదా ఐదుగురితో మంత్రి వర్గం విస్తరించాలని ఏఐసీసీ భావిస్తున్నట్టు తెలిసింది.

**పీసీసీ చీఫ్ ఎన్నిక సైతం అప్పుడే..** కేబినెట్ విస్తరణ టైంలోనే పీసీసీ చీఫ్ నియామకం ఉండే ఛాన్స్ ఉన్నది. ఎందుకంటే మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కని సామాజికవర్గ లీడర్‌కు పీసీసీ అధ్యక్ష పదవి ఇచ్చి, సామాజికంగా న్యాయం పాటించామనే సంకేతాలు ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తున్నట్టు సమాచారం. అలాగే డిప్యూటీ స్పీకర్, అసెంబ్లీలో చీఫ్ విప్ పదవులు సైతం భర్తీ చేసే అవకాశం ఉన్నది. ఈ రెండూ కేబినెట్ ర్యాంక్‌తో సమానమైన పదవులు కావడంతో మంత్రి పదవులు దక్కని ఎమ్మెల్యేలకు ఈ పోస్టులు ఇచ్చి సంతృప్తి పరచాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తున్నది.

**పంద్రాగస్టు తర్వాతే రాహుల్ సభ....** రూ. 2 లక్షల రుణమాఫీ అమలు చేస్తున్న సందర్భంగా ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీని పిలిచి వరంగల్ వేదికగా భారీ బహిరంగ సభ నిర్వహించాలని కాంగ్రెస్ భావిస్తున్నది. ముందుగా ఈ నెల చివరన పబ్లిక్ మీటింగ్ నిర్వహించాలని పార్టీ నేతలు భావించారు. కానీ లోకసభ సమావేశాల్లో రాహుల్ బిజీగా ఉండటం, రాష్ట్రంలో వరుసగా వర్షాలు కురుస్తున్నందున దాన్ని వాయిదా వేసుకొని ఆగస్టు 15 తర్వాత నిర్వహించాలని పీసీసీ భావిస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన తర్వాత ఢిల్లీకి వెళ్లి రాహుల్ టూర్ డేట్ ఫిక్స్ చేస్తారని తెలుస్తున్నది.

**కీలక నిర్ణయాలు అప్పుడే?...** శ్రావణమాసం ఆగస్టు 5న ప్రారంభమై సెప్టెంబర్ 2వ తేదీ వరకూ ఉంటుంది. ఈ మాసంలోనే పార్టీ, ప్రభుత్వంలో పలు కీలక నిర్ణయాలు తీసుకునే ఛాన్స్ ఉందని పీసీసీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. కేబినెట్ విస్తరణ, పీసీసీ నియామకంతో పాటు మరికొన్ని నామినేటెడ్ పదవులు సైతం భర్తీ చేసే అవకాశం ఉందని చర్చ జరుగుతున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ పదవులను భర్తీ చేసింది. కానీ న్యాయపరంగా చిక్కులు రావడంతో ఆ ఫైల్ రాజ్‌భవన్‌లో పెండింగ్‌లో ఉన్నది. శ్రావణ మాసంలో గవర్నర్ ఆ రెండు ఎమ్మెల్సీ పదవుల ఎంపిక పూర్తి చేస్తారనే ప్రచారం ఉన్నది. ఇటీవలే 37 నామినేటెడ్ పోస్టులు ఫిలప్ చేసిన కాంగ్రెస్ మిగతావి సైతం శ్రావణ మాసంలో భర్తీ చేస్తుందని తెలుస్తున్నది.



## హరీష్‌రావు వ్యాఖ్యలపై సీఎం రేవంత్ గట్టి కౌంటర్

హైదరాబాద్, జూలై 27: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు హాట్‌హాట్‌గా నడుస్తున్నాయి. శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి హరీష్ రావు మధ్య మాటల యుద్ధం నడిచింది. హరీష్‌రావు వ్యాఖ్యలపై రేవంత్ గట్టి కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు క్షమాపణ చెప్పాలని.. ప్రభుత్వం ప్రజల లక్ష్యంగా పని చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. ఆరు గ్యారంటీలకు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో కేటాయింపులు పెంచారు.. కానీ అసలు బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించారని విమర్శించారు. కాంగ్రెస్ అంటేనే డోకా పార్టీగా మారిపోయిందని హరీష్ విమర్శలు గుప్పించారు. ఈ వ్యాఖ్యలపై సీఎం రేవంత్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. అబద్ధాలతో హరీష్ రావు ఊకదంపుడు ఉపన్యాసం ఇస్తున్నారని మండిపడ్డారు. ప్రజలను మభ్య పెట్టాలని చూస్తే వారు నమ్మడానికి సిద్ధంగా లేరన్నారు. ప్రజలు శిక్షించినా వాళ్ల ఆలోచన మారలేదని... అదే ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారన్నారు. లక్షల కోట్ల విలువైన ఔటర్ రింగ్ రోడ్డును రూ. 7వేల కోట్లకే తెగనమ్మారని మండిపడ్డారు. గొర్రెల స్కీం పేరుతో కోట్ల రూపాయలు దండుకున్నారని... గొప్ప పథకం అని చెప్పిన బతుకమ్మ చీరల్లోనూ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఆడబిడ్డల సెంటిమెంట్ నూ దోపిడీకి ఉపయోగించుకున్నారన్నారు.

## హరీష్ - మంత్రులు.. దద్దరిల్లిన తెలంగాణ అసెంబ్లీ..!

అసెంబ్లీలలో తెలంగాణ రసవత్తర చర్చ నడిచింది. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు మొదలు.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలసీల్లో జరిగిన అవకతవకలపై చర్చ హాట్ హాట్‌గా జరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఒకవైపు.. సీఎం, మంత్రులు ఒకవైపు సవాళ్లు, ప్రతిసవాళ్లు, వివరణలతో సభ దద్దరిల్లింది. బడ్జెట్‌పై చర్చ ప్రారంభమైన తరువాత అధికార పక్షం నుంచి ముఖ్యమంత్రి, మంత్రులు తమ ప్రభుత్వ ఘనతను వివరిస్తుండగా.. విపక్షం నుంచి హరీష్ రావు తనదైన శైలిలో ప్రభుత్వంలోని లోపాలను, తప్పులను ఎత్తి చూపారు.

**ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క..** సభలో బడ్జెట్‌పై ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రసంగిస్తూ.. గత పదేళ్లలో రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారన్నారు. ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితికి తెచ్చారన్నారు. అస్తవ్యస్థంగా ఉన్న ఆర్థిక వ్యవస్థను ఇప్పుడిప్పుడే దారికి తెస్తున్నామని అన్నారు. రాష్ట్రాన్ని బాగు చేసే బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని.. బీఆర్ఎస్ నేతలకు కంటగింపుగా ఉందన్నారు.

తమలాగా వివిధ మార్గాల్లో నిధులు మళ్లించడం లేదని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారని విమర్శించారు. ఇవాళ ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ సభకు వస్తారని భావించామన్నారు. ఆయన వస్తే అన్నింటికీ సమాధానం చెబుదాం అనుకున్నామని.. కానీ, ఆయన సభకు రాలేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖ ఆదాయాన్ని ఒకే కుటుంబం చేతిలో పెట్టారని ఆరోపించారు.

**బడ్జెట్‌పై హరీష్ రావు కౌంటర్..** 'ఇది అబద్దాల బడ్జెట్. రూ. 18,228 కోట్లు ఆదాయం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ద్వారా ఎలా వస్తుంది? ఎలా ఆదాయం పెంచుతారో చెప్పాలి? ఎక్సైజ్ శాఖను చూస్తే కాంగ్రెస్ సిగ్గుతో తల దించుకోవాలి. 2023-24లో ఎక్సైజ్ ప్రతిపాదిత ఆదాయం రూ. 19,884 కోట్లు. ఇప్పుడు రూ. 25,617 కోట్లు పెట్టారు. పోయిన సంవత్సరం కంటే రూ. 7,773 కోట్లు అదనపు ఆదాయం వస్తుందని ప్రభుత్వం చెబుతోంది. ఎక్సైజ్ శాఖ ద్వారా రూ. 42 వేల కోట్లు రావాలంటే గల్లీకో బెల్ట్ షాప్ పెట్టాలి. కాంగ్రెస్ అధికారంలో ఉంటే ఒక మాట, ప్రతిపక్షంలో ఉంటే మరో మాట చెబుతోంది. ప్రజలను పీల్చి పిప్పి చేసి ఆదాయం రాబడతమని మంత్రి జూపల్లి ఒప్పుకున్నారు.' అంటూ ఎక్సైజ్ విధానంపై తనదైన శైలిలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.



## వాడి వేడి చర్చ..

**భట్టి విక్రమార్క..** 'గత ఏడాదే వైన్ షాపులు వేలం వేశామని హరీష్ రావు అంటున్నారు. ఈ సంవత్సరం పెట్టాల్సిన యాక్షన్ గత ఏడాదే ఎందుకు పెట్టారు. ఎంత దొరికితే అంత దోచుకోవడమే మీ ఆలోచన. టానిక్ లాంటి షాపులకు అనుమతి ఇచ్చి ఆదాయాన్ని ఒకే కుటుంబ సభ్యుల చేతికి మళ్లించారు. మేము అలా కానివ్వం.' అని హరీష్ రావుకు కౌంటర్ ఇచ్చారు మంత్రి భట్టి.



# విస్తరణ జరిగితే విస్ఫోటనమేనా ?!

## మంత్రి పదవులపై ఆశలు పెంచుకున్న....
## సొంత పార్టీ వాళ్ళు.. పక్క నుండి వచ్చినోళ్ళు...

## ఎలా సర్దుకు రావాలో తేలక అగమ్య గోచరంలో అధిష్టానం

హైదరాబాద్ : ఆషాడమాసం వెళ్లి శ్రావణమాసం రావడానికి మిగిలింది 7 రోజులు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి కూడా అప్పటికి 9 నెలలు అవుతుంది. అప్పటికయినా ప్రభుత్వంలో మిగిలిపోయిన ఆరు మంత్రి పదవులను భర్తీ చేసే వ్యవహారం తేలుతుందా ? లేదా ? అని అంతా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఆశావాహుల సంఖ్య ఎక్కువగా ఉండడం, మంత్రి పదవులు తక్కువగా ఉండడంతో ఈ వ్యవహారం కొలిక్కి రావడం లేదు. అదే సమయంలో బీఆర్ఎస్ నుండి ఎమ్మెల్యేలను ఆకర్షించేందుకు కూడా ఈ ఖాళీలను భర్తీ చేయడం లేదని రాజకీయ వర్గాలలో వినిపిస్తున్న మాట. బీఆర్ఎస్ నుండి ఇప్పటి వరకు 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ ఎల్పీ విలీనం కావాలంటే మరో 16 మంది చేరాలి. కానీ ఆ పరిస్థితులు కనిపించడం లేదు. పార్టీలో చేరమని అడిగితే ఎక్కువ మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమకు మంత్రి పదవి మాత్రమే కావాలని షరతులు పెడుతున్నట్లు సమాచారం. ఇది కాకుండా ఇప్పటి వరకు చేరిన వారికి ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం, చేరిన తర్వాత పట్టించుకోవడం లేదన్న వార్తల నేపథ్యంలో చేరికలకు గ్యాప్ ఏర్పడినట్లు చెబుతున్నారు. బీఆర్ఎస్ నుండి అందరికన్నా ముందు చేరిన దానం నాగేందర్ సికింద్రాబాద్ ఎంపీగా కూడా పోటీ చేసి ఓడిపోయాడు. అయితే తాను మంత్రి పదవి హామీతోనే కాంగ్రెస్ లో చేరానని లేకుంటే ఎంపీకి ఎందుకు పోటీ చేస్తానని అంటున్నట్లు తెలుస్తుంది. జంటనగరాల నుండి మంత్రుల ప్రాతినిధ్యం లేకపోవడంతో పాటు మైనారిటీ మంత్రి కూడా లేని నేపథ్యంలో దానంతో పాటు, ఇటీవల కంటోన్మెంట్ నుండి గెలిచిన ఎమ్మెల్యే శ్రీగణేష్ మంత్రి పదవి ఆశిస్తున్నారు. ఇక సీనియర్ కాంగ్రెస్ నేత వీహెచ్ తనను ఎమ్మెల్సీని చేసి మంత్రి పదవి ఇవ్వాలని కోరుతున్నారు. కాంగ్రెస్ పార్టీకి తాను నమ్మకంగా ఉన్నానని, పలుమార్లు పోటీ చేశానని, ఇటీవల కేవలం 2037 ఓట్ల స్వల్ప తేడాతో ఓడిపోయానని మైనారిటీ కోటాలో తనకు మంత్రి పదవి ఇవ్వాలని, కార్పోరేషన్ అక్కర్లేదని ఫిరోజ్ ఖాన్ అంటున్నట్లు తెలుస్తుంది. ఇదే సమయంలో క్రికెటర్ అజారుద్దీన్ కూడా పదవిని ఆశిస్తున్నాడు. అయితే దానం రోజూ సీఎం రేవంత్ ఇంటికి వెళ్తున్నా ఈ మధ్య కాలంలో అసలు కలవడం లేదని తెలుస్తుంది. ఇక ఎస్టీ కోటాలో బాలూ నాయక్, వెడ్మ బొజ్జు, ముదిరాజ్ కోటాలో వాకిట శ్రీహరి, యాదవ కోటాలో బీర్ల అయిలయ్య మంత్రి పదవులు ఆశిస్తున్నారు. తనకు ఇచ్చిన హామీ ప్రకారమే కాంగ్రెస్ పార్టీలో చేరానని, ఆ తర్వాత పెట్టిన షరతు ప్రకారం భువనగిరి ఎంపీ అభ్యర్థిని గెలిపించిన నేపథ్యంలో తనకు మంత్రి పదవి ఇవ్వాలని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. రాజగోపాల్ రెడ్డికి ఇస్తే తన సతీమణి పద్మావతికి ఇవ్వాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి పట్టుబడుతున్నారు. ఇక నిజామాబాద్ నుండి సుదర్శన్ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ నుండి చెన్నూర్ ఎమ్మెల్యే వివేకం పదవులను ఆశిస్తున్నారు. వివేక్ తన బెర్త్ ఖాయం అని చెప్పుకుంటున్నారు. వివేక్ కుటుంబంలో ఇద్దరు ఎమ్మెల్యే, ఒక ఎంపీకి అవకాశం లభించిన నేపథ్యంలో పార్టీకి లాయల్ గా ఉన్న తనకు మంత్రి పదవి ఇవ్వాలని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పట్టుబడుతున్నాడు. ఇక సీనియర్ల కోటాలో ఇబ్రహీంపట్నం నుండి మల్ రెడ్డి రంగారెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తదితరులు ఆశావాహుల్లో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే ఇంత మంది ఆశావాహులు ఉండగా బీఆర్ఎస్ నుండి వచ్చిన వారికి పదవులు ఇస్తే కాంగ్రెస్ లో కాకరేగడం ఖాయం అని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. మరి అసలు మంత్రి వర్గ విస్తరణ ఎప్పుడు జరుగుతుంది ? ఎవరికి అవకాశాలు దక్కుతాయి ? ఆ తర్వాత ఏం జరుగుతుంది ? అన్నది వేచిచూడాలి.

# సంపాదకీయం

## మోడీ 3.0 పాలన

## ఆర్థికం.. మందగమనమే.. నిరుద్యోగమూ అంతే..!

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో గమనిస్తే ఆర్థిక మందగమనం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రస్తుతం 48 లక్షల కోట్ల రూపాయలతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టినా రాష్ట్రాలకు ఇచ్చింది రూపాయి కూడా కనిపించట్లేదు. ఒకటి రెండు రాష్ట్రాలు మినహా మిగిలిన అన్ని రాష్ట్రాలకు మోడీ ప్రభుత్వం మొండిచేయి చూపించంది. ఒక బీహార్ కి మాత్రమే బడ్జెట్ నుంచి కేటాయింపులు జరిపింది. ఏపీ విషయానికి వచ్చేసరికి మాత్రం అప్పుల రూపంలో 15 వేల కోట్ల రూపాయలు ఇప్పిస్తానని మాత్రమే చెప్పింది. సరే, అసలు దేశ ఆర్థిక పరిస్థితి ఎట్లా ఉంది? అనేది గమనిస్తే.. ప్రస్తుతం ఆర్థిక మందగమనంలో దేశం నడుస్తోందని నిపుణులు సైతం హెచ్చరిస్తున్నారు. బడ్జెట్ ప్రవేశ పెట్టడానికి ముందు రోజు ఆర్థిక సర్వేను పార్లమెంట్లో సమర్పించారు. దీనిని గమనిస్తే.. దేశంలో నిరుద్యోగం తీవ్రత ఎక్కువగా ఉందని ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని స్పష్టం చేస్తోంది. ఇది గడిచిన 10 సంవత్సరాల కాలానికి ఇచ్చిన ఆర్థిక సర్వే. వాస్తవానికి ఆర్థిక సర్వే ప్రామాణికంగా తీసుకున్నప్పుడు దేశంలో నిరుద్యోగం అదేవిధంగా సామాన్యుల చేతిలో డబ్బులు లేకపోవడం గమనార్హం. ఒకవైపు ఉద్యోగాల కలపనలో తాము ముందున్నామని మోడీ చెప్తున్నా.. వాస్తవ పరిస్థితి మాత్రం దానికి చాలా భిన్నంగా ఉందని ఆర్థిక సర్వే వెల్లడించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిరుద్యోగం విషయంలో స్పష్టమైన వైఖరి తీసుకొని ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తుందని అందరూ ఆశించారు. కానీ బడ్జెట్ అలా కనిపించిన పరిస్థితి లేదు. వాస్తవం పరిశీలిస్తే మాత్రం రుణాలు ఇప్పించి ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేయడం ఇక్కడ గమనించాల్సిన విషయం. ఇదే సమయంలో 500 టాప్ కంపెనీల్లో కోటి మంది నిరుద్యోగులకు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వారికి శిక్షణ ఇప్పిస్తామని ప్రకటించారు. ఇది ఎంతవరకు సాధ్యమయ్యే పని అనేది గమనిస్తే సాధ్యం కాదనేది ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. ఎందుకంటే దేశంలో టాప్ 500 కంపెనీలు శిక్షణ తీసుకోవాలంటే ఉన్నత స్థాయి చదువు కచ్చితంగా అవసరం. ఆ స్థాయిలో గ్రామీణ యువత లేకపోవడం, ఉన్నా.. వారికి అవకాశాలు దక్కుతాయా అనేది ప్రధాన సమస్యగా మారింది. ఒకవేళ ప్రభుత్వం చెబుతున్నట్టుగా కోటి మందికి ఐదు సంవత్సరాలు టాప్ 500 కంపెనీల్లో శిక్షణ ఇచ్చి బయటకు తీసుకు వచ్చినా.. తదుపరి వారి భవిష్యత్తు ఏమిటి అనేది ఆలోచించాల్సిన అవసరం ఏర్పడింది. ఇక్కడ శిక్షణ ఇవ్వడం ఒకటే కాదు, శిక్షణ తర్వాత వారికి ఉపాధి చూపించాలి. ఉద్యోగాలు చూపించాలి. ఈ విషయాన్ని తీసుకున్నప్పుడు బడ్జెట్లో అటువంటి ప్రస్తావన ఎక్కడా కనిపించలేదు. పైగా ముద్రా రుణాలను పెంచడం ద్వారా మరింతగా ప్రజలు అప్పులు తీసుకుని ఉపాధి కల్పించుకునే దిశగా నడిపిస్తున్నట్లు కనిపిస్తుంది. ఒకప్పుడు ప్రభుత్వమే కొన్ని రంగాలను స్థాపించి వాటిలో ఉపాధి కల్పన దిశగా అడుగులు వేసింది. ఇలా వచ్చిందే గ్రామీణ ఉపాధి హామీ పథకం. దీనివల్ల దేశవ్యాప్తంగా నిరక్షరాస్యులు అయిన కార్మికులు ఉపాధి పొందుతున్నారు. చదువుకున్న నిరుద్యోగులను కూడా ఇలాంటి పథకాలతో ప్రోత్సహించాల్సిన అవసరాన్ని మోడీ ప్రభుత్వం వదిలేసింది. పూర్తిస్థాయిలో నిరుద్యోగాన్ని రూపుమాపే చర్యలకు మోడీ ప్రభుత్వం చర్యలు చేపట్టలేదు. ఇలా చేయనప్పుడు దేశ ఆర్థిక పరిస్థితులు ఏ విధంగా మెరుగుపడుతుం ది అనేది ప్రశ్న. దేశ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడాలంటే ప్రజల చేతిలో డబ్బు ఉండాలి. తద్వారా మాత్రమే ఆర్థిక కార్యకలాపాలు పుంజుకునే పరిస్థితి ఉంటుంది. కానీ ఇప్పుడు ప్రజల చేతుల్లో డబ్బులు లేకపోగా పన్నుల రూపంలో వారి నుంచి ఎడాపెడా వసూలు చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. దీంతో దేశవ్యాప్తంగా ఆర్థిక పరిస్థితి మెరుగు పడకపోగా మరింత దిగజారి పోయే పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా నిత్య అవసరాల ధరలను ప్రస్తావించలేదు. అదేవిధంగా రైతుల విషయాన్ని పరిశీలిస్తే రైతులకు భారీ ఎత్తున మద్దతు ధరలు ప్రకటించామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల ప్రకటించారు. కానీ మరోవైపు రైతులు వాడే ఎరువులు, పురుగు మందులు గమనిస్తే వీటి మీద భారీగా సెస్సులు పెంచారు. తద్వారా రైతులకు భారం పెరుగుతుంది. ఇది అంతిమంగా నిత్యవసరాల ధరలను పెంచుతుంది. ముఖ్యంగా అమ్మోనీయా, నైట్రేట్ ఉత్పత్తులకు సంబంధించి ధరలు పెంచారు. తద్వారా రైతులకు ఎరువులు పురుగు మందులు రూపంలో మరింత భారం పడనుంది. ఇది కూడా రాష్ట్ర దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపించే అవకాశం ఉంది. కాబట్టి ఇలాంటి నిర్ణయాల విషయంలో మోడీ సర్కారు వెనక్కి తగ్గి సమీక్షించి నిర్ణయాలు తీసుకుంటే మంచిదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# అధ్వక్షా.. సమస్యలు పరిష్కరించాలి!

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో పలు డివిజన్లలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతుండగా.. మరికొన్ని చోట్ల నత్తనడకన సాగుతున్నాయి. అపరిష్కృత సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పాలకవర్గం ఏర్పడి నేటికి నాలుగేళ్లు పూర్తయింది. పాలకులు కౌన్సిల్ వేదికగా సమస్యలు ప్రస్తావించి గడువులోగా పరిష్కరించేలా చొరవ చూపించాలి.

**ప్రశ్నార్థకంగా డంపింగ్‌యార్డు**

నగరంలో డంపింగ్‌యార్డు ప్రశ్నార్థకంగా మారింది. బయోమైనింగ్ ప్రక్రియ ఆగిపోవడంతో చెత్తంతా పేరుకుపోతుంది. నాలుగు నెలలుగా పొగ వస్తుండగా ఆ ప్రాంతవాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. చెత్తను తగ్గించేందుకు చర్యలు, కొత్త డంపింగ్‌యార్డు కోసం ప్రయత్నాలు చేయడంలేదు. రానున్న వేసవిలో మంటలు తీవ్రమయ్యే అవకాశముంది.

**అసంపూర్తిగా పనులు**

నగరవ్యాప్తంగా నాలుగు నెలల కిందట రూ.132 కోట్లతో ప్రారంభించిన రహదారులు, మురుగుకాలువ పనులు పలు చోట్ల పూర్తి చేయగా, మిగతా చోట్ల పెండింగ్‌లో ఉన్నాయి. రెండు నెలలుగా తవ్వి వదిలేయగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. స్తంభాలు ఉన్న చోట తొలగించకుండా మురుగుకాల్వలు వంకర టింకరగా నిర్మించారు. విలీన కాలనీల్లో రానున్న వేసవిలో తాగునీటికి అవస్థలు రాకుండా ముందస్తు చర్యలు ప్రారంభించాలి. అసంపూర్తి స్మార్ట్‌సిటీ, అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి.

**ఖాళీగా వెండింగ్ జోన్ల దుకాణాలు**

రోడ్లపై క్రయవిక్రయాలు జరపకుండా వీధివ్యాపారుల కోసం నిర్మించిన వెండింగ్ జోన్లు నిర్మించి వదిలేశారు. కొన్ని నెలలుగా ఖాళీగా ఉంటుండగా వీటిని ఏ ప్రాతిపదికన కేటాయిస్తారనే విషయంలో స్పష్టత లేదు. రోడ్డు విస్తరణలో భాగంగా ఆయా ప్రాంతవాసులకు కేటాయించాల్సి ఉండగా ఇతరులు పైరవీలు చేయడం, రూ.లక్షల్లో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రోడ్లపై జీవనోపాధి చేస్తున్న వారిని గుర్తించి వీటిని అప్పగిస్తే వారికి ఆసరాగా ఉండనుంది. స్మార్ట్‌సిటీ నిధులతో అంబేద్కర్ స్టేడియం ప్రాంతంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించగా అదీ అలాగే నిరుపయోగంగా ఉంది.

**కుక్కలు..కోతులు..పందులు**

నగర వీధుల్లో కోతులు, కుక్కలు, పందుల సమస్య వెంటాడుతుంది. పలు ప్రాంతాల్లో కోతులు నానాహంగామా చేస్తున్నాయి. టెండర్ల గడువు ముగియడంతో వీటిని పట్టుకోవడం లేదు. కుక్కల నియంత్రణ చర్యలు పూర్తిగా నిలిపి వేశారు. ప్రజల వెంట పడుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. పందులను నగరానికి దూరంగా పెంచాలని, ప్రజారోగ్యానికి ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పలు సమావేశాల్లో హెచ్చరిస్తున్నా మార్పు రావడంలేదు.

ఫిర్యాదుల పరంపర కార్యాలయం ఇంజినీరింగ్ విభాగం అధికారులపై, అభివృద్ధి పనులపై ఫిర్యాదుల పర్వం కొనసాగుతోంది. ఇటీవల స్మార్ట్‌సిటీ, సీఎంఏ నిధులు రూ.132 కోట్ల పనులపై ఆరోపణలు వచ్చాయి. నగర పాలిక పరిధి పనులు ఇతర ప్రాంతాల్లో ఎలా చేస్తారనే విషయంపై వచ్చిన ఫిర్యాదుపై ఆర్డీవో విచారణ చేశారు. ఒక డీఈఈని ఏకంగా బదిలీ చేశారు. ఎల్‌పీసీ ఇవ్వకుండా విధులు నిర్వర్తిస్తుండటంతో ఎస్‌ఈని కలెక్టర్ సరెండర్ చేశారు. వీటన్నింటిపై ఎలా స్పందిస్తారో చూడాలి. 22 అంశాలతో ఎజెండా మొత్తం 22 ఎజెండా అంశాలతో పాలకవర్గ సభ్యులకు గత నెలలో ప్రతులను పంపించారు. వీటిలో టెండర్ నోటీసులు, హరితహారం, ఇతర రకాల బిల్లుల చెల్లింపులు, వాహనాల మరమ్మతులు, పరిపాలన అనుమతులు, ఈ–ఆఫీసు నిర్వహణకు డిజిటల్ కీలు వంటివి ఉన్నాయి.

# కంచె లేదు... రక్షణ కరవు..

గోదావరిఖని : ఇది రాజన్న సిరిసిల్ల జిల్లా మధ్యమానేరు జలాశయంపై కొదురుపాక వద్ద రక్షణ కంచెతో కూడిన వంతె. ఈ వంతెన వద్ద కంచె ఏర్పాటు చేయని సమయంలో ఈ జలాశయం వద్దకు వచ్చి అందులో దూకి పలువురు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలున్నాయి. ఆత్మహత్యలకు కేంద్రంగా మారుతుండటంతో అధికారులు ఇనుప కంచెను ఏర్పాటు చేశారు.ఇది గోదావరిఖని శివారులోని కోల్‌బెల్టు వంతెన. రక్షణకోసం తక్కువ ఎత్తులో సిమెంటు గోడ ఉంది. కేవలం రెండున్నర అడుగుల ఎత్తులో ఉన్న వంతెన రక్షణగోడపై నుంచి దూకి ఎంతోమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వంతెనకు ఇరువైపులా ఉన్న రక్షణగోడ తక్కువ ఎత్తులో ఉండటంతో సులువుగా నదిలోకి దూకే అవకాశం ఏర్పడుతోంది.

కోల్‌బెల్టు వంతెన ఆత్మహత్యలకు కేంద్రంగా మారింది. ఈ ప్రాంతంలో నదిలోదూకి ఎంతోమంది ఆత్మహత్యాయత్నం చేస్తున్నారు. కొంత మందిని ఇక్కడ ఉన్న సిబ్బంది రక్షిస్తున్నా మరికొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల ఒకే రోజు రెండు మృతదేహాలు నదిలోంచి బయటపడ్డాయి. గోదావరిఖనికి చెందిన ఇద్దరు యువకులు నదిలో దూకి బలవన్మరణాలకు పాల్పడ్డారు. కుటుంబ సమస్యలు.. వ్యక్తిగత బాధలు.. కుటుంబ కలహాలు.. అనారోగ్య సమస్యలు.. ఇలాంటివి ఏదైనా ఆత్మహత్యవైపు పురిగొల్పుతున్నాయి. గడచిన నాలుగేళ్లలో 37 మంది నదిలో దూకి ప్రాణాలు కోల్పోయారు. అక్కడ రివర్‌గార్డులను ఏర్పాటు చేయడంతో నిరంతరం పర్యవేక్షణతో 157 మందిని కాపాడారు. ఇప్పటి వరకు మొత్తం 192 మంది బలవన్మరణానికి ప్రయత్నించారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలను కలుపుతూ గోదావరి నదిపై నిర్మించిన కోల్‌బెల్టు వంతెన రవాణా పరంగా రెండు జిల్లాల ప్రజలకు సౌకర్యంగా మారినప్పటికీ ఇదే వంతెన ఆత్మహత్యలకు కేంద్రంగా మారింది.

**పరిశ్రమల సహకారం అవసరం**

రక్షణ కంచె ఏర్పాటుకు రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న భారీ పరిశ్రమల నుంచి సహకారం అవసరం. వంతెనపై ఇరువైపులా ఇనుప కంచె ఏర్పాటు చేయడం ద్వారా ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేయవచ్చు. గతంలో ఎన్టీపీసీ నిధులతో ఇనుప కంచె ఏర్పాటు చేయాలని భావించారు. పోలీసు ఉన్నతాధికారులు సైతం ఎన్టీపీసీ అధికారులతో గతంలో మాట్లాడారు. నిధులు కేటాయించేందుకు ఎన్టీపీసీ మొగ్గు చూపినా పర్యవేక్షణ లేకపోవడంతో ఇనుప కంచె ఏర్పాటు ప్రయత్నాలు ముందుకు సాగలేదు. సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎ ఫ్‌సీఎల్, జెన్‌కో పరిశ్రమలకు కేంద్రమైన రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో నాలుగు సంస్థల నుంచి నిధులు కేటాయిస్తే పక్కాగా కంచె ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంటుందని స్థానికులు అంటున్నారు.

# చోరీల మాఫియా..పట్టుకునేదెవరయా?




మందమర్రి :మూడేళ్ల క్రితం మందమర్రి స్టోర్‌లో తాళం వేసి ఉండగానే అందులోని ఉన్న కేబుల్ చోరీకి గురైంది. 160 కిలోల రాగి తీగలు ఎత్తుకెళ్లారు. మరుసటి రోజు వచ్చిన సిబ్బంది తాళం తెరిచి చూస్తే విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులకు ఫిర్యాదు చేశారు. నేటికీ దొంగతనం చేసింది ఎవరనేది తేల్చలేదు. ఇనుప సామగ్రి ఎత్తుకెళ్లారు. ఈ చోరీకి సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. దొంగల ముఖాలు కన్పిస్తున్నప్పటికీ ఇప్పటి వరకు పట్టుకోలేదు. రామకృష్ణాపూర్‌లో ఇరవై రోజుల క్రితం మూసివేసిన కోల్‌వాషరీ ప్లాంటు నుంచి బొగ్గు చూర దొంగిలిస్తుండగా సింగరేణి రక్షణ సిబ్బంది పట్టుకున్నారు. పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఎస్‌అండ్‌పీసీ అధికారి రామకృష్ణాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రెండు లారీలు, ఒక జేసీబీలను సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేశారు.అత్యంత నిఘా నీడలో ఉండే జైపూర్ ఎస్టీపీపీలోని స్టోర్‌లో గతేడాది ఫిబ్రవరిలో భారీ చోరీ జరిగింది. ఎస్ఐఎస్ఎఫ్, సింగరేణి రక్షణ వలయం కళ్లు కప్పి లోనికి చొరబడ్డ దొంగలు రూ.43 లక్షల విలువైన యంత్రాల కోసం వినియోగించే సామగ్రి ఎత్తుకెళ్లారు. పోలీసులు దొంగలు ఎవరనేది తేల్చలేదు.

సింగరేణి ప్రాంతంలో స్క్రాప్ దొంగలు రెచ్చిపోతున్నారు. ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నారు. అడ్డొచ్చిన రక్షణ సిబ్బందిపై దాడులకు పాల్పడుతుండటం కలకలం రేపుతోంది. పక్కా ప్రణాళికతో వస్తున్న దొంగలు నిమిషాల వ్యవధిలో పని ముగించుకుని ఉడాయిస్తున్నారు.సింగరేణిలో బొగ్గు వెలికితీసేందుకు భారీ యంత్రాలు, నాణ్యమైన ఇనుప సామగ్రి వినియోగిస్తుంటారు. అవి తరచూ మరమ్మతులకు గురవుతుంటాయి. వాటిని గని ఆవరణలోని షెడ్డుకు, వర్క్‌షాప్, స్టోర్‌కు తరలిస్తుంటారు. కొందరు ఇంటి దొంగల ద్వారా సమాచారం తెలుసుకుని ఒకటి, రెండ్రోజులపాటు రాత్రి వేళలో రెక్కి నిర్వహిస్తున్నారు. సామగ్రి అధిక బరువు ఉంటుండటంతో 10 నుంచి 15 మంది ముఠాగా ఏర్పడి పక్కా ప్రణాళికతో చోరీ చేసే ప్రదేశానికి చేరుకుంటారు. కార్మికులు, ఉద్యోగుల అలికిడి లేని సమయం.. సెక్యూరిటీ ప్రొటెక్షన్ కార్ప్స్ (ఎస్‌అండ్‌పీసీ) ఉద్యోగులు షిఫ్టు మారే సమయంలో ఒక్కసారిగా మూకుమ్మడిగా లోనికి చొరబడుతారు. రక్షణ సిబ్బంది ఉంటే వారిపై దాడి చేసి సామగ్రి అపహరిస్తున్నారు. రక్షణ సిబ్బంది అధికారులకు సమాచారం అందించి వారు వచ్చేలోపే దొంగలు తమ పనికానిస్తుంటారు. అయిదు నుంచి 10 నిమిషాల వ్యవధిలో తాము దొంగతనం చేయాల్సిన సామగ్రి గుర్తించి పదునైన ఆయుధాలతో కట్ చేసి బయటకు తీసుకెళ్తారు. అక్కడి నుంచి సులువుగా పట్టుకెళ్లేందుకు ముక్కలు, ముక్కలుగా చేసి ద్విచక్ర వాహనాలపై తీసుకెళ్తారు. వెంటనే కేబుల్ తొలచి అందులోని రాగి సొత్తు కొనుగోలు చేసే స్క్రాప్ దుకాణం యజమానికి విక్రయిస్తున్నారు. ఇదంతా గంటల వ్యవధిలోనే జరిగిపోతోంది.

లోపాలు ఇవే..మూడేళ్ల క్రితం వరకు గనులపై సీఐఎస్ఎఫ్ సిబ్బంది కాపలా ఉండడంతో చాలా వరకు ప్రశాంతంగా ఉండేది. ప్రస్తుతం వారిని వెనక్కి పంపించడంతో ఎస్‌అండ్‌పీసీ, ప్రైవేట్ రక్షణ సిబ్బంది కాపలా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలోనే దొంగలు రెచ్చిపోతుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చోరీ జరిగిన వెంటనే పోలీసులకు, అధికారులకు సమాచారం అందించడంలో జాప్యం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కొన్నిచోట్ల సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగల పని సులువు అవుతుంది. ఒకవేళ చోరీ జరిగితే కిందిస్థాయి సిబ్బందిని బాధ్యుడిని చేస్తూ వేధింపులకు గురి చేస్తూ దొంగతనం విషయాన్ని బయటికి పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి.

**స్క్రాప్ దుకాణాలపై నిఘా ఏది..**

సింగరేణి సొత్తు దొంగిలించిన వెంటనే తమకు అనుకూలంగా ఉండే స్క్రాప్ దుకాణం యజమానికి విక్రయిస్తుంటారు. వచ్చిన డబ్బుతో దొంగలు జల్సాలు చేస్తూ డబ్బు అయిపోయిన తర్వాత తిరిగి చోరీలకు పాల్పడుతున్నారు. చోరీ చేసే వారిలో చాలా మంది 18–30 ఏళ్లలోపు వారు ఉంటారని సమాచారం. ఇటీవల మందమర్రిలో దొంగసొత్తు తరలిస్తున్నారని సమాచారం అందుకున్న ఎస్‌అండ్‌పీసీ ఉద్యోగులు తనిఖీగా వెళ్లగా స్క్రాప్ దుకాణం యజమాని దాడికి యత్నించారు. కొందరు స్క్రాప్ దుకాణం యజమానులు ఇల్లు, వ్యాపారం నిర్వహించే చోట చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రక్షణ చట్రంలో ఉంటున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ముందుగా వీరిని కట్టడి చేస్తే చోరీలను నియంత్రించవచ్చునేది నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఓ బింగో లెస్ పాకెట్స్ లో ఫంగస్ ఉండటంతో... బెంబేలెత్తిన కొనుగోలుదారు...

శామీర్ పేట, (గరుడ వార్త) : ఓ బింగో చిప్స్ ప్యాకెట్ లో ఫంగస్ ఉండడంతో ఒక్కసారిగా వినియోగదారుల్లో కలకలం రేగింది. మండల కేంద్రం మూడు చింతలపల్లి లో ఓ కిరాణా షాపులో బింగో లేస్ ప్యాకెట్లో ఫంగస్ (బూజు) కనిపించింది. శనివారం మూడు చింతలపల్లి గ్రామంలోని గిరీష్ కిరాణా దుకాణంలో వినియోగదారుడు ఒక బింగోలే ప్యాకెట్ను కొనుగోలు చేసి ఇంట్లో చిన్న పాపకు ఇచ్చాడు. ఆ ప్యాకెట్ లో ఫంగస్ నిండిపోయింది. ఇది గమనించిన వినియోగదారుడు ఒక్కసారిగా కంగుతిన్నాడు. కిరాణా జనరల్ స్టోర్ దుకాణంలో నగరానికి చెందిన ఓ కొనుగోలుదారుడు ప్రతిరోజు అక్కడనే కిరణ సరుకులు కొనుగోలు చేస్తాడు రోజు మాదిరిగానే తన పిల్లలకు





బింగో లేస్ ప్యాకెట్స్ తీసుకున్నాడు. ఇంటికి వెళ్లి చూసేసరికి ప్యాకెట్స్ లో ఫంగస్ (బూజు) రావడంతో ఒక్కసారిగా కంగుతిన్నాడు. కొనుగోలుదారుడు మూడు చింతలపల్లి మండల తాసిల్దార్ కు ఫిర్యాదు చేయగా, డిప్యూటీ తహసిల్దార్ నాగజ్యోతి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాఘవసాగర్ కలిసి గిరీష కిరణ దుకాణ సముదాయాన్ని తనిఖీలు చేశారు. బింగో లేస్ ప్యాకెట్లను సీజ్ చేశారు. అలాగే ఫుడ్ ఇన్స్పెక్టర్కు ఫిర్యాదు చేశారు.

## ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ ఆధ్వర్యంలో సి పి ఆర్ పై అవగాహన కార్యక్రమం

శామీర్ పేట, (గరుడ వార్త) : తెలంగాణ రాష్ట్ర సి పి ఆర్ అవగాహన దినోత్సవం సందర్భంగా ఈ ఎం ఆర్ ఐ గ్రీన్ హెల్త్ ప్రధాన కార్యాలయంలో సి పి ఆర్ పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ, రాష్ట్ర ఆరోగ్య శాఖ, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు, ఎన్ హెచ్ ఎం డాక్టర్ పృథ్వీ, ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ డైరెక్టర్ ఐపీఎస్ డాక్టర్ వెంకటేశం, మెడికల్ డైరెక్టర్ ఈ ఎం ఎల్ సి, ఈ ఎం ఆర్ ఐ డాక్టర్ రమణా రావు, తెలంగాణ 108 రాష్ట్ర కార్య నిర్వహణ అధికారి ఎం ఏ ఖలీద్ హాజరు అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్గీయ ఏ పి జే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఈ రోజును సి పి ఆర్ అవగాహన దినోత్సవం గా



గుర్తిస్తూ రాష్ట్ర ప్రజలందరూ సి పి ఆర్ పట్ల అవగాహన కలిగియుండాలని సూచించారు. ఈ సంధ్బంగా సిపిఆర్ ఎప్పుడు చెయ్యాలి, ఎలా చెయ్యాలి అనే విషయాల పైన డాక్టర్ రమణా రావు వివరించారు. అలాగే డాక్టర్ రవీణ్, డాక్టర్ జావీద్ బృందం సి పి ఆర్ ప్రదర్శన నిర్వహించారు, ఈ కార్యక్రమంలో సుమారు 500 మంది బృందానికి సి పి ఆర్ పట్ల అవగాహన కల్పించారు. రాబోవు రోజుల్లో ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రతి ఒక్కరూ సిపిఆర్ పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

## నాణ్యత నగుబాటు.. నిధులు నీళ్లపాలు..!

అశ్వారావుపేట : కోట్ల రూపాయల అంచనా వ్యయంతో పాములేరు వద్ద చేపట్టిన గోడ నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలివ్వడంతో నిధులన్నీ నీళ్లపాలయ్యాయి. నాణ్యత నగుబాటుగా మారింది. వివరాలను పరిశీలిస్తే..అశ్వారావుపేట నియోజకవర్గం ములకలపల్లి మండలం తాళ్లపాయి సమీపంలో పాములేరు వాగు నుంచి వచ్చే వరదనీరు ఏటా అక్కడి రోడ్డుకు గండిపెడుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారుల విజ్ఞప్తి మేరకు దీనిని అరికట్టేందుకు వాగుకు ఒకవైపు గోడ నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం రూ.1.85కోట్లు మంజూరు చేసింది. ఈ పనిని గుత్తేదారు 17శాతం తక్కువకు టెండరు దక్కించుకున్నారు. ఇందులో కేవలం పని విలువ రూ.1.40కోట్లు. మిగిలిన నిధుల్లో సీనరేజ్, లేబర్ సెస్, ఐటీ, జీఎస్టీ అన్ని కలిపి ఉన్నాయి. పనులను ఆరు నెలల క్రితం ప్రారంభించారు. కింద నాలుగు అడుగుల వెడల్పు, పైకి వచ్చేసరికి 40 అంగుళాల వెడల్పుతో పిల్లర్లు లేకుండా బాక్సు మాదిరి గోడను ఆరడుగుల ఎత్తున కట్టారు. పునాది లేకుండా అడుగు భాగాన కంకర, సిమెంటు కలిపి బేస్ వేసి, ఆ పైన ఇనుప ఊచలతో బాక్సు కట్టి దానికి కాంక్రీటు వేశారు. ఈ పనుల్లో నాణ్యత పాటించకపోవడంతో డిసెంబరు మొదటి వారంలో వచ్చిన వరదలకు ఆరు అడుగుల గోడ ఎక్కడికక్కడ ముక్కలైంది. తగిన సైజు ఊచలు వాడలేదని విమర్శలు ఉన్నాయి. 364 మీటర్ల పొడవులో మూడొంతుల గోడ ఎక్కడికక్కడ విరిగిపోయి కూలిపోయింది. వంతెన పోర్షన్ వద్ద రెండు వైపులా ధ్వంసమైంది.

తాళ్లపాయి నుంచి ముందుకు వెళ్లే మార్గంలో వాగుకు వాలుగా గోడ కట్టకుండా ఎల్ ఆకారంలో అడ్డంగా నిర్మించటంతో వరద వచ్చినప్పుడు ఆ ఉద్ధృతికి వాగు వెనుక్కు తన్ని కొత్త గోడ కూలిపోయినట్లు భావిస్తున్నారు. కూలిన గోడ మధ్యలో ఇనుప ఊచలు సైతం పలు చోట్ల విరిగిపోయాయి. వివిధ అంశాల్లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చినా.. అధికారులు మాత్రం వరద అధికంగా రావడం వల్లే గోడ కూలిపోయిందంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు.

పాములేరు వరద కోతకు గురికాకుండా 15 అడుగుల గోడ నిర్మాణానికి రూ.8.5 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. నీటిపారుదల శాఖ రూ.1.85కోట్లు మంజూరు చేసింది. పాములేరుకు భారీగా వరద నీరు రావడంతో నిర్మించిన ఆరు అడుగుల గోడ కూలిపోయింది. ఇంతవరకూ గుత్తేదారుకు ఎలాంటి బిల్లు చెల్లించలేదు. గోడ నిర్మాణం పూర్తయితేనే బిల్లులు చెల్లిస్తాం. శ్రీనివాస్, డీఈఈ, ఆర్‌అండ్‌బీ శాఖ

## విశ్వనగరంగా హైదరాబాద్.. అభివృద్ధికి రూ.10 వేల కోట్లు

హైదరాబాద్: విశ్వనగరంగా హైదరాబాద్‌ను (%Hyderabad%) తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర బడ్జెట్‌ను గురువారం ఆయన అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి భారీగా రూ. 10వేల కోట్లు కేటాయించారు. శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో విస్తరణకు రూ. 100 కోట్లు, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు రూ. 1500 కోట్లు, ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు రూ. 1,525 కోట్లు, పాతబస్తీ మెట్రో విస్తరణకు రూ. 500 కోట్లు, ఔటర్ రింగ్ రోడ్డుకు రూ. 200 కోట్లు, హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు రూ. 500 కోట్లు, మెట్రో వాటర్ వర్క్స్ రూ. 3,385 కోట్లు, హైడ్రా సంస్థకు రూ. 200 కోట్లు కేటాయించారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న చారిత్రాత్మక నగరం హైదరాబాద్‌ను మరింత ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నాం. హైదరాబాద్‌లో ఉద్యోగ, ఉపాధి పొందుతున్నవారికి కార్యాలయాలకు దగ్గరగా, శాటిలైట్ టౌన్‌షిప్‌ల నిర్మాణాన్ని నగరం చుట్టూ ప్రోత్సహిస్తాం. ఈ టౌన్‌షిప్ లలో సరసమైన ధరల్లో పేద, మధ్యతరగతి వారికి అనుకూలమైన నివాసగృహాల నిర్మాణాలను అందించేలా కృషి చేస్తాం ప్రస్తుతం మూడు ట్రాఫిక్ కారిడార్లలో మెట్రో సౌకర్యం ఉంది. వివిధ వర్గాల అవసరాలను తీర్చడంతో పాటు నగరంలో అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో, ప్రభుత్వం 78.4 కి.మీ. పొడవున్న 5 అదనపు కారిడార్లను రూ. 24,042 కోట్లతో అభివృద్ధి పరుస్తుంది. ఇందులోభాగంగా మెట్రో రైలును పాతనగరానికి పొడిగించి దానిని శంషాబాద్ విమానాశ్రయానికి అనుసంధానం చేస్తాం. ప్రస్తుతమున్న కారిడార్లను నాగోలు నుంచి ఎల్.బి.నగర్ వరకు విస్తరిస్తాం. నాగోలు, ఎల్.బి నగర్, చంద్రాయణగుట్ట స్టేషన్లను ఇంటర్ ఛేంజ్ స్టేషన్లగా అభివృద్ధి చేస్తాం. మియాపూర్ నుంచి పటాన్ చెరువుకు, ఎల్.బి.నగర్ నుంచి హయత్ నగర్ వరకు మెట్రో రైలు సౌకర్యాన్ని పొడిగించాలని కూడా ప్రణాళిక సిద్ధం చేశాం.

హైదరాబాద్, ఔటర్ రింగ్ రోడ్డు వరకు గల ప్రాంతాలను కోర్ అర్బన్ రీజియన్‌గా గుర్తించి వాటి అభివృద్ధికి ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందిస్తాం. ఔటర్ రింగు రోడ్డును నగర సరిహద్దుగా పరిగణిస్తాం. ఓఆర్ఆర్ పరిధిలో విపత్తుల నిర్వహణకు ఒక ఏకీకృత సంస్థ ఏర్పాటు. జీహెచ్ఎంసీ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాలు దీని పరిధిలోకి వస్తాయి.

పట్టణ విపత్తులను నివారించడానికి, వాటిని ఎదుర్కొనడానికి తీసుకోవాల్సిన చర్యలను చేపట్టడంతో పాటు, ఎటువంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొని తక్షణ రక్షణ చర్యలు తీసుకొనే విషయంలో జాతీయ, రాష్ట్రేతర సంస్థలతో సమన్వయం. ఈ వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యత హైదరాబాద్ విపత్తు నివారణ, ఆస్తుల పరిరక్షణ సంస్థ (%HYDRAA%) చేస్తుంది. ఈ సంస్థలో ఆస్తుల పరిరక్షణకు, విపత్తుల నిర్వహణకు ప్రత్యేక విభాగాలు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా సుమారు 110 చదరపు కి.మీ. పట్టణ ప్రాంతం పునరుజ్జీవనం. నదీ తీర ప్రాంతంలో కొత్త వాణిజ్య, నివాస కేంద్రాలు, పాత హెరిటేజ్ ప్రాంతాలకు కొత్త సొబగులు.

మూసీ నదీ పరివాహక ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టులో రిక్రియేషన్ జోన్‌లు, పాదచారుల జోన్‌లు, పీపుల్స్ ప్లాజాలు, చిల్డ్రన్స్ థీమ్ పార్కులు, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్‌ల అభివృద్ధి. లండన్ నగరంలో ఉన్న థేమ్స్ నదీ పరివాహక అభివృద్ధి తరహాలో మూవీ అభివృద్ధి. హైదరాబాద్ నగరాభివృద్ధి, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు రూ. 1,500 కోట్లు ప్రతిపాదనహైదరాబాద్ నగర ప్రాధాన్యం దృష్ట్యా నగరాభివృద్ధికి మరింత పెద్దపీట. %GHMC, HMDA%, సేవలను ప్రజలకు మరింత మెరుగ్గా అందించేందుకు %GHMC% పరిధిలో మౌలిక వసతుల కల్పనకు రూ. 3,065 కోట్లు. %HMDA% పరిధిలో మౌలిక వసతుల కల్పనకు రూ. 500 కోట్లు. మెట్రో వాటర్ వర్క్స్‌కి రూ. 3,385 కోట్లు ప్రతిపాదన. హైడ్రాకి రూ. 200 కోట్లుఎయిర్‌పోర్టు వరకు మెట్రో విస్తరణకు రూ. 100 కోట్లు, ఔటర్ రింగ్ రోడ్డు కోసం రూ. 200 కోట్లు, హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకి రూ. 500 కోట్లు, పాత నగరానికి మెట్రో విస్తరణకి రూ. 500 కోట్లు, మల్టీ మోడల్ సబర్బన్ రైలు ట్రాన్స్‌పోర్టు సిస్టమ్ కోసం రూ. 50 కోట్లు

రీజనల్ రింగ్ రోడ్ (%===%)తో అభివృద్ధి మరింత వేగవంతం. ఉత్తర ప్రాంతంలోని 158.6 కి.మీ. పొడవున్న సంగారెడ్డి- తూప్రాన్ - గజ్వేల్ - చౌటుప్పల్ రోడ్డును, దక్షిణ ప్రాంతంలోని 189 కి.మీ.ల పొడవున్న చౌటుప్పల్ -షాద్ నగర్-సంగారెడ్డి రోడ్డును, జాతీయరహదారులుగా ప్రకటించడానికి వీలుగా అప్ గ్రేడ్ చేయాలని ప్రభుత్వం ప్రతిపాదన. రీజనల్ రింగు రోడ్డు హైదరాబాద్ నగర ఉత్తర-దక్షిణ ప్రాంతాలనూ, తూర్పు-పశ్చిమ ప్రాంతాలనూ కలుపుతూ జాతీయరహదారి నెట్‌వర్క్‌తో అనుసంధానం.

ఎక్స్‌ప్రెస్‌వే ప్రమాణాలను దృష్టిలోఉంచుకొని దీని నిర్మాణానికి తగినంత భూమిని సేకరించే ప్రయత్నం. ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా తొలుత నాలుగు లేన్లతో నిర్మించి దానిని ఎనిమిది లేన్ల సామర్థ్యానికి విస్తరణ. ప్రాథమిక అంచనాల ప్రకారం ఆర్.ఆర్.ఆర్ ఉత్తర ప్రాంత అభివృద్ధికి రూ. 13,522 కోట్లు. దక్షిణ ప్రాంతాభివృద్ధికి రూ. 12,980 కోట్లు ఖర్చు. దీనికోసం బడ్జెట్‌లో ప్రస్తుతం రూ. 1525 కోట్ల ప్రతిపాదన

## ఎక్కడి మురుగు అక్కడే..!

కోదాడ : కాల్వలో పెద్ద ఎత్తున మురుగు బయటికి తీసి కనిపిస్తున్న ప్రాంతం మునగాల మండలం తాడువాయి గ్రామంలోనిది. కాల్వలో మురుగు బయటకు తీయక చాలా నెలలైందని, దీంతో పెద్ద మొత్తంలో ఇప్పుడు మురుగు బయటకు వచ్చిందని స్థానికులు వాపోతున్నారు. పారిశుధ్య సిబ్బంది ప్రణాళిక ప్రకారం మురుగు తీయట్లేదు అనడానికి ఈ చిత్రమే సాక్ష్యం. దీంతో దోమల వ్యాప్తి పెరిగి గ్రామంలో విష జ్వరాలు విజృంభించడంతో ఇంటికొకరి చొప్పున జ్వర బాధితులయ్యారు. ఇళ్ల మధ్య ఉన్న మురుగును జిల్లా వైద్యాధికారి కోటాచలం పరిశీలిస్తున్న ఈ ప్రాంతం నడిగూడెం మండలం తెల్లబెల్లి గ్రామంలోనిది. ఈ గ్రామంలో పారిశుధ్య పనులు చేయకపోవడంతో పాటు, ఇళ్ల మధ్యే పెంట దిబ్బలు ఉండటంతో వాటిలోకి నీరు చేరి దోమల వ్యాప్తి విపరీతంగా పెరిగింది. ఇదే కారణంతో గ్రామంలోని నివాసితులు విష జ్వరాల బారిన పడ్డారు. క్షేత్రస్థాయిలో పంచాయతీ సిబ్బంది మురుగు తొలగించట్లేదు అనడానికి ఇదో సాక్ష్యం. గ్రామాల్లో పారిశుధ్య పనులు నిత్యం నిర్వహించేందుకు ట్రాక్టర్‌తో పాటు గ్రామ జనాభాకు సరిపడా సిబ్బంది ఉన్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఎక్కడి మురుగు అక్కడే దర్శనమిస్తోంది. ఇటీవల విష జ్వరాలు ప్రబలడానికి ప్రధాన కారణం మురుగుతో వచ్చిన దోమల వ్యాప్తేనని జిల్లా వైద్యాధికారి పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. దోమల వ్యాప్తి నివారణకు చర్యలేవి..?

గ్రామాల్లో దోమల వ్యాప్తిని నివారించేందుకు ఫాగింగ్ యంత్రాలు, బ్లీచింగ్ పౌడర్ సరిపడా లేదు. అంతంత మాత్రంగానే గ్రామంలో రెండు, మూడు వీధుల్లో ఫాగింగ్ చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి గ్రామానికి సరిపడా ఫాగింగ్ యంత్రాలు, బ్లీచింగ్ పౌడర్ సరఫరా చేయట్లేదని ఆ శాఖ అధికారులే చెబుతుండటం గమనార్హం. గ్రామంలోని ప్రధాన వీధుల్లో నెలకు ఒకసారి మురుగు తీస్తే, లోపలికి ఉండే వీధుల్లో ఆరు నెలలకోసారి కూడా మురుగు తీయట్లేదని స్థానికులు వాపోతున్నారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యంతోనే పలు గ్రామాలవారు విష జ్వరాల బారిన పడుతున్నారని వైద్య అధికారులు బహిరంగంగానే అసహనం వ్యక్తం చేస్తున్నారు. వారానికోసారి మురుగు తొలగించకపోతే చర్యలేసురేశ్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి, సూర్యాపేట వారం రోజుల్లోనే గ్రామంలోని ప్రతి మురుగు కాల్వను శుభ్రం చేయాలి. పారిశుధ్య సిబ్బంది తక్కువగా ఉంటే దినసరి కూలీ చెల్లించి లేబర్ సాయంతో శుభ్రం చేయాలి.

## అగ్నికి ఆజ్యం.. చర్యలు పూజ్యం



హైదరాబాద్: నిబంధనలకు విరుద్ధంగా గోదాములు నిర్వహిస్తున్న యజమానుల నిర్లక్ష్య వైఖరి వల్ల కార్మికులు బలవుతున్నారు. కనీస రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అగ్నికి ఆజ్యం పోసేలా రసాయన డ్రమ్ములు, ఫర్నిచర్, ప్లాస్టిక్ గోదాములు నిర్వహిస్తున్నారు. నివాసాల మధ్య రసాయన డ్రమ్ములను నిల్వ చేయడంతో నాంపల్లి బజార్‌ఘాట్ ఘటనలో 9 మంది దుర్మరణం చెందారు. ఈ ఘటన మరవక ముందే జియాగూడలోని ఫర్నిచర్ గోదాములో మంటలంటుకొని ఓ కుటుంబం చిన్నాభిన్నమైంది. తర్వాత జరిగిన అగ్నిప్రమాద ఘటనలో తండ్రి, కూతురు మరణించగా.. తల్లి, చిన్నకుమార్తె పరిస్థితి విషమంగా ఉంది. ఇంత జరుగుతున్నా అధికారులు తనిఖీలు చేసి ఇలాంటి గోదాములపై కఠిన చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

**నాంపల్లిలో ఏ గల్లీ చూసినా ..**

నాంపల్లిలో ఎటు చూసినా నివాసాల మధ్య రసాయన, ప్లాస్టిక్ గోదాములు కనిపిస్తాయి. ఇటీవల బజార్‌ఘాట్ ఘటన జరిగిన ప్రాంతం చుట్టుపక్కల తనిఖీలు చేస్తే పదుల సంఖ్యలో గోదాములు బయటపడతాయి. పైన నివాసాలు.. సెల్లార్లు, గ్రౌండ్‌ఫ్లోర్లలో గోదాములు నిర్వహిస్తూ అమాయకుల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారు. నాంపల్లి, జియాగూడ ప్రాంతాల్లో వందల సంఖ్యలో గోదాములున్నాయి. పార్కింగ్‌కు బదులుగా మండే స్వభావం ఉన్న రసాయన డబ్బాలు, డ్రమ్ములు, ఎఫ్ఆర్‌పీ రోల్స్, రా మెటీరియల్, పాలిస్టర్ రెజిన్ తదితర ఉత్పత్తులను నిల్వ చేస్తున్నారు.

జీడిమెట్ల పారిశ్రామికవాడకు సమీపంలో ఉన్న నివాస ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. పరిశ్రమల్లో వాడే రసాయన డ్రమ్ములు, సాల్వెంట్లు తదితర మండే, పేలుడు స్వభావం ఉన్న వాటిని నివాస ప్రాంతాల్లో నిల్వ చేస్తుండటంతో ఈ దుస్థితి తలెత్తుతోంది. ఏటా 10 నుంచి 15 మంది మృత్యువాతపడుతున్నారని అధికారుల నివేదికలు చెబుతున్నాయి.

**విద్యుత్తు తీగల విషయంలో..**

గోదాముల్లో విద్యుత్తు తీగల విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. అతుకులు, ఎర్తింగ్ లోపాలు, ఓవర్‌లోడ్, షార్ట్‌సర్క్యూట్ వంటి కారణాలతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. జీహెచ్‌ఎంసీ, అగ్నిమాపకశాఖ, పీసీబీ, పరిశ్రమల శాఖ అధికారులు నగరంలో గోదాముల్లో తనిఖీలు చేపట్టాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. మూడు జిల్లాల్లో 23 వేల గోదాములున్నట్లు అంచనా. వాటిలో రసాయన గోదాములు సుమారు 6 వేలు ఉన్నాయి. నాంపల్లి, జియాగూడ కాటేదాన్, బోయిగూడ, సికింద్రాబాద్, కోఠి తదితర ప్రాంతాల్లో అనుమతి లేనివి 9 వేలు ఉంటాయి. అల్లాపూర్, ముషీరాబాద్, ఫతేనగర్, బాలానగర్ పారిశ్రామికవాడలో స్క్రాప్ గోదాములు.. రాంగోపాల్‌పేట్, ఓల్డ్‌బోయిగూడ, రాణిగంజ్, మినిస్టర్‌రోడ్డులో రసాయన నిల్వ కేంద్రాలు, తుక్కు గోదాములు వందల సంఖ్యలో ఉన్నాయి. బేగంపేట్‌లోని ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్ బస్తీలో, అంబర్‌పేట, గోల్నాక పరిధిలో ప్లాస్టిక్, పేపర్, అట్టల గోదాములు కొనసాగుతున్నాయి.

## ఐదు కలిపేద్దాం... ఒకటి చేసేద్దాం



హైదరాబాద్: అడ్డదిడ్డంగా నిర్మాణాలు.. ఎక్కడపడితే అక్కడ ఆక్రమణలు రాజధాని అభివృద్ధికి విఘాతంగా మారుతున్నాయి. దీనికితోడు మహానగరం పరిధిలో ఐదు మాస్టర్ ప్లాన్లు ఉండటంతో నిర్మాణ అనుమతులు, ఇతరత్రా వ్యవహారాల్లోనూ గందరగోళం నెలకొంటోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక క్రమపద్ధతిలో అభివృద్ధి జరిగేలా ఐదు మాస్టర్ ప్లాన్లను కలిపి ఒకటిగా తయారు చేయాలని నిర్ణయించింది. ఇది అమల్లోకి వస్తే పరిశ్రమలు, భవనాలు, పచ్చదనం ఎక్కడ, ఎలా ఉండాలనే దానిపై జోన్ల కింద నగరాన్ని విభజిస్తారు.

**వచ్చే ఏడాది ప్రథమార్థం నాటికి..**

ప్రస్తుతం పాత ఎంసీహెచ్ పరిధితోపాటు బల్దియాలో కలిసిన 9 మున్సిపాల్టీలకు సంబంధించి ఒకటి, ఎయిర్‌పోర్టు అథారిటీ ప్లాన్, సైబరాబాద్ డెవలప్‌మెంట్ ప్లాన్, హెచ్ఎండీఏ ప్రాంతంలో ఇవి అమల్లో ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలోనే ఐదు కలిపి ఒకటే తయారు చేయడానికి అధికారులు ప్రయత్నాలు చేసినా కొలిక్కిరాలేదు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దీనిపై రెండు గంటలకుపైగా సమీక్ష చేశారు. క్రమపద్ధతిలో హెచ్ఎండీఏ హద్దుల వరకు ఒకే మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించాలని ఆదేశించారు. వచ్చే ఏడాది ప్రథమార్థం నాటికి అమలులోకి తేవాలన్నారు. దీనిపై నివేదిక ఇచ్చేందుకు 3 సలహా కమిటీలకు బాధ్యతలు అప్పగించారు.

**రవాణా వ్యవస్థ..**

ఏడు వేల చదరపు కిలో మీటర్ల పరిధిలో ఈ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించబోతున్నారు. ఇందులో రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయాలనే దానిపై ప్రధానంగా దృష్టిసారించనున్నారు. నగరం మొత్తం మీద భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మెట్రో రైలు వ్యవస్థ ఎలా ఉండాలన్న దానిపై క్షేత్రస్థాయిలో మార్కింగ్ చేస్తారు. కొత్త రోడ్లు, లింక్ రోడ్ల నిర్మాణంపై మాస్టర్ ప్లాన్‌లో సూచిస్తారు. ఇలా మొత్తం రవాణా రంగం మీద సమగ్ర వివరాలు ఉండబోతున్నాయి.

**నగరమంతా డ్రోన్ సర్వే...**

మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో భాగంగా నగరమంతా డ్రోన్ సర్వే చేసి సమాచారం సేకరించనున్నారు. శాటిలైట్ ద్వారా మొత్తం మ్యాపింగ్ చేస్తామని హెచ్ఎండీఏ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. కొత్త మాస్టర్ ప్లాన్‌లో రెవెన్యూ విలేజ్ మ్యాపింగ్ చేయబోతున్నారు. సంబంధిత గ్రామాల్లోని సర్వే నెంబర్లను ఇందులో పొందుపర్చనున్నారు.

**పారిశ్రామికాభివృద్ధి..**

హెచ్ఎండీఏ వరకు ప్రస్తుతం ఎక్కడపడితే అక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో అనేక ప్రాంతాల్లో కాలుష్యంతోపాటు అనేక రకాల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఓఆర్ఆర్- రీజనల్ రింగ్ రోడ్డు మధ్య పరిశ్రమలు ఏ ప్రాంతంలో ఏర్పాటు చేయాలి, ఎకానమిక్ క్లస్టర్లు ఎక్కడ ఉండాలనేది ఈ ప్రణాళికలో ప్రత్యేకంగా గుర్తిస్తారు. ఏ క్లస్టర్‌లో ఏ రకమైన పరిశ్రమలు నెలకోల్పాలో ప్లాన్‌లో పేర్కొంటారు.

**పచ్చదనం..**ఈ ప్లాన్‌లో ప్రత్యేకంగా పచ్చదనం ఏ ప్రాంతాల్లో పెంచాలనే ప్రణాళికనూ రూపొందిస్తున్నారు. కొన్ని గ్రీన్‌బెల్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ జోన్‌లో భవన నిర్మాణ, ఇతరత్ర అనుమతులు ఇవ్వకుండా నిషేధం విధించనున్నారు.

## శిథిలావస్థలో భవనం



కోనరావుపేట: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు సరఫరా అందించటంతో పాటు సమస్యలను పరిష్కరించటానికి, సహకార విద్యుత్తు సరఫరా సంఘం (సెస్) ఉన్నతాధికారులు విధులు నిర్వహించటానికి, పాలకుల సమావేశాలకు సౌకర్యంగా నిర్మించిన సెస్ సేవా సదన్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో వినియోగదారులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి కార్యాలయానికి రావడానికి భయపడుతున్నారు. నూతన భవన నిర్మాణానికి నిధుల మంజూరుకు చేసిన ప్రతిపాదనలు ఏళ్లుగా కాగితాలకే పరిమితమయ్యాయి. అయిదు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనం శ్లాబు, గోడలు పగుళ్లు బారి చిన్నపాటి వర్షం కురిసినా చిత్తడిగా మారుతోంది. **ఆక్రమణకు గురయ్యే అవకాశం**

కోనరావుపేట మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉండగా గృహావసర, వ్యవసాయ, ఇతర వినియోగదారుల కనెక్షన్లు మొత్తం 22,934 ఉన్నాయి. వీరికి నిరంతర విద్యుత్తు సరఫరా చేయడానికి నిమ్మపల్లిలో 132/11 కేవీ, సుద్దాల, కోనరావుపేట, మర్తన్‌పేట, బావుసాయిపేట, వెంకట్రావుపేట, ధర్మారం, నిజామాబాద్ గ్రామాల్లో 33/11 కేవీ విద్యుత్తు సబ్ స్టేషన్లు ఉన్నాయి. మండలంలో ముఖ్యంగా రైతులు వ్యవసాయాధారంగా జీవనం సాగిస్తున్నారు. వినియోగదారులు నూతన కనెక్షన్లు పొందటానికి, విద్యుత్తు సమస్యలు తలెత్తిన సమయంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లటానికి, విద్యుత్తు బిల్లులు చెల్లించటం ఇతర పనుల నిమిత్తం సెస్ సేవా సదన్‌కు వెళుంటారు. భవనం శిథిలం కావడంతో కార్యాలయంలో విలువైన సామగ్రి, రికార్డుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు ప్రహరీ లేకపోవడం, దానికితోడు ప్రధాన కూడలిలో ఉండటంతో ఆక్రమణకు గురయ్యే అవకాశం ఉందని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన భవనం నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**సిరిసిల్ల వెళ్లాల్సి వస్తోంది**

విద్యుత్తు నియంత్రికలు చెడిపోయినా, ఇతర సమస్యలు తలెత్తినా వినియోగదారులు వ్యయ, ప్రయాసలకు లోను కావాల్సి వస్తోంది. సెస్ సేవా సదన్ భవనం శిథిలావస్థకు చేరటంతో ఇబ్బందిగా మారింది. దీంతో విద్యుత్తు నియంత్రిక, నూతన స్తంభాలు, ఇతర సామగ్రికి సెస్ అధికారులు, పాలకులు సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సెస్ ప్రధాన కార్యాలయానికి వెళ్లాల్సి రావటంతో ఇబ్బందులు తప్పటం లేదు. మరిమడ్ల, నిమ్మపల్లి, వట్టిమల్ల, తదితర అటవీ ప్రాంత గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి సుమారు 30 కిలోమీటర్ల మేర వెళ్లాల్సి వస్తోంది.

**వేల్పుల తిరుపతి, రైతు, మల్కపేట**

**త్వరలో నిధులు మంజూరయ్యే అవకాశం**

జిల్లాలోని ఇతర మండలాలతో పోలిస్తే కోనరావుపేట మండల పరిధి పెద్దగా ఉంది. సెస్ సేవా సదన్ భవనం నిర్మించి అయిదు దశాబ్దాలు కావడంతో శిథిలావస్థకు చేరింది. వినియోగదారులు, ఉద్యోగులు, పాలకులకు సౌకర్యంగా నూతన భవన నిర్మాణంపై సెస్ సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించా. త్వరలో నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. దేవరకొండ తిరుపతి, సెస్ ఉపాధ్యక్షుడు

## డెంగీ.. వణికిస్తోంది..!

ఖమ్మం : నిన్నమొన్నటి వరకు జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాలు కురిశాయి. అనేక గ్రామాల్లో పారిశుధ్యం దెబ్బతింది. వీధులు బురదమయంగా మారాయి. కాలానుగుణ వ్యాధులు ప్రబలుతున్నాయి. అధికార యంత్రాంగం తక్షణం స్పందించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని, అవసరమైనచోట్ల వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ అంశంపై డీఎంహెచ్ఓ డాక్టర్ మాలతితో మాట్లాడుతూ ప్రతి డ్రైడే నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వైరల్ జ్వరాలు అధికంగా ఉన్న గ్రామాలను గుర్తించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో సమీపంలోని 100 కుటుంబాల రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

**తాండవిస్తున్న అపరిశుభ్రత**

వైరా మండలం కారేపల్లిలో మెయిన్‌రోడ్డు, బీసీ కాలనీ, దళిత కాలనీ, రజక బజారు, బొడ్డురాయి సెంటర్‌లో పారిశుధ్యం దెబ్బతింది. బీసీ కాలనీలోనే 100 మందికి పైగా జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో డెంగీ కేసులు నమోదవుతున్నాయి. మురుగుకాల్వ వ్యవస్థను మెరుగుపరిచి ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**ముందస్తు సమాచారం లేకుండానే..!**

సత్తుపల్లి మండలం చెరుకుపల్లి పంచాయతీ పరిధిలోని చెరుకుపల్లి, తుమ్మలనగర్, జగన్నాథపురంలో పారిశుధ్యం దెబ్బతింది. ఇద్దరు, ముగ్గురు జ్వరాలతో బాధపడుతున్నారు. జలుబు, దగ్గు, విరేచనాలతో మరికొందరు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడిప్పుడే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. జగన్నాథపురంలో సింగరేణి అధికారులు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నప్పటికీ ముందస్తు సమాచారం ఇవ్వటం లేదని పలువురు వాపోతున్నారు.

**ఊరికి జ్వరమొచ్చింది** మధిర మండలం మాటూరుపేటలోని ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో, ఎస్సీకాలనీ, చెరువుకట్ట ప్రారంభ ప్రదేశం, పాఠశాల ప్రాంతంలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. చెత్త సేకరణ ట్రాక్టర్లు మూలనపడ్డాయి. చెత్తాచెదారం పేరుకుపోవటం, మురుగుకాల్వలో పూడిక తీయకపోవటంతో అపరిశుభ్రత తాండవిస్తోందని స్థానికులు చెబుతున్నారు. గ్రామంలో 60 మందికిపైగా జ్వరాలతో బాధపడు తున్నారు.

**మురికివాడల్లో తీవ్ర సమస్య**

ఖమ్మం నగరంలోని బల్లేపల్లి విద్యానగర్, ప్రశాంతినగర్, ప్రకాశ్‌నగర్, సుందరయ్యనగర్, బాలాజీనగర్, కాల్వొడ్డు, మోతీనగర్, రాపర్తినగర్, ఏకలవ్యనగర్, విలీన పంచాయతీల్లోని వివిధ ప్రాంతాలు బురదమయంగా మారాయి. ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగి వర్షం నీరు నిలవటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇప్పటికే వెంకటేశ్వరనగర్, శ్రీనివాసనగర్ పట్టణ ఆరోగ్యకేంద్రాల పరిధిలో పది 'డెంగీ' కేసులు నమోదయ్యాయి.

**పారిశుద్ధ్యం.. అధ్వానం**

తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లిలో అధికారికంగా పది మందికి డెంగీ జ్వరం సోకింది. మరో 20 మంది 'డెంగీ' లక్షణాలతో బాధపడుతున్నారు. సుమారు 100 మందికి కాలానుగుణ వ్యాధులు ప్రబలాయి. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో కొద్దిరోజుల క్రితం వైద్యశిబిరం నిర్వహించగా మళ్లీ జ్వరాలు విజృంభిస్తున్నాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఇటీవల గ్రామాన్ని సందర్శించి తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినా పారిశుధ్యం మెరుగుపడలేదని స్థానికులు వాపోతున్నారు.

## ధరణి.. మారింది ధోరణి

ఖమ్మం: 'ధరణి' భూసమస్యల పరిష్కార ప్రత్యేక కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. అనేక చిక్కుముళ్లతో ఏళ్ల తరబడి సతమతమైన ప్రజలకు నాలుగు నెలలుగా సాగుతున్న ఈ ప్రక్రియ ద్వారా పరిష్కార మార్గం లభిస్తోంది. మిస్సింగ్ సర్వే నంబర్లు, భూవిస్తీర్ణంలో తేడాలు, నిషేధిత జాబితాలో నమోదైన భూములు, వారసత్వ భూములు, మ్యుటేషన్లు, గ్రీవెన్స్ ల్యాండ్ మ్యాటర్స్ తదితర సమస్యల పరిష్కారంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని వేలాది మంది రైతులకు ఉపశమనం కలుగుతోంది. 'ధరణి' పోర్టల్‌లో ఇప్పటివరకు ఉన్న సమస్యలు కొలిక్కి వచ్చాక బాధితుల నుంచి కొత్తగా దరఖాస్తులను రెవెన్యూ యంత్రాంగం స్వీకరించనుంది. జిల్లాల వారీగా ఏర్పాటుచేసిన 'ధరణి' హెల్ప్‌డెస్క్‌లు.. దరఖాస్తు ప్రక్రియపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాయి.

**భద్రాద్రి కొత్తగూడెంలో..**భద్రాద్రి జిల్లాలో 14 రకాల భూ సమస్యలకు సంబంధించి 3,194 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో తహసీల్దార్ల వద్ద 315, ఆర్డీఓల దగ్గర 1,181, అదనపు కలెక్టర్ వద్ద 1,024, కలెక్టర్ వద్ద 674 మిగిలిపోయాయి. ఈ దరఖాస్తులన్నింటికీ రెండు వారాల్లో శాశ్వత పరిష్కారం దక్కనుంది.

**ఖమ్మం జిల్లా అదరహో..**రాష్ట్రంలో 'ధరణి' భూసమస్యల పరిష్కారంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాలు గతేడాది అగ్రభాగాన నిలిచాయి. ఏడాది వ్యవధిలో సుమారు 60వేల సమస్యలను అధికారులు పరిష్కరించారు. అయినా 'ధరణి' పోర్టల్‌లో ఒక్క ఖమ్మం జిల్లాలోనే సుమారు 20వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి పరిష్కార మార్గంపైనా రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు కొలువుదీరాక కలెక్టర్లతో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 'ధరణి' పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. ఇందుకోసం మార్చి




నుంచి ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని సూచించారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టే నాటికి ఖమ్మం జిల్లాలో 12వేల భూసంబంధిత దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో ఇప్పటివరకు టీఎం-33 మాడ్యూల్ ద్వారా 8,500 దరఖాస్తులకు పరిష్కారం లభించింది. మిగిలిన 3,500 దరఖాస్తులకు మోక్షం దక్కాల్సి ఉంది. వీటిలో 2వేల అర్జీలకు సంబంధించి తహసీల్దార్లు, ఆర్డీఓల పరిశీలన ప్రక్రియ పూర్తయ్యింది. కలెక్టర్ లాగిన్‌లో ఉన్న వీటికి త్వరలోనే పరిష్కార మార్గం లభించనుంది. మిగిలిన 1,500 దరఖాస్తులను రెండు వారాల్లో పరిష్కరించేలా ప్రత్యేక డ్రైవ్ సాగుతోంది.

'ధరణి' భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి అర్జీని రెవెన్యూ అధికారులు సునిశితంగా పరిశీలిస్తున్నారు. దరఖాస్తు తిరస్కరణకు గురైతే అందుకు గల కారణాలను సంబంధిత వ్యక్తులకు తెలియజేస్తున్నాం. ప్రత్యేక డ్రైవ్‌ను రెండు వారాల్లో పూర్తిచేస్తాం. ధరణి పోర్టల్‌లోని భూసమస్యలన్నింటినీ పరిష్కరించాక కొత్తగా దరఖాస్తులు స్వీకరిస్తాం. సక్రమంగా దరఖాస్తు చేసేందుకు వీలుగా 'ధరణి' హెల్ప్‌డెస్క్‌లు ఉపకరిస్తాయి. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

# గ్యాస్ లీక్ ఘటనలు.. బెంబేలు

హైదరాబాద్ : గ్యాస్ లీకై ప్రమాదాలు జరుగుతున్న ఘటనలు బెంబేలెత్తిస్తున్నాయి. గతంలో దోమల్‌గూడ ఘటన మరవక ముందే తాజాగా ఖాజాగూడలో ఓ ఇంట్లో వంటగదిలో గ్యాస్ లీకై పేలుడు సంభవించింది. వ్యాపించడంతో ఇద్దరికి తీవ్ర గాయాల య్యాయి. ఘటనలు గతేడాదికాలంలో అనేకం సంభవించాయి.
ఉదంతాలివే..మార్చి 20: వనస్థలిపురం రైతుబజార్ సమీపంలో ఓ టిఫిన్‌సెంటర్‌లో సిలిండర్ పేలింది. పెద్దశబ్దంతో మంటలు చెలరేగి టిఫిన్‌సెంటర్ పూర్తిగా దగ్ధమైంది.
ఏప్రిల్ 2: జవహర్‌నగర్ పరిధి బీజేఆర్‌నగర్ జ్యోతిరావ్ కాలనీలో వంటగ్యాస్ పేలి ఏడేళ్ల బాలుడు తీవ్ర గాయాలపాలైయ్యాడు. గాంధీ ఆసుపత్రికి తరలించగా నాలుగు రోజుల పాటు మృత్యువుతో పోరాడి మరణించాడు.
ఆగస్టు 8: బాలానగర్ శ్రీసాయి హోటల్‌లో గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. వంట చేస్తున్న యజమాని సురేష్ (42) మరణించారు.
అక్టోబర్ 30: మియాపూర్ దీప్తిశ్రీనగర్‌లోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో సిలిండర్ పేలి ఒకరికి గాయాలుకాగా మరొకరి పరిస్థితి విషమంగా మారింది.డిసెంబర్ 14: రాజేంద్రనగర్‌లోని కరాచీ బేకరీ కిచెన్‌లో దాదాపు 100 మంది కార్మికులు ఉండగా గ్యాస్ లీకై మంటలు



వ్యాపించాయి. 15 మందికి గాయాలయ్యాయి. కొందరు చికిత్స తీసుకుంటూ మరణించారు.

**అవగాహన లేకనే ప్రమాదాలు..**

హైప్రెజర్ రెగ్యులేటర్లను అమర్చడంతోనే ప్రమాదాలు జరుగుతున్నట్టు వెల్లడైంది. మిర్చిపాయింట్లు, హోటళ్లలో వీటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. వీటి విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రమాద సమయంలో ఆక్సిజన్ అందినంత సేపూ మంటలు అంటుకుంటూనే ఉంటాయన్న విషయం మరిచిపోకూడదని సూచిస్తున్నారు. నీళ్లకు బదులు గోనెసంచులు, మందపాటి దుప్పట్లను నీటిలో ముంచి ఆర్పేందుకు ప్రయత్నించాలి. ట్యూబ్‌ను రెండేళ్లకోసారి మారుస్తూ ఉండాలి. స్టవ్‌ను శుభ్రం చేసే క్రమంలో దానిపై నీరు పోస్తుంటారు. దీంతో నాబ్‌లు పాడై గ్యాస్ లీకయ్యే ప్రమాదం ఉంది. తడిగుడ్డతో తుడుచుకోవాలి.
సిలిండర్‌ను కప్‌బోర్డుల్లో పెట్టడం కన్నా గాలి ఎక్కువగా ఆడే ప్రదేశంలో ఉంచితే ప్రమాదాలకు ఆస్కారం ఉండదు.
గ్యాస్ లీకైతే వెంటనే సరఫరా నిలిపేసే రెగ్యులేటర్లు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.

# ప్రధాన ఆసుపత్రుల్లో.. బదిలీల బంతాట!

హైదరాబాద్ : నగరంలోని ప్రధాన ఆసుపత్రులైన గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, ఎంఎన్‌జే తదితర ఆసుపత్రుల నుంచి పెద్ద సంఖ్యలో (దాదాపు 40 శాతం) సీనియర్ వైద్యులకు స్థాన చలనం కలగడంతో ఆ ప్రభావం సేవలపై పడుతోంది. కొన్ని విభాగాల్లో ఒకేసారి నలుగురైదుగురు బదిలీ అయ్యారు. కొన్ని స్పెషాలిటీ విభాగాల్లో వైద్యులు లేని కారణంగా పీజీ సీట్లు కోల్పోయే ప్రమాదం ఉంది. కాబట్టి జిల్లా ఆసుపత్రుల్లో నయం కాని కేసులను ఉస్మానియా, గాంధీ, నిలోఫర్‌కు రిఫర్ చేస్తుంటారు.బదిలీ అయిన వారి స్థానాల్లో చాలావరకు విధుల్లో చేరలేదు. మరోవైపు 20-30 ఏళ్లు ఒకేచోట ఉన్నవారికి తొలుత ఆప్షన్లు ఇవ్వడంతో వారంతా నగరం చుట్టుపక్కల జిల్లాలను ఎంపిక చేసుకున్నారు.
గాంధీ ఆసుపత్రిలో.. ఇక్కడ ఒకేసారి 42 మంది వైద్యులను బదిలీ చేశారు. ఆసుపత్రిలో 2 వేల మంది ఇన్‌పేషెంట్లు ఉండగా నిత్యం 3 వేల మంది ఔట్‌పేషెంట్లు వస్తుంటారు.




జనరల్ సర్జరీలో ఆరుగురు ప్రొఫెసర్లుంటే అందరూ, గైనకాలజీలో ఆరుగురికి అయిదుగురు, ఆర్థోపెడిక్‌లో ముగ్గురిలో ఇద్దరు, అనస్తీషియాలో నలుగురిలో ముగ్గురు, అనస్తీషియాలో అసోసియేట్ ప్రొఫెసర్లలో ఆరుగురిని బదిలీ చేశారు.
ఎంసీహెచ్ కేంద్రంలోని గైనకాలజీ, పీడియాట్రిక్ విభాగాలు అందులోనే ఉన్నాయి. గైనకాలజీలో గతంలో ప్రతిరోజు 30 వరకు ప్రసవాలు జరిగేవి. ఇక్కడ ఆరుగురిలో అయిదుగురు బదిలీపై వెళ్లారు.
రేడియాలజీలో ఉన్న ఇద్దరు ప్రొఫెసర్లు, డెంటల్ విభాగంలో ఇద్దరిలో ఒకరు వెళ్లారు. కార్డియాలజీలో ఉన్న ఒక ప్రొఫెసర్, కార్డియోథొరాసిక్ విభాగాల్లో ఇద్దరు, యూరాలజీ, సీటీ సర్జన్‌లలో ఒక్కొక్క ప్రొఫెసరు కూడా వెళ్లిపోయారు.ఉస్మానియాలో.. ఇందులో జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, యురాల జీ, నెఫ్రాలజీ ఇలా అన్ని విభాగాల నుంచి 60 మంది వరకు బదిలీ అయ్యారు.మోకీళ్ల మార్పిడిలో కీలకంగా ఉన్న ప్రొఫెసర్‌ను బదిలీ చేయడంతో ఆ సేవలు కుంటుపడే అవకాశం ఉంది. నెఫ్రాలజీలో కీలక ప్రొఫెసరును ఎలాంటి ప్రాధాన్యం లేని చోటుకు బదిలీ చేయడంపై విమర్శలున్నాయి. జనరల్ సర్జరీలో 8 యూనిట్లలో నలుగురు వైద్యులు బదిలీ కాగా ఒక్కరే విధుల్లో చేరారు.
నిలోఫర్‌లో.. క్కడ 10 మంది పిడియాట్రిక్ ప్రొఫెసర్లను బదిలీ చేయగా వారి స్థానంలో ఇద్దరే వచ్చారు. ఈ విభాగంలో 13 మంది సీనియర్ వైద్యులకు ప్రస్తుతం ముగ్గురే మిగిలారు.గైనిక్ నుంచి అయిదుగురు, రేడియాలజీ నుంచి ఇద్దరు, మైక్రోబయాలజీ నుంచి ఇద్దరు, అనస్తీషియా నుంచి ముగ్గురు వైద్యులు వెళ్లిపోయారు. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# రుణ లబ్ధి.. అతివ ఆర్థిక వృద్ధి



తాండూరు : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న సంకల్పంతో సర్కారు ఏటా రూ.కోట్లల్లో రుణాలు మంజూరు చేస్తోంది. వాటిని సద్వినియోగం చేస్తూ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ రాణిన్నారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాల రుణాల పంపిణీ మొదలైన నేపథ్యంలో కథనం.

**ఆసక్తి, అర్హతలే ఆధారం**

జిల్లాలోని గ్రామీణ ప్రాంత మహిళలకు మహిళా సమాఖ్యల ద్వారా, పట్టణ ప్రాంత మహిళలకు మెప్మా ద్వారా రుణాలు అందజేస్తున్నారు. 18 సంవత్సరాలు నిండిన 10 నుంచి 11 మందితో సంఘాలను ఏర్పాటు చేస్తున్నారు. వారందరి ఆసక్తి, అర్హతల ఆధారంగా రూ.5లక్షల నుంచి రూ.20లక్షల దాకా బ్యాంకు లింకేజీ రుణాలు ఎలాంటి పూచీకత్తు లేకుండా తక్కువ వడ్డీకి అందజేస్తున్నారు. రుణాల్ని పొందుతున్న మహిళలు రెట్టించిన ఉత్సాహంతో హోటళ్లు, విగణిత కేంద్రాలు, అల్పాహారశాల, పిండిగిర్ని, అలంకార, వస్త్ర విక్రయ దుకాణాలు, దర్జీ వృత్తి, వ్యవసాయం, కిరాణ దుకాణం తదితరాలను నెలకొల్పి విజయవంతంగా నిర్వహిస్తున్నారు. మహిళలు నిర్వహిస్తున్న వ్యాపారాలు, పరిశ్రమలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న సీసీలు, ఏపీఎంలు సూచనలు, సలహాలతో ప్రోత్సహిస్తున్నారు. అందిస్తున్నారు.

**రూ.50కోట్లకుపైగా చెల్లింపులు**

ఈ ఆర్థిక సంవత్సరం రూ.554.52కోట్ల రుణాలు అందించేందుకు నిర్దేశించారు. ఏప్రిల్‌లో ప్రారంభించాల్సిన రుణ మంజూరు ఎంపీ ఎన్నికల కోడ్ వల్ల ఆలస్యమైంది. గతనెలలో రుణాలు మంజూరుకు శ్రీకారం చుట్టారు. నెల రోజుల వ్యవధిలో రూ.50కోట్లకుపైగా రుణాల్ని సంఘాల మహిళలకు అందించి పలు సూచనలు చేశారు.

జిల్లాలో గ్రామ సమాఖ్యలు: 657
మండల సమాఖ్యలు: 20
స్వయం సహాయక సంఘాలు: 15,967
నమోదైన సభ్యులు: 1,62,598

నెలకు రూ.12వేల దాకా ఆదాయం
లలిత, మల్కాపూర్
రూ.30వేలు డ్వాక్రా రుణం డబ్బులు ఖర్చుచేసి పంచాయతీలోని నీటి శుద్ధి ప్లాంటు నిర్వహిస్తున్నా. స్థానికులకు తక్కువ ధరకు శుద్ధి నీరు అందిస్తున్నా. ఇంటి వద్దనే ఉంటూ రోజుకు రూ.300 నుంచి రూ.500 ఆర్జిస్తున్నా.

రూ.80వేలతో వ్యవసాయం
మంజుల, జిన్‌గుర్తి
శ్రీవినాయక పొదుపు సంఘంలో కొనసాగుతుండగా రూ.80వేల రుణం మంజూరైంది. దీంతో పొలం వద్ద బావి తవ్వించి నీటి సదుపాయం కల్పించాం. పత్తి, కంది సాగు చేస్తున్నా.

రెండు గ్రామాల్లో క్షౌరశాలలు
నర్సమ్మ, వీర్‌శెట్టిపల్లి భాగ్యలక్ష్మి పొదుపు సంఘాన్ని 11 మంది మహిళలతో 18 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నా. రూ.లక్ష డ్వాక్రా రుణం తీసుకొని వీర్‌శెట్టిపల్లి, గోనూరులో క్షౌరశాలలను ఏర్పాటు చేశా. రోజువారీ ఆదాయంతో ఆర్థిక ఇబ్బందులు దూరమయ్యాయి.

# కీలక జోన్‌లో ఆయనదే పెత్తనం



హైదరాబాద్: నగరంలోని కీలకమైన జోన్. నిత్యం అప్రమత్తంగా ఉండాల్సిన సున్నితప్రాంతం. దీర్ఘకాలంగా అక్కడే వివిధహోదాల్లో విధులు నిర్వర్తించిన ఆయన అదనపు డీసీపీ స్థాయికి చేరారు. సివిల్ తగదాలు, భూ వివాదాల్లో తలదూర్చి కేసుకో రేటుకట్టి వసూళ్లతో రికార్డు సాధించారనే ఆరోపణలున్నాయి.

**భూ వివాదాల్లో జోక్యం**

ఆప్రాంతంలో భూవివాదాలు ఎక్కువ. భార్యాభర్తల తగాదాలు పదుల సంఖ్యలో ఠాణాలకు చేరుతుంటాయి. అర్ధరాత్రి దాటే వరకూ హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్లు, స్నూకర్స్ క్లబ్‌లలో రౌడీషీటర్లు హంగామా సృష్టిస్తుంటారు. వీరిపై కఠినంగా వ్యవహరించాల్సింది పోయి ఆ అధికారి వారికి వత్తాసు పలుకుతున్నట్టు ఆరోపణలున్నాయి. ఆ ప్రాంతంలో స్థలాలు కొనుగోలు చేసిన కొందరు విదేశాలకు వెళ్లిపోయారు. ఆ ఖాళీ జాగాలపై కన్నేసిన చోటానేతలు, రౌడీషీటర్లు కబ్జాలకు పాల్పడుతుంటారు. వాటికి నకిలీ పత్రాలు సృష్టించి హక్కుదారులుగా చెలామణీ అవుతుంటారు. రూ.10 కోట్ల విలువైన వివాదాస్పద స్థలంలో పోలీసులు జోక్యం చేసుకోవద్దని ఉన్నతాధికారులు ఆదేశించినా ఈ అధికారి సంబంధిత ఇన్‌స్పెక్టర్‌ను బెదిరించి ఒక వ్యక్తికి అనుకూలంగా పనిచేయమని పురమాయించినట్టు సమాచారం. ఒక ఠాణా పరిధిలో ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చి రూ.50వేలు తన వాటాగా తీసుకున్నట్టు సమాచారం. హోంగార్డు నుంచి ఏసీపీ స్థాయి అధికారి వరకూ తన మాట వినకుంటే పరుష పదజాలంతో విరుచుకుపడటం ఆయన ప్రత్యేకత. నెలవారీ ఇవ్వాల్సిన మామూళ్లు సకాలంలో అందకపోవటంతో ఒక ఇన్‌స్పెక్టర్‌ను హెచ్చరించినట్టు సమాచారం.

**నోరెత్తితే దూషణలే..**డీసీపీ నిర్వర్తించాల్సిన విధుల్లో జోక్యం చేసుకుంటూ కర్రపెత్తనం చేయటం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తనకు తెలియకుండా ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు డీసీపీని కలసినట్టు తెలిస్తే ఆయన నోటి నుంచి వచ్చేది దూషణలేనని ఒక ఇన్‌స్పెక్టర్ ఆవేదన వెలిబుచ్చారు. ఇన్నేళ్ల సర్వీసులో ఎవరి వద్ద మాటపడని తాను అధికారి చీవాట్లకు తలదించుకున్నారంటూ వాపోయారు. పోలీసు కొలువుకు కళంకం తెచ్చేలా ప్రజాప్రతినిధుల వద్ద మోకరిల్లినట్టుగా ప్రవర్తించటం కలకలం సృష్టిస్తోంది. ఇటీవల ప్రార్థనామందిరం వద్ద తలెత్తిన వివాదాన్ని ఉన్నతాధికారికి ఆపాదిస్తూ వీడియో రూపొందించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఇంతటి సున్నితమైన అంశం ఈ అధికారికి తెలిసినా ఉద్దేశపూర్వకంగానే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా పరోక్షంగా రెచ్చగొట్టేందుకు కారకుడైనట్టు ఉన్నతాధికారులు గుర్తించారు. వరుస ఆరోపణలు, ఫిర్యాదులతో ఉన్నతాధికారులు అంతర్గత విచారణ నిర్వహించారు.

# వాణిజ్య నల్లా.. అక్రమాలే నిలువెల్లా

హైదరాబాద్: నగరంలోని వాణిజ్య నల్లాల్లో మాయాజాలం కొనసాగుతూనే ఉంది. ఈ కుళాయిలు గ్రేటర్ వ్యాప్తంగా 53 వేలే ఉన్నాయని లెక్కలు చెబుతుండటమే అందుకు నిదర్శనం.. గృహ కేటగిరీ ముసుగులో భారీగా వాణిజ్య నల్లాల బిల్లులు ఎగవేస్తున్నట్లు జలమండలి అనుమానిస్తోంది. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని నిర్ణయించింది. గ్రేటర్‌లో సుమారు 14 లక్షల నల్లా కనెక్షన్లు ఉన్నాయి. భారీ పరిశ్రమలు, మాల్స్, ఇతర వ్యాపార సముదాయాలకు ఇచ్చే నల్లాలను వాణిజ్య కేటగిరీ కింద బిల్లులు వసూలుచేస్తున్నారు. వీటికి నల్లా ఛార్జీలు దాదాపు మూడు, నాలుగురెట్లు ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం జలమండలికి నెలవారీగా వస్తున్న ఆదాయంలో 70 శాతం వాణిజ్య నల్లాలతోనే సమకూరుతోంది. గ్రేటర్‌లోని వాణిజ్య కేటగిరిలో లెక్కలకు క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన కుదరడం లేదని అధికారులు భావిస్తున్నారు. విద్యుత్తు శాఖకు సంబంధించి గ్రేటర్‌లో 6 లక్షల వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి. ఇక బల్దియా.. 2.6 లక్షల వాణిజ్య భవనాల నుంచి ఆస్తి పన్ను వసూలుచేస్తోంది. ఈ లెక్కన.. జలమండలి పరిధిలో భారీగా వాణిజ్య కేటగిరీ నల్లాలుండాలి. కొన్ని వ్యాపార సముదాయాలకు నల్లాలు లేకపోవడం, లేదంటే ఒకే నల్లా కనెక్షన్ కింద రెండు, మూడు సముదాయాలు ఉండటంతో కొంతవరకు తగ్గే అవకాశమున్నా.. ఇంత భారీ తేడా ఉండదని అధికారులు భావిస్తున్నారు.

**ఇదీ పరిస్థితి..**

కొత్త నల్లా కనెక్షన్ తీసుకునే సమయంలో దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి. అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు ఆరా తీయాలి. కొందరు భవనాల యజమానులతో కుమ్మక్కవుతూ కేటగిరీలు సైతం మార్చేస్తున్నారు. దీంతో వాణిజ్య కేటగిరీ నల్లాలపై కచ్చితమైన లెక్కలు తేలడం లేదు.



ప్రస్తుతం ప్రతి గృహ నల్లాకు నెలకు 20 వేల లీటర్ల ఉచిత నీళ్లు సరఫరా చేస్తుండటంతో వాటి నుంచి బోర్డుకు ఆదాయం రావడం లేదు. మొత్తం రూ.90-100 కోట్ల ఆదాయంలో రూ.30-40 కోట్ల వరకు కోత పడుతోంది. ఆ లోటును వాణిజ్య కేటగిరి నల్లాలతో జలమండలి పూడ్చుకుంటోంది.
కేవలం వాణిజ్య నల్లాలతోనే రూ.70 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. అందుకే ఈ విభాగం నల్లాల లెక్కను కచ్చితంగా తేల్చాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి భావిస్తున్నారు. త్వరలో ఇంటింటి సర్వే చేపట్టనున్నారు. ప్రతి నల్లా పరిశీలించి అది ఏ కేటగిరిలో ఉందో పరిశీలించనున్నారు. గృహ కేటగిరిలో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తుంటే వాణిజ్య కేటగిరీలోకి మారుస్తారు.
సర్వే ద్వారా 50 వేల నల్లాలు కొత్తగా ఈ కేటగిరీలోకి చేరితే.. బోర్డు ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. త్వరలోనే కార్యాచరణ చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

# ముంపు ముప్పు.. తొలిగేదెప్పుడు..?

కొత్తగూడెం : గోదావరి వరదల నుంచి భద్రాచలం పట్టణానికి రక్షణ కల్పించే కరకట్ట విస్తరణ పనులు జాప్యమవుతు న్నాయి. విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారి మధ్యలోంచి కరకట్ట నిర్మించాల్సి రావటం.. ఈ రహదారి ఎత్తు పెంచాల్సి ఉండటమే దీనికి కారణమని అధికారులు చెబుతున్నారు. రహదారి ఎత్తు పెంచటానికి సంబంధించి హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ ప్రతినిధులు భద్రాచలం వచ్చి సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. జాతీయ రహదారిపై కరకట్ట కట్టి దాని పైనుంచి 'కాజ్ వే' నిర్మించాలని సదరు ప్రతినిధులు సూచించినట్లు సమాచారం. వచ్చే ఏడాది నాటికి కరకట్ట నిర్మాణ పనులు పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు.

**రూ.38.45 కోట్లు.. 700 మీటర్ల పొడవు**

రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన కరకట్టను కూనవరం రోడ్డు వరకు పొడిగించాలనే ప్రతిపాదనకు నిధుల కొరత కారణంగా అప్పట్లోనే చుక్కెదురైంది. 2022 జులైలో భద్రాచలం వద్ద గోదావరి 71.3 అడుగుల మేర ప్రవహించటంతో అపార నష్టం సంభవించింది. సుభాష్‌నగర్, శాంతినగర్‌కాలనీ, కూనవరం రోడ్డు, సీఆర్‌పీఎఫ్ క్యాంపు కార్యాలయాలు పూర్తిగా నీటమునిగాయి. ఇదంతా కరకట్ట లేని ప్రాంతం నుంచి వచ్చిన వరద వల్లే జరిగింది. వరదల నుంచి నివాస కాలనీలను రక్షించటానికి అప్పటి సీఎం కేసీఆర్.. పాత కరకట్టను పొడిగించాలని నిర్ణయించారు. రూ.38.45కోట్లతో 700 మీటర్ల కరకట్ట నిర్మాణానికి 2023 సెప్టెంబర్ 30న శంకుస్థాపన జరిగింది. శాసనసభ ఎన్నికల కోడ్ కారణంగా పనులు ముందుకు సాగలేదు.

**వర్షాలతో పనులకు అంతరాయం**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన రెండు నెలలకు గోదావరి నది కరకట్ట విస్తరణ పనులను ప్రారంభించింది. భద్రాచలంలోని సుభాష్‌నగర్ నుంచి చేపట్టిన పనులను జూన్ నాటికి పూర్తిచేయాలని జలవనరులశాఖ అధికారులు భావించారు. 700 మీటర్ల పొడవు, దాదాపు 30-40 అడుగుల ఎత్తుతో కరకట్ట నిర్మిస్తున్నారు. విజయవాడ-



జగదల్‌పూర్ జాతీయ రహదారి మధ్యలోంచి కరకట్ట నిర్మించాల్సి ఉండటంతో రోడ్డు ఎత్తు పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పనులకు అంతరాయం ఏర్పడుతోంది.

**పెరగనున్న అంచనా వ్యయం**

రూ.38.45కోట్లతో కరకట్ట విస్తరణ పనులు ప్రారంభించినా నిర్మాణం పూర్తయ్యే సరికి అంచనా వ్యయం సుమారు రూ.70కోట్లకు చేరుతుందని జలవనరులశాఖ అధికారులు చెబుతున్నారు. జాతీయ రహదారిపై కాజ్ వే నిర్మించాల్సి రావడంతో వ్యయం పెరుగుతుందంటున్నారు. జాతీయ రహదారుల అధికారులతో సంప్రదింపులు జరుగుతున్నాయని, అనుమతులు రాగానే కాజ్ వే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. రహదారిపై కరకట్ట నిర్మిస్తే వాహన రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గం చూపాల్సి ఉంటుంది. దీనిపైనే అధికారులు సమాలోచనలు సాగిస్తున్నట్లు సమాచారం.
కరకట్ట విస్తరణ పనులు తుది దశకు చేరాయి. విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపై కరకట్ట నిర్మాణానికి సంబంధించిన నివేదికలను ఉన్నతాధికారులకు పంపించాం. అనుమతులు రాగానే జాతీయ రహదారి ఎత్తు పెంచే పనులు ప్రారంభిస్తాం. ఈ ఏడాది గోదావరి నదికి వరదలు వచ్చినా.. ముంపు సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం.
రాంప్రసాద్, జలవనరులశాఖ ఈఈ

# గురి పెడితేనే బరిలోకి..!

ఖమ్మం : పారిస్ ఒలింపిక్స్ పోటీలు మరి కొద్ది గంటల్లో ప్రారంభం కానున్నాయి. 32 క్రీడాంశాల్లో 329 పతకాల కోసం క్రీడా యోధానుయోధులు తలపడేందుకు సిద్ధమయ్యారు. అందులో 117 మంది భారత క్రీడా సైన్యం ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా భారత జట్టులో 30 మంది అథ్లెట్లు రంగంలోకి దిగుతున్నారు. గత ఒలింపిక్స్‌లో 124 మందితో కూడిన భారత జట్టు పాల్గొంటే 7 పతకాలు దక్కాయి. ఇప్పుడు మహిళా హాకీ జట్టు అర్హత సాధించలేదు దీంతో ఈసారి జట్టు 117 మంది వెళ్లారు. ఇంతవరకు బాగానే ఉన్నా... మన ఉమ్మడి జిల్లా నుంచి భారత జట్టులోకి చేరే క్రీడాకారులే లేరా.. ఎందుకు ఇలా జరుగుతోంది.. లోపం ఎక్కడ ఉంది.. ఒలింపిక్స్ సందర్భంగా ప్రత్యేక కథనం....
తాత్కాలిక తర్ఫీదు.. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో మెరుస్తున్న బ్యాడ్మింటన్ క్రీడాకారుడు శ్రీకాంత్ గుంటూరు నుంచి ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఉండి సాధన చేశారు. ఇక్కడి నుంచి గోపీచంద్ అకాడమీకి వెళ్లారు. ఇప్పుడు పతకం రావాలంటే హైదరాబాద్‌కి వెళ్లాల్సిందే అనే వాతావరణం ఉంది. నాడు క్రీడాశాఖలో ప్రభుత్వం నియమించిన శిక్షకుడు సుధాకర్‌రెడ్డి ఉన్నారు. ఇప్పుడు ఆ స్థానాన్ని ప్రభుత్వం భర్తీ చేయడం లేదు. తాత్కాలిక శిక్షకులతో శిక్షణ కేంద్రమే తాత్కాలికంగా మారింది. ఫలితాలు అలానే ఉంటున్నాయి.
అన్ని ప్రభుత్వ రంగ వ్యవస్థల్లో కాస్త ఆలస్యంగానైనా ఉద్యోగ నియామకాలు ఉంటున్నాయి. క్రీడాశాఖలో రెండు దశాబ్దాలుగా నియామకాలు లేవు. ఇక్కడి ఖాళీలను గుర్తించే వ్యవస్థ కూడా నేటికీ లేదనే చెప్పాలి. కొట్టుమిట్టాడుతున్న స్పోర్ట్స్ అథారిటీని నాలుగేళ్ల కిందట యువజన శాఖలో కలిపేశారు. దీంతో ఈ శాఖ ఉనికే ప్రమాదంలో పడింది. స్టేడియాలు కిరాయి ప్రాంగణాలుగా మారాయి. ఎదగలేక ఓ దశలో ఆగిపోయిన వారు, ప్రాంగణ పర్యవేక్షకులు క్రీడా శిక్షణలు ఇస్తున్న తీరు ఉంది. విషయం తెలిసినా కొందరు తల్లిదండ్రులు గూగుల్ సాయంతో ఎప్పటికప్పుడు ప్రమాణాలను అంచనా వేసుకుంటూ ప్రోత్సహిస్తుండటంతో జిల్లా, రాష్ట్రస్థాయిలో ఫలితాలు వస్తున్నాయి.
క్రీడాకారుడిని స్పోర్ట్స్ అథారిటీ శిక్షణ వ్యవస్థ తయారు చేయాలి. ఆ క్రీడాకారుడికి పోటీల స్థాయిని పెంచుకుంటూ క్రీడా సంఘం అండగా నిలవాలి. శిక్షకులు లేని కారణంగా రెండు పనులు చాలా వరకు క్రీడా సంఘాలే చూసుకుంటున్నాయి. ఈ పరిణామం బహు కొద్ది అంశాలు మినహాయిస్తే ఎక్కువగా వ్యాపార ధోరణిలో సాగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఉత్సాహంగా వచ్చి పిల్లలను చేర్పించే తల్లిదండ్రులు అంతే త్వరగా వెనక్కి తగ్గుతున్నారు.
ప్రభుత్వ శిక్షణ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందనే చెప్పాలి. 1993లో నియమితులైన ప్రభుత్వ శిక్షకులను నేటికీ రెగ్యులర్ చేయలేదు. నాడు 56 మందిని తీసుకుంటే వారిలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పది మంది మిగిలారు. ఇందులో ఖమ్మంలో ఉన్న అథ్లెటిక్స్ శిక్షకుడు ఒకరు. ఉత్తమ శిక్షణ, మంచి ఫలితాలు, ప్రభుత్వ అకాడమి ఉన్నా ఇక్కడ కనీస సదుపాయాలు లేవు. ఇలా చెప్పుకుంటూ పోతే క్షేత్రస్థాయిలో అరణ్య రోదనలే ఉంటున్నాయి. మైదాన స్థాయి నుంచి లోపాలను సరిదిద్దే ప్రయత్నం మొదలు పెట్టాలి. ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. అప్పుడే మన క్రీడాకారులు ఒలింపిక్స్ స్థాయికి ఎదిగి పతకాలపై గురి పెట్టగలుగుతారు.

# దొంగలందు.. ఈ దొంగలు వేరయా!

హైదరాబాద్ : మహానగరంలో ఏటా 8-9 వేలకు పైగా చోరీలు జరుగుతుంటాయి. వాటిలో అధికశాతం గృహదొంగతనాలు నమోదవుతుంటాయి. ఒక్కసారి హైదరాబాద్ వచ్చి వెళ్తే బిందాస్‌గా బతికేయొచ్చనేది అంతర్రాష్ట్ర ముఠాల నమ్మకం. గృహాలు, కార్యాలయాలు, బంగారు దుకాణాల్లోకి చొరబడి దొంగలు చాకచక్యంగా పనిపూర్తి చేస్తారు. సొమ్ము కొట్టేసే చోరుల వద్ద పట్టుబడినప్పుడు పైసా ఉండదంటారు పోలీసులు. వీరిలో కొందరి దానధర్మాలు గుర్తించి పోలీసులే ఆశ్చర్యపోతున్నారు.

పేద రైతులకు కొంత.. : మహబూబ్‌నగర్‌కు చెందిన ఘరానా దొంగ ఎల్లయ్య. రాత్రి మాత్రమే చోరీ చేస్తాడు. తాళం వేసిన ఇళ్లను గమనిస్తాడు. అక్కడ పోలీసు నిఘా, సీసీ టీవీ కెమెరాలు లేవని నిర్ధారించుకున్నాక రంగంలోకి దిగుతాడు. విలువైన వస్తువులు కాజేసి రెప్పపాటులో మాయమవుతాడు. సొత్తును రిసీవర్లకు అప్పగించి వచ్చిన సొమ్మును గ్రామాల్లో బోర్లు తీసేందుకు సిద్ధమైన పేద రైతులకు ఇస్తాడు.



కొట్టేసిన సొత్తులో కొంత పేదలకు..

బిహార్‌కు చెందిన మహ్మద్ ఇర్ఫాన్ అలియాస్ రాబిన్‌హుడ్. దొంగతనానికి ముంబయి, పుణె, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలు ఎంచుకుంటాడు. జీపీఎస్ సాయంతో ఇళ్లలోకి చొరబడి బంగారం, నగదు మాత్రమే తీసుకుంటాడు. వెండి ఆభరణాల జోలికెళ్లడు. బంగారం విక్రయించి వచ్చిన సొమ్ములో 20-30శాతం పేదల చదువు, వైద్యం, వివాహం, రహదారుల నిర్మాణానికి ఇస్తాడు. మూత్రపిండాల జబ్బుతో బాధపడే రోగికి రూ. 18లక్షలు సమకూర్చేందుకు నగరంలో చోరీలకు పాల్పడి జూబ్లీహిల్స్ పోలీసులకు చిక్కాడు. పాదరక్షలు, సెల్‌ఫోన్ వాడడు.

చోరీ చేసి.. వస్తువుల చీటీ రాసి..

రత్తావత్ శంకర్‌నాయక్.. బీఫార్మసీ పూర్తిచేశాడు. హత్యాయత్నం కేసులో జైలుకెళ్లొచ్చాక దొంగగా మారాడు. మిత్రుల కోసం ఎంతకైనా తెగిస్తాడు.వారికి డబ్బు అవసరమని తెలియగానే అప్పటికప్పుడే కాలనీల్లో రెక్కీ నిర్వహించి వస్తువులు కొట్టేస్తాడు. అక్కడ చోరీ చేసిన వస్తువుల వివరాలు చిట్టీ రాసి అక్కడే ఉంచుతాడు.

# పెరిగిన ఓఆర్‌ఆర్ టోల్ ఆదాయం

హైదరాబాద్: అవుటర్ రింగ్ రోడ్డుపై టోల్ ఆదాయం క్రమేపీ పెరుగుతోంది. గతేడాది నవంబరులో రూ. 55.6 కోట్లు ఉండగా డిసెంబరుకు ఆ మొత్తం రూ. 62.7 కోట్లకు పెరిగింది. ఒక్క నెలలోనే దాదాపు రూ. 7 కోట్లు అధికంగా రావడం గమనార్హం. వరుస సెలవులతో వాహనాల రాకపోకలు పెరగడం కారణం. మరోవైపు నగరంలో ట్రాఫిక్ పెరగడంతో ఓఆర్‌ఆర్ ద్వారా గమ్యస్థానానికి చేరుతున్నారు. బంగారుబాతు లాంటి ఈ రహదారిని ఇప్పటికే టోల్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్(టీవోటీ) విధానంలో 30 ఏళ్లపాటు లీజుకు గత ప్రభుత్వం ఐఆర్‌బి ఇన్‌ఫ్రా లిమిటెడ్‌కు అప్పగించిన సంగతి తెలిసిందే. ఆ మేరకు ఏక మొత్తం కింద ఐఆర్‌బీ రూ. 7,380 కోట్లను ప్రభుత్వ ఖాతాకు జమచేసింది.

ఏడాదికి రూ. 720 కోట్లు..

మహానగరం చుట్టూ 158 కిలోమీటర్లు ఉన్న అవుటర్‌తో పలు జాతీయ, రాష్ట్ర రహదారులు అనుసంధానమై ఉన్నాయి. ప్రస్తుతం అవుటర్‌పైకి ఎక్కి దిగేందుకు 44 పాయింట్లతోపాటు 22 ఇంటర్ ఛేంజ్ జంక్షన్లున్నాయి. భవిష్యత్తులో అభివృద్ధి అంతా అవుటర్ చుట్టూ కేంద్రీకృతం కానుండటంతో ప్రభుత్వం తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పిస్తోంది. ప్రస్తుతం నిత్యం 1.30-1.40 లక్షల వాహనాలు



రాకపోకలు సాగిస్తున్నాయి. సరాసరి నెలకు రూ. 60 కోట్ల ఆదాయం వచ్చినా.. ఏడాదికి రూ. 720 కోట్లు సమకూరనుంది. ఏటా 5 శాతం టోల్ పెంచుకునే వెసులుబాటు ఉంది. ఈ నేపథ్యంలో లీజుకు ఇవ్వడంపై అప్పట్లో విమర్శలొచ్చాయి. అయినా అప్పటి ప్రభుత్వం ముందుకే వెళ్లింది. పలు జాతీయ రహదారుల మాదిరిగానే టీవోటీ పద్ధతిలో లీజుకు ఇస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

హెచ్‌ఎండీఏపై పచ్చదనం భారం

ఓఆర్‌ఆర్‌ను హెచ్‌ఎండీఏ పరిధిలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ నిర్వహిస్తోంది. విద్యుత్తు దీపాలు, ఇంటర్‌ఛేంజ్‌లు, సర్వీసు రహదారుల నిర్వహణ, మరమ్మతులు, భద్రత చూస్తోంది. ఆదాయంతోపాటు నిర్వహణ సదరు సంస్థ కిందే ఉంది. పచ్చదనం పరిరక్షణ మాత్రం హెచ్‌ఎండీఏ పరిధిలోకి వస్తుంది. ఇందుకు ఏటా రూ.కోట్లలోనే హెచ్‌ఎండీఏపై భారం పడుతోంది. అప్పట్లో పచ్చదనం పెంపు నిర్వహణ ఐఆర్‌బీకి అప్పగించకపోవడంతో హెచ్‌ఎండీఏపై భారం పడింది.

# అప్రమత్తంగా లేకుంటే హాంఫట్!



గోదావరిఖని : పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సాక్షులుగా వేలిముద్రలు వేసిన సుమారు 500 మంది బ్యాంకు ఖాతాల్లోంచి డబ్బులు మాయమయ్యాయి. ఎలాంటి బ్యాంకు లావాదేవీలు లేకుండానే ఒకొక్కరి ఖాతా నుంచి రోజుకు రూ. 1000 నుంచి రూ. 5000 చొప్పున మాయం కావడంతో బాధితులు సంబంధిత బ్యాంకు అధికారులను కలిసి ఖాతాను లాక్ చేయించారు. అప్పటికే కొందరి ఖాతా నుంచి సుమారు రూ. 20 వేల వరకు గుర్తు తెలియని వ్యక్తులు వేరే బ్యాంకు ఖాతాల్లోకి మార్చుకున్నారు. ఈ మేరకు బాధితులు గోదావరిఖని ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైబర్ క్రైం పోలీసులు విచారణ చేస్తున్నారు.

బ్యాంకు సర్వీసు కేంద్రాల వద్ద ఆధార్‌కార్డుతో కొంత మంది డబ్బులు డ్రా చేసుకున్నారు. ఆ తర్వాత వారి ఖాతాల్లోంచి డబ్బులు మాయమయ్యాయి. తమ ప్రమేయం లేకుండా డబ్బులు ఎలా ఖాతాల్లోంచి మాయం అవుతున్నాయో తెలియని వారు బ్యాంకు అధికారులను సంప్రదించారు. ఆధార్‌కార్డు లింకుతో వేరే బ్యాంకు ఖాతాల్లోకి మీ డబ్బులు జమ అయ్యాయని బ్యాంకు అధికారులు వెల్లడించారు. తమ ఖాతాల్లోంచి డబ్బులు ఏ విధంగా మాయమవుతున్నాయో తెలియని బాధితులు ఎవరిని సంప్రదించాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. కొంత మంది బ్యాంకు ఖాతాల్లో అసలు డబ్బులు ఉండకుండా చూసుకోవడమే ఉత్తమమన్న అభిప్రాయానికి వచ్చారు.

రోజుకో కొత్త విధానంలో సైబర్ మోసగాళ్లు అమాయకుల డబ్బులను దోచేస్తున్నారు. ఓటీపీ చెబితే బ్యాంకు ఖాతాల్లోంచి డబ్బులు మాయం చేస్తారని తెలుసు. కాగా నేరగాళ్లు సరికొత్త విధానంలో డబ్బులు డ్రా చేసుకుంటున్నారు. సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న సైబర్ నేరగాళ్లు అమాయకులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. ఫిర్యాదులు వచ్చినా వాటిని ఛేదించేందుకు సైబర్ క్రైం పోలీసులు తంటాలు పడాల్సి వస్తోంది. కొన్ని కేసుల్లో ఎక్కడా ఆధారాలు దొరక్కుండా నేరగాళ్లు డబ్బులు కాజేస్తున్నారు. బాధితులు కోల్పోయిన మొత్తంలో 30 శాతం కూడా రికవరీ చేయలేకపోతున్నారు. ముందుగా సమాచారం ఇచ్చిన బాధితుల ఖాతాల్లోంచి మరింత డబ్బు పోకుండా సీజ్ చేయించి నిలువరించగలుగుతున్నారు. చాలా కేసుల్లో అసలు డబ్బులు ఎక్కడికి వెళ్లాయన్నది విషయం పోలీసులకు అంతుచిక్కడం లేదు. కొన్ని కేసుల్లో లభించిన ఆధారాలతో విచారణ చేపట్టి కొంత మంది నిందితులను పట్టుకుని వారి నుంచి కొంత వరకు డబ్బులు వసూలు చేశారు. నేరస్థులను జైలుకు పంపించారు.

పెరిగిన కేసులు

ఒక్క ఏడాదిలోనే సైబర్ క్రైం కేసులు పెరిగాయి. అంతకు ముందు ఏడాది కంటే గడిచిన సంవత్సరం సైబర్ క్రైం కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. 2023 సంవత్సరంలో సుమారు రూ. 22 కోట్ల వరకు బాధితులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి డబ్బులు కోల్పోయారు. అందులో సుమారు రూ. 8 కోట్ల వరకు తిరిగి ఇప్పించారు. 2022లో ఉమ్మడి జిల్లాలో 2164 సైబర్ క్రైం కేసులు నమోదైతే 2023లో 2699 కేసులు నమోదయ్యాయి.

ఈ జాగ్రత్తలు పాటించండి

ఎక్కడ పడితే అక్కడ వేలి ముద్రలు వేయకూడదు. అత్యవసరమనుకుంటే జాగ్రత్తలు పాటించాలి. ప్రభుత్వ కార్యాలయమైనా సరే ఒకటికి రెండు సార్లు ఆలోచించాలి.

అనవసరమైన సంక్షిప్త సందేశాలకు స్పందించకూడదు

డబ్బు ఆశ చూపే సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. వాటిని అసలు తెరవకూడదు

బ్యాంకు ఖాతా సమాచారం కావాలని ఎవరైనా అడిగితే అనుమానించాలి. బ్యాంకు సిబ్బంది ఎప్పుడూ సమాచారం అడగరు. ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి.

మీకు ఓ ఓటీపీ వచ్చింది. వెంటనే చెప్పాలని ఎవరైనా అడిగితే స్పందించకూడదు. అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

క్రెడిట్‌కార్డు పేరుతో వచ్చే సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. క్రెడిట్‌కార్డు లిమిట్ పెంచుతామని వచ్చే సందేశాలు. లింకులను తెరవకూడదు. క్రెడిట్ కార్డుతో స్వైప్ చేసే సమయంలో పిన్ నెంబరు ఎవరికీ తెలియకుండా జాగ్రత్త తీసుకోవాలి. పిన్‌ను మీరే నమోదు చేయాలి.

ఆన్‌లైన్ షాపింగ్ చేసే ముందు నమ్మదగిన వెబ్‌సైట్ నుంచి మాత్రమే వస్తువులు కొనుగోలు చేయాలి. దానికి సంబంధించి క్రెడిట్, డెబిట్‌కార్డు వివరాలు ఎవరికి తెలియజేయకుండా చూసుకోవాలి.

యూట్యూబ్‌లో వచ్చే వీడియోలకు లైక్ కొడితే మీకు డబ్బులు పడతాయని నమ్మిస్తారు. హోటళ్లు, రెస్టారెంట్లకు రేటింగ్ ఇస్తే డబ్బులు వేస్తామని సందేశం పంపుతారు. సినిమా రివ్యూలకు కూడా రేటింగ్ ఇస్తే మీ ఖాతాల్లో డబ్బులు వేస్తామంటూ మోసగాళ్లు ప్రయత్నిస్తుంటారు. ఇన్‌స్టాగ్రాం ఖాతాలను ఫాలో అవుతూ స్క్రీన్‌షాట్ తీసి పంపితే డబ్బులు పంపుతామని కూడా మోసగాళ్లు కొత్త పంథాలో మోసానికి పాల్పడే అవకాశం ఉంది.

అపరిచిత వ్యక్తులు క్యూఆర్ కోడ్ పంపి స్కాన్‌చేస్తే డబ్బులు వస్తాయని చెబితే నమ్మకూడదు.

రుణాల పేరుతో వచ్చే యాప్‌లకు స్పందించకూడదు.

సైబర్ ఉచ్చులో పడి మోసపోతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నెంబరుకు సమాచారం ఇవ్వాలి.చైతన్యం అవసరంసైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమాలతో అప్రమత్తం చేస్తున్నాం. ఇటీవల అన్ని కళాశాలల్లో విద్యార్థులకు సైబర్ క్రైం నేరగాళ్లు ఏ విధంగా మోసాలకు పాల్పడతారన్న విషయాలపై అవగాహన కల్పించాం. మన డబ్బు జాగ్రత్తగా ఉండాలంటే అప్రమత్తంగా ఉండాలి. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, సంక్షిప్త సందేశాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. మోసాలకు గురికాకుండా ఉండాలంటే ప్రజల్లో అవగాహన పెరగాలి. ఈ విషయంలో విద్యార్థులు తమ తల్లిదండ్రులకు, చుట్టుపక్కల వారికి వివరించి చైతన్య పరచాలి.రెమా రాజేశ్వరి, పోలీసు కమిషనర్, రామగుండం

# నిర్మాణాలకు నిధులెలా?



సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ గ్రామీణ మండలం బొల్లారంలో మూలవాగుపై రూ. 4.17 కోట్లతో చెక్‌డ్యాం నిర్మించారు. 80 శాతం పనులు పూర్తయ్యాయి. గుత్తేదారుకు రూ. 3.18 కోట్ల వరకు చెల్లింపులు జరిగాయి. గతేడాది సెప్టెంబరులో వర్షాలకు వాగుకు ఉన్న బండ్‌కట్ట నుంచి వరదనీటి ప్రవాహం పెరిగి సమీపంలోని గృహాలకు ముంపు పొంచి ఉందని కాంక్రీటు కట్టను డిటోనేటర్లతో పేల్చివేశారు. ప్రస్తుతం చెక్‌డ్యాంలో చుక్క నీరు లేదు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గట్టెపల్లిలో రూ. 4 కోట్ల చెక్‌డ్యాం నిర్మాణం పునాది దశలోనే ఉంది. పనులు దక్కించుకున్న గుత్తేదారు అగ్రిమెంటు చేసుకున్న ఏడాదికి పనులు చేసేందుకు ముందుకొచ్చారు. పునాది పనులు చేశాక సిమెంటు, కాంక్రీటు ధరలు పెరగడం.. అంచనాకు మించిన భారమని మధ్యలోనే పనులు వదిలేశారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ వాగులపై 2020లో 114 చెక్‌డ్యాంల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపారు. రెండు విడతల్లో 72 మంజూరు చేశారు. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల పరిధిలోని 52 చెక్‌డ్యాంల నిర్మాణాలు ప్రారంభం కాగా చాలా వరకు పూర్తి కాలేదు. జగిత్యాల జిల్లాలో జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల్లో అయిదు చెక్‌డ్యాంల పనులు మాత్రమే ప్రారంభం కాగా అవి కూడా అసంపూర్తి దశలోనే ఉన్నాయి. ఇటీవల హైదరాబాద్‌లో నీటిపారుదలశాఖ సమీక్షలో రాష్ట్రంలో చెక్‌డ్యాం నిర్మాణ ప్రగతి.. వాటికి వెచ్చించిన నిధులపై ఈఎన్‌సీలతో సమావేశం జరిగింది. వచ్చే వర్షాకాలానికి పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. మూడేళ్లుగా పనులు నత్తనడకన సాగుతుండగా.. కొన్ని నిర్మాణాలు మధ్యలో ఉండగానే వరదలకు కొట్టుకుపోయాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మూలవాగుపై బొల్లారం వద్ద నిర్మించిన చెక్ డ్యాం ముంపుపై అంచనా లేకపోవడంతో వరద పెరిగి పేల్చి వేయాల్సి వచ్చింది. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో జిల్లాస్థాయి ఉన్నతాధికారుల సమీక్షలో పభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. కొట్టుకుపోయిన చోట అక్కడి స్థానిక పరిస్థితులపై అధ్యయనం చేసి నమూనాల్లో మార్పులు చేయాలని సూచించారు.

వైఫల్యాలపై దృష్టి : ఉమ్మడి జిల్లాలో చెక్‌డ్యాంల నిర్మాణాలకు గత ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు వ్యయం చేసింది. ఇంత భారీ మొత్తం ఖర్చుచేసినా.. మొదటి నుంచి నిర్మాణాలపై నీటిపారుదలశాఖ అధికారులు నిశిత దృష్టి సారించలేదనే ఆరోపణలున్నాయి. ఒక్కో చెక్‌డ్యాంకు కనిష్ఠంగా రూ. 50 లక్షల నుంచి గరిష్ఠంగా రూ. 20 కోట్ల వరకు వెచ్చించారు. భారీ వర్షాలకు ఏటా కొన్ని చెక్‌డ్యాంలు కొట్టుకుపోయి పొలాలు కోతకు గురై రైతులు నష్టపోయారు.

దాదాపు రెండేళ్ల కిందట రాష్ట్ర ఉన్నతాధికారుల బృందం వరదలకు కొట్టుకుపోయిన చెక్‌డ్యాంలను పరిశీలించినప్పుడు అన్ని వాగులపై నిర్మించిన చెక్ డ్యాంలన్నింటికీ ఒకే నమూనా ఉందని.. వరద ప్రవాహ వేగాన్ని.. మట్టి నమూనాలు సేకరించకుండా నిర్మాణాలు చేపట్టడంతోనే కొట్టుకుపోతున్నాయని తేల్చింది. వీటన్నింటిని పునర్ అంచనాలతో పనులు చేయాలని సూచించింది. ఇదే విషయమై నీటిపారుదలశాఖ ఇంజినీర్లు గుత్తేదారులతో సమావేశం నిర్వహించగా ఆర్థిక భారమని వారు పనులు చేయడానికి ముందుకు రాలేదు. చేసిన పనులకు డబ్బులు చెల్లించడంతోపాటు.. పునర్ అంచనాలకు అదనపు డబ్బులు చెల్లిస్తేనే పనులు చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికి ఈ విషయమై ఎలాంటి సూచనలు రాలేదు. మరోవైపు పనులు పూర్తి చేసేందుకు అయిదు నెలల సమయం మాత్రమే ఉంది. ఈ విషయమై కరీంనగర్ డివిజన్ ఈఎన్‌సీ శంకర్‌తో మాట్లాడగా అసంపూర్తి దశలో కొట్టుకుపోయినా సరే అగ్రిమెంటు ప్రకారం మొత్తం పనులు చేయాల్సిన బాధ్యత గుత్తేదారుపైనే ఉంటుందన్నారు. ఇప్పటికే చాలా వాటికి గడువులు పొడిగిస్తూ వచ్చామని, జూన్ 30లోగా అన్ని చెక్‌డ్యాంలు పూర్తి చేయాలని అన్నారు. నాబార్డు నిధులతో చేపట్టేవి మాత్రం మార్చి 31వరకే గడువు అని తెలిపారు. అయిదు నెలల్లో పనులు పూర్తి చేయాలని అధికారులు పేర్కొంటుండగా గుత్తేదారులు మాత్రం దెబ్బతిన్న చెక్‌డ్యాంలకు సంబంధించి బిల్లులు ఇవ్వడంతోపాటు పునర్ అంచనాలకు నిధులు ఇవ్వాలని స్పష్టం చేయడంతో రాష్ట్రంలోని కొత్త ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది నీటిపారుదలశాఖలో చర్చ జరుగుతోంది.

# స్వ'గృహ యోగం' ఎన్నడో..

ఖమ్మం: నొప్పి ఒకటైతే మందు ఇంకోటి ఇస్తే ఏం ప్రయోజనం? ఇబ్బంది ఒకటైతే పరిష్కారం మరోటి చూపితే ఏం లాభం? అధికార యంత్రాంగానికి సమస్య తెలుసు.. దానికి విరుగుడూ తెలుసు. అయినా ఏళ్లుగా నాన్చుడు ధోరణితో ఎంతో విలువైన నిర్మాణాలను నిరుపయోగంగా మార్చుతున్నారు.. అటు ప్రభుత్వం ఆశించిన ప్రయోజనం దక్కక.. ఇటు ప్రజల వినియోగానికి నోచక రెంటికీ చెడ్డ రేవడిలా మారింది రాజీవ్ స్వగృహ ఇళ్ల సముదాయం పరిస్థితి.. నూతన ప్రభుత్వం అయినా గృహయోగం కల్పించాలని కోరుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వయాన గృహనిర్మాణ శాఖ మంత్రిగా ఉండటం వల్ల రాజీవ్ స్వగృహ ఇళ్ల సముదాయానికి ఏదో ఓ పరిష్కారం దొరుకుతుందని ఆశిస్తున్నారు.

నిర్మాణం ఇలా..ప్రభుత్వం రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ కింద పోలేపల్లిలోని 9.23 ఎకరాల భూమిలో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు ప్రారంభించారు. ఎనిమిది బ్లాకులు, ఒక్కో బ్లాక్‌లో తొమ్మిది ఫ్లోరులు, ఒక్కో ఫ్లోర్‌కు ఎనిమిది ఇళ్ల చొప్పున మొత్తం 576 ఇళ్లు ఉన్నాయి. వాటిలో రెండు పడక గదుల ఇళ్లు 288 కాగా ఒక్కో ఇంటి విస్తీర్ణం 1,145 చదరపు అడుగులు. మూడు పడక గదుల ఇళ్లు 288 కాగా ఒక్కో ఇంటి విస్తీర్ణం 1,435 చదరపు అడుగులు. ఇళ్ల నిర్మాణం మొత్తం 7,00,600 చదరపు అడుగులు. తొమ్మిది ఎకరాల్లో ఇళ్ల సముదాయాలను నిర్మించారు. ఇంటీరియల్ పనులు మినహా పనులు పూర్తయ్యాయి. రెండో ఫేజ్‌లో నిర్మాణాల కోసం కేటాయించిన ఏడెకరాలు ఖాళీగానే ఉన్నాయి. మొత్తం 16.23 ఎకరాల భూమిలో రెండు విడతల్లో ఇళ్ల సముదాయం నిర్మించాలని నాడు ప్రణాళికలు రూపొందించినా మొదటి విడత మధ్యలో ఆగేసరికి రెండో విడత కోసం కేటాయించిన స్థలం ప్రస్తుతం ఖాళీగానే ఉంది.

ఇదీ నేపథ్యం మధ్యతరగతి వర్గాలు, ప్రభుత్వ ఉద్యోగుల సొంతింటి కలను నెరవేర్చేందుకు 2008లో నాటి సమైక్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజీవ్ సృగృహ పథకానికి శ్రీకారం చుట్టింది. ఖమ్మం జిల్లాకు మంజూరయిన ఇళ్ల సముదాయాన్ని ఖమ్మం గ్రామీణ మండలం పోలేపల్లి రెవెన్యూ పరిధిలో నిర్మాణం చేపట్టారు. తరువాత జరిగిన రాజకీయ మార్పుల వల్ల పనులు మధ్యలో ఆగిపోయాయి.

రెండుసార్లు విక్రయానికి యత్నం

రాజీవ్ సృగృహ ఇళ్ల సముదాయాన్ని అధికారులు రెండుసార్లు విక్రయించేందుకు ప్రయత్నించారు.

1. 2020 ఏడాది ప్రారంభంలో ఓపెన్ ఆక్షన్ ద్వారా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు యత్నించారు. కరోనా మహమ్మారి పరిస్థితులతో నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు.
2. 2022 మార్చి 24న ఈ-వేలం ద్వారా ఇళ్ల సముదాయాలను బ్లాక్‌ల వారీగా విక్రయించేందుకు యత్నించగా ఎవరూ ముందుకు రాలేదు. ఆ తరువాత ఇళ్ల విక్రయాలను ప్రభుత్వం తాత్కాలికంగా వాయిదా వేసింది. మౌలిక వసతుల కల్పన, విక్రయ బాధ్యతను హెచ్‌ఎండీఏకి ప్రభుత్వం అప్పగించింది.

డిపాజిట్ల స్వీకరణ

నాడు ప్రభుత్వ ఉద్యోగులు, మధ్య తరగతి ప్రజల నుంచి ఒక్కో ఇంటికి రూ. 3వేల చొప్పున డిపాజిట్లు స్వీకరించారు. చదరపు అడుగు నిర్మాణానికి రూ. 1,300 ఖర్చు అవుతుందని అంచనా వేసి ఒక్కో చదరపు అడుగు స్థలం అంతకంటే ఎక్కువ ధరకు విక్రయించాలని సమైక్య ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. సమయానికి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయలేకపోయింది. దీంతో డిపాజిట్‌లను వెనక్కి ఇచ్చేశారు.

మంత్రిపైనే ఆశలు

గుండుగుత్తగా బ్లాక్‌ల వారీగా కాకుండా గృహాల వారీగా విక్రయ ఏర్పాట్లు చేసినట్టయితే మధ్యతరగతి వర్గాలు, వేతన జీవులకు ఉపయుక్తంగా ఉంటుంది. బ్లాక్‌ల వారీగా గుత్తేదారులు మినహా సామాన్యులు కొనలేరు. బ్లాక్‌ల వారీగా ఈ-వేలం వేసినా వారినుంచి స్పందన లేదు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి గృహనిర్మాణ శాఖ మంత్రిగా ఉండటం వల్ల స్వగృహ ఇళ్ల సముదాయంపై ప్రభుత్వంతో చర్చించి ఓ నిర్ణయం తీసుకొని ఉపయోగంలోకి తీసుకొస్తారని జిల్లావాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# రాయితీ పథకం.. సర్కారు బడులకు ఊతం

కొత్తగూడెం : విద్యుత్తు బిల్లులు ప్రభుత్వ పాఠశాలలకు భారంగా మారుతున్నాయి. గతేడాది నుంచి 'మన ఊరు- మన బడి' పథకంలో భాగంగా విద్యాలయాలకు అదనంగా గాలిపంకాలు, ఎల్‌ఈడీ టీవీలు, దీపాలు సమకూరాయి. తద్వారా నెలవారీ విద్యుత్తు బిల్లులు అదేస్థాయిలో వస్తున్నాయి. స్టేషనరీ, సుద్దముక్కలు, స్వాతంత్ర్య, గణతంత్ర వేడుకల ఏర్పాట్లు, విద్యుత్తు, ఇంటర్నెట్ బిల్లులు, చిన్నచిన్న మరమ్మతులు, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ, పారిశుద్ధ్యం తదితరాలకు పాఠశాల గ్రాంటు నిధులు వెచ్చించాలి. అధిక శాతం నిధులు విద్యుత్తు బిల్లులకే వెచ్చించాల్సి వస్తోంది. స్వచ్ఛ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా 10 శాతం నిధులను చేతుల శుభ్రత కోసం సబ్బులు, లిక్విడ్, మరుగుదొడ్ల పరిశుభ్రతకు ఖర్చుచేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం 200లోపు యూనిట్ల వరకు ఉచితంగా సరఫరా చేయాలని యోచిస్తుండటం సర్కారు బడులకు కలిసొచ్చే అంశం.

భారీగా పెరిగిన వినియోగం..గృహ వినియోగం మీటర్లు కాకుండా సర్కారు బడులకు వ్యాపార సముదాయ మీటరు కనెక్షన్లు ఇస్తున్నారు. ప్రతి యూనిట్‌కు ఛార్జి రూ. 8 చొప్పున వస్తోంది. 'మన ఊరు- మన



బడి'కి ఎంపికైన ఉన్నత పాఠశాలల్లో మూడు డిజిటల్ ఎల్‌ఈడీ టీవీలతో పాటు ప్రతి తరగతి గదికి నాలుగు ఫ్యాన్లు, ఎల్‌ఈడీ లైట్లు అమర్చారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు నాలుగు ఫ్యాన్లు, నాలుగు దీపాలు సమకూరాయి. వీటితో పాటు కంప్యూటర్ ల్యాబ్‌లు వినియోగిస్తారు. కొన్నిచోట్ల విద్యుత్తు బిల్లుల చెల్లింపులకే పాఠశాల గ్రాంటు సరిపోతుందనే వాదనలున్నాయి. మిగతాచోట్ల నిధులు సరిపోక విద్యుత్తు బిల్లుల బకాయిలు పేరుకుపోతున్నాయి. విద్యార్థులు అధికంగా ఉన్నచోట ఒక్కో పాఠశాలకు నెలవారీగా రూ. 9వేల వరకు బిల్లు వస్తోంది. విద్యుత్తు బిల్లుల చెలింపులు భారంగా మారటంతో సీఎం రేవంత్‌రెడ్డి 200 యూనిట్ల విద్యుత్తు వినియోగం రాయితీ పథకం ప్రభుత్వ పాఠశాలలకూ వర్తించేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది.పాఠశాల గ్రాంటు విద్యుత్తు బిల్లులకే సరిపోతుంది. 'మన ఊరు- మన బడి'కి ఎంపికైన పాఠశాలల్లో విద్యుత్తు వినియోగం ఎక్కువ. రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల రాయితీ ఇస్తే ఎంతో ఉపయుక్తం. గ్రాంటు నిధులను ఇతర అవసరాలకు వినియోగించవచ్చు.సోమశేఖరశర్మ, డీఈఓ, ఖమ్మం



# కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి రూ.50,474 కోట్లు

విజయవాడ: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, ముఖ్యంగా రాజధాని అమరావతికి ప్రాధాన్యత ఇచ్చినట్లు కేంద్ర సమాచారశాఖ సహాయమంత్రి మురుగన్ తెలిపారు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి 2040 లక్షలు కేటాయించామన్నారు. ఆయా ప్రాంతాల్లో 8.2 శాతం ఆర్థిక అభివృద్ధిని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. కేంద్ర బడ్జెట్ అనంతరం మేధావులు, వివిధ వర్గాల ప్రతినిధులతో సమావేశమయ్యేందుకు విజయవాడ వచ్చిన కేంద్ర మంత్రి మురుగన్.. ఓ హోటల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలను సరళతరం చేయడంతోపాటు ఎంఎస్ఎంఈలను బలోపేతం చేసే దిశగా బడ్జెట్‌లో తగిన ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. తాజా బడ్జెట్‌లో ఏపీ అభివృద్ధికి రూ.50,474 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. పోలవరం ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేసేందుకు కేంద్రం కట్టుబడి ఉందన్నారు. విశాఖ – చెన్నై, హైదరాబాద్–బెంగుళూరు పారిశ్రామిక కారిడార్‌లకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చామని, ప్రతిష్ఠాత్మక పూర్వోదయ పథకాన్ని తీసుకొచ్చామని తెలిపారు. దీనివల్ల ఝార్ఖండ్ నుంచి ఆంధ్రప్రదేశ్ వరకు ఉన్న తూర్పుతీర ప్రాంతాన్ని దేశానికి గ్రోత్ఇంజిన్‌గా మారుస్తామన్నారు. ఏపీలోని రాయలసీమ, ఉత్తరాంధ్రతోపాటు ప్రకాశం జిల్లాను కూడా వెనుకబడిన ప్రాంతంగా గుర్తించి.. ఆయా ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారు. దేశంలో రొయ్యల ఎగుమతిలో 60శాతం ఆంధ్రప్రదేశ్ నుంచే ఉందని, బ్రీడింగ్ సెంటర్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. వ్యవసాయంలో విభిన్న పంటల పెంపకం కోసం పరిశోధనలు చేసేందుకు వీలుగా నిధులు కేటాయిస్తామన్నారు.



# 'తప్పు జరిగింది.. క్షమించండి': పారిస్ ఒలింపిక్స్ నిర్వాహకులు

పారిస్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవ పరేడ్‌లో ఓ పొరపాటు చోటుచేసుకుంది. దాంతో విశ్వక్రీడల నిర్వాహకులు దక్షిణ కొరియాకు క్షమాపణలు చెప్పాల్సి వచ్చింది. ఇంతకీ ఏం జరిగిందంటే..? శుక్రవారం సెన్ నదిపై పారిస్ ఒలింపిక్స్ ఆరంభ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఫ్రెంచ్ అక్షర క్రమంలో ఒక్కో దేశం నదిపై పరేడ్‌లో పాల్గొంది. ఈ క్రమంలోనే బోట్‌లో జెండాను ఊపుతూ దక్షిణ కొరియా క్రీడాకారుల బృందం రాగా.. ఆ దేశాన్ని పరిచయం చేస్తూ డెమొక్రాటిక్ పీపుల్స్ ఆఫ్ కొరియా అని వెల్లడించారు. అది ఉత్తరకొరియా అధికారిక నామం. రిపబ్లిక్ ఆఫ్ కొరియా అంటే దక్షిణ కొరియా. పేరు విషయంలో గందరగోళం ఈ పరిస్థితికి దారితీసింది. తమ పొరపాటును గుర్తించిన నిర్వాహకులు క్షమాపణలు కోరారు. "ప్రారంభ కార్యక్రమం ప్రసారంలో భాగంగా కొరియన్ బృందాన్ని పరిచయం చేస్తున్నప్పుడు జరిగిన పొరపాటుకు క్షమాపణలు కోరుతున్నాం" అని ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ ఎక్స్ ఖాతాలో కొరియన్ భాషలో పోస్టు పెట్టింది. ఈ ఘటనపై ఐఓసీ ప్రెసిడెంట్ థామస్ బాక్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని దక్షిణ కొరియా క్రీడాశాఖ మంత్రి కోరారు. దీనిపై ఫ్రాన్స్ ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

# జగన్‌తో పాటు సాక్షి, దాని అనుబంధ మీడియా నోటీసు ఎదుర్కోక తప్పదు..



అమరావతి: అసెంబ్లీలో పెట్టిన శ్వేతపత్రాన్ని వక్రీకరించిన సాక్షి, దాని అనుబంధ మీడియాలు సభా హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డాయని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి తో పాటు సాక్షి, దాని అనుబంధ మీడియా సభాహక్కుల కమిటీ నుంచి నోటీసు ఎదుర్కోక తప్పదన్నారు. సభా హక్కుల కమిటీ ఏర్పాటయ్యాక సభలో చట్ట సభల సమాచారాన్ని వక్రీకరించిన వారిపై చర్యలు ఉంటాయన్నారు. రాష్ట్ర ఖజానాకు రావాల్సిన ఆదాయంతో వైసీపీ నాయకులు తమ జేబులు నింపుకున్నారన్నది వాస్తవమన్నారు. అందుకే రాష్ట్రానికి లక్షలది కోట్ల రూపాయల అప్పులు మిగిలాయన్నారు. రాష్ట్రంలో అప్పులు పెరిగి ఆదాయం లేదనే వాస్తవాల శ్వేతపత్రం ముఖ్యమంత్రి ప్రజలు ముందు పెట్టడాన్ని వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని యనమల అన్నారు. శ్వేతపత్రం పై అభ్యంతరాలు ఉంటే అసెంబ్లీకి రావాలి కానీ జగన్ ఢిల్లీ పోవటం, మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విజయవాడ రాకుండా హైదరాబాద్ పోయి మాట్లాడటం వారిలో భయాందోళనకు నిదర్శనమన్నారు. జగన్ అప్పుల గురించి తప్పులు మాట్లాడుతూ ఇంకా దిగజారిపోతున్నారని యనమల విమర్శించారు. శ్వేతపత్రంలో అప్పులు అవాస్తవమంటున్న జగన్.. తన ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. గత ఐదేళ్లలో రాష్ట్రానికి ఆదాయం వచ్చిందన్నది వాస్తవమన్నారు. అయినా రూ.10 లక్షల కోట్లు అప్పు తెచ్చారంటే.. ఆదాయం ఎవరి జేబుల్లోకి వెళ్లిందో సమాధానం చెప్పాలన్నారు. ఎంత తెచ్చారు, ఎంత ఖర్చు పెట్టారు? ఎంత వృద్ధి సాధించారంటే జగన్ వద్ద సమాధానం లేదన్నారు. తాను చెబుతున్నట్లు ప్రమాదంలో ఉన్న పాలన అందించి ఉంటే ప్రజలు ఇంత ఘోరంగా తీర్పు ఇచ్చి ఉండేవారు కాదని జగన్ గ్రహించాలని యనమల అన్నారు. తాను ఏ తప్పు చేయలేదని జగన్ అంటుంటే... తప్పు చేశాడు కాబట్టే పక్కన పెట్టామని ప్రజలు అంటున్నారన్నారు. అభివృద్ధి ద్వారా రాష్ట్ర ఆదాయం పెంచి, దానిని ప్రజలకు పంచటం తెలుగుదేశం ప్రభుత్వానికి తెలిసిన విద్య అని బుగ్గన గ్రహించాలన్నారు. జగన్ ఓటు ఆన్ అకౌంట్‌పై కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. జగన్ ఫ్రస్టేషన్‌లో ఉండి మాట్లాడుతున్నారని యనమల పేర్కొన్నారు.

# ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘంలో చీలిక.. కొత్త అధ్యక్షుడు ఎవరంటే?




విజయవాడ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘంలో చీలిక ఏర్పడింది. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణను బహిష్కరిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కార్ రావు ప్రకటించారు. సంఘం మాటున సూర్యనారాయణ అనేక అక్రమాలు చేశారంటూ ఆస్కార్ రావు వర్గం మీడియా సమావేశం పెట్టి పలు ఆరోపణలు చేశారు. సూర్యనారాయణ ప్రవర్తన వల్ల సంఘంపై అనేక కేసులు పడ్డాయని, మాట్లాడితే షోకాజ్ నోటీసు ఇవ్వడం, రాజీనామా చేయించడం సర్వసాధారణంగా ఆయన మార్చేశారని మండిపడ్డారు. తనను కూడా అప్రజాస్వామికంగా బయటకు పంపారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత ఉద్యోగినైన తనను అనేక సార్లు తీవ్రంగా అనుమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. గుళ్లనాగసాయిని కూడా సంఘం నుంచి బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. సంఘం తాత్కాలిక నూతన అధ్యక్షుడిగా డి.శ్రీకాంత్‌ను నియమిస్తున్నట్లు ఆస్కార్‌రావు చెప్పారు. ఏపీజీఈఏకు మరోసారి ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.




వైసీపీ హయాంలో మంజూరుచేసిన టీడీఆర్ బాండ్ల కుంభకోణం గుట్టు రట్టు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విచారణ కు ఆదేశాలు జారీచేసింది. నిజాలు నిగ్గు తేల్చేందుకు సీబీ సీఐడీ రంగంలోకి దిగుతోంది. తణుకులో జరిగిన కుంభ కోణం పై ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ శాసనసభలో ప్రస్తావించారు. తాడేపల్లిగూడెం కుంభకోణంపై టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల బాబి మున్సిపల్ అధికారులకు వివరాలు అందజేశారు. దీంతో ప్రభుత్వం విశాఖపట్నం, తిరుపతి, తణుకులతో పాటు తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలోనూ ఈ కుంభకోణం తేల్చాలని సీబీసీఐడీని ఆదేశించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో తణుకు మునిసిపాలిటీలో పోస్ట్ యార్డు విస్తరణ కోసం ఆరు ఎకరాలను కొనుగోలు రు. ఎకరానికి రూ.కోటి చెల్లించేలా స్థల యజమానులతో నిసిపాలిటీకి ఒప్పందం కుదిరింది. ఇంత వరకు బాగానే ఉంది. కాని తర్వాత మున్సిపాలిటీ దానిని గజాల్లో మార్చేసి, గజం ధర రూ.20) వేలుగా నిర్ణయించింది. రోడ్లు విస్త రించాల నుకున్నప్పుడే మాస్టర్ ప్లాన్కు అనుగుణంగా స్థలాలను సేకరి స్తారు. ఇందుకోసం స్థల యజమానులకు గజానికి నాలుగు రెట్లు విలువైన బాండ్లు జారీచేస్తారు. కానీ తణుకులో కంపో యార్డు కోసం ముందుగానే స్కెచ్ వేసి భూమిని గజాల్లో సేకరించారు. సెంటుకు 48 గజాల వంతున ఎకరానికి 4,800 గజాలుగా నిర్ణయించారు. నాలుగు రెట్లు టీడీఆర్ బాండ్లు జారీచేశారు. ఒక్కో గజానికి రూ.20 వేల ధరతో బాండ్లు మంజూరయ్యాయి. అంటే ఎకరం విలువ రూ.నిగి కోట్లు అయ్యింది. కేవలం రూ.కోటి విలువ చేసే భూమిని రూ.38 కోట్ల విలువతో మున్సిపాలిటీ సేకరించింది. కంపోస్ట్ యార్డు కోసం గజాల రూపంలో సేకరించి టీడీఆర్ బాండ్లు జారీ చేయడం ఒక తప్పిదమైతే రిజిస్ట్రేషన్ చేయకుండానే ఒప్పందం చేసుకున్న వారి పేరుతో మంజూరు చేయడం మరో తప్పిదం. ఈ విషయంలో వైసీపీ నేత కీలకంగా వ్యవహరించారు. కొత్త రహదారి ఏర్పాటు, గ్రీన్ ఫీల్డ్ అంటూ మరో తొమ్మిది ఎకరాలు భూమికి బాండ్లు జారీ అయ్యాయి. మొత్తంగా 21 ఎకరాలకు రూ.900 కోట్ల విలువైన బాండ్లు జారీ ఆయ్యా యి. అప్పట్లో టీడీపీ గట్టి పోరాటం చేయడంతో ప్రభుత్వం తూతూమంత్రంగా దర్యాప్తు చేపట్టింది. తక్షణం మునిసిపల్ కమిషనర్, టీపీవోలను సస్పెండ్ చేశారు. బాండ్లను బ్లాక్ లిస్టులో పెట్టారు. బాండ్ల మంజూరులో కీలకపాత్ర పోషిం చిన వైసీపీ నేతలపై ఎలాంటి చర్యలు లేవు. బాండ్ల కొనుగోలు చేసిన వారంతా రోడ్డున పడ్డారు. ఇప్పుడు వీటిపై సీబీసీఐడీ దర్యాప్తు జరగనుంది. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీఆర్ బాండ్లపై పట్టు బిగించింది. బాండ్ల జారీతోపాటు, అమ్మకం నిర్వహించిన వారు బలి కానున్నారు. వైసీపీ నేత ఖాతాలోనూ నేరుగా జమ అయితే ఆయనపైనా చర్యలు ఉండే అవకాశం ఉంది.

**తాడేపల్లిగూడెంలో నేతకే ముడుపులు..** తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో ముగ్గురు కమిషనర్లు రహదారి విస్తరణ పేరుతోనే టీడీఆర్ బాండ్లు జారీచేశారు. లబ్ధి మాత్రం వైసీపీ నేతకు దక్కింది. తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో కూటమి నేతల లెక్కల ప్రకారం రూ.142 కోట్ల విలువైన బాండ్ లు జారీచేశారు. అధికారులు మాత్రం రూ.82 కోట్ల విలువైన బాండ్లు జారీ చేసినట్టు లెక్కలు చెబుతున్నారు. తాడేపల్లిగూడెంలోనూ స్థల యజమానుల పేరుతో కాకుండా ఒప్పందం చేసుకున్న వారితో బాండ్లు జారీ అయిన ఉదంతా లు ఉన్నాయి. వైసీపీ నేత మున్సిపల్ అధికారుల మెడపై కత్తి పెట్టి ఉన్నతాధికారులతో ఒత్తిడి పెంచి బాండ్లు మంజూరు చేయించారు. ప్లాన్ లేకుండా వైసీపీ నేత కల్యాణ మండ పం నిర్మించారు. అదే స్థలంలో రహదారి విస్తరణ అంటూ వైసీపీ నేత పేరుతో బాండ్లు మంజూరుచేశారు. తెలుగుదేశం నాయకులు పట్టుబడితే అక్కడ స్థలాన్ని సేకరించినట్లు హద్దు లు గీశారు.వీ మిగిలినచోట్ల ఎక్కడా స్థలాలను సేకరించ కుండానే బాండ్లు జారీ అయ్యాయి. అటువంటి చోట్ల వ్యాపా ర సముదాయాలు వున్నాయి. రహదారి విస్తరిస్తేనే స్థల సేకరణ ఆవశ్యకత ఉంటుంది. రహదారి విస్తరణ జరగదని తెలిసే మాస్టర్ ప్లాన్ పేరుతో 100 అడుగులకు బాండ్లు జారీ చేస్తున్నారు. తాడేపల్లిగూడెం–భీమవరం రహదారి వెంబడి మున్సిపాలిటీ ఇటువంటి దందా సాగించింది. ఇప్పుడు సీబీసీ ఐడీ దర్యాప్తునకు ఆదేశించడంతో అధికారుల వెన్నులో వణు కు పుడుతోంది. బాండ్లు జారీచేసిన అధికారులు ఇతర చోట్లకు బదిలీపై వెళ్లిపోయారు. వారంతా కూటమి నేతలతో సంప్రదింపులు జరిపినా ఫలితం లేకపోయింది. త్వరలోనే ఈ రెండు మునిసిపాలిటీల్లో గట్టు రట్టుకానుంది.



# సీఎం చంద్రబాబు ఆదేశం.. గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో మంత్రుల బృందం పర్యటన


పోలవరం: వైకాపా హయాంలో నిర్వాసితులను గాలికి వదిలేశారని ఏపీ మంత్రులు విమర్శించారు. గోదావరి వరద కారణంగా ఇబ్బందులు పడుతున్న నిర్వాసితులను పరామర్శించాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాలతో మంత్రుల బృందం శనివారం పోలవరం విలీన మండలాల్లో పర్యటించింది. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి, హోం మంత్రి వంగలపూడి అనితతో కూడిన మంత్రుల బృందం కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పర్యటించింది. కుక్కునూరు మండలం దాచారం పునరావాస కాలనీని సందర్శించిన మంత్రులు.. అక్కడ నిర్వాసితులకు అందుతున్న ప్రభుత్వ సహాయాన్ని పరిశీలించారు. సహాయ కార్యక్రమాలపై బాధితులు, అధికారులను ముఖాముఖి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పునరావాస కాలనీల్లో ఉన్న సమస్యలను బాధితులు మంత్రుల దృష్టికి తెచ్చారు. అనంతరం అక్కడి నుంచి వేలేరుపాడు మండలం కన్నాయిగుట్ట చేరుకున్న మంత్రులు గోదావరి వరద ప్రవాహాన్ని పరిశీలించారు. వరద ఉద్ధృతి పెరుగుతున్న నేపథ్యంలో ముంపు గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ప్రస్తుతం పునరావాస కాలనీల్లో తలదాచుకుంటున్న వరద బాధితులకు ప్రభుత్వం తరపున నిత్యావసరాలు అందిస్తున్నామని, వరద తగ్గిన తర్వాత ఒక్కో కుటుంబానికి రూ.3 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

# వైసీపీ హయాంలో సర్పంచ్‌లను వేధించారు: వైవీబీ రాజేంద్రప్రసాద్



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఉపాధి హామీ నిధులు రూ.250కోట్లు, నీరు– చెట్టు కింద రూ.45కోట్లు విడుదల చేసినందుకు ఏపీ పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్ర ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడ బాలోత్సవ భవన్‌లో ఏపీ పంచాయతీ రాజ్ ఛాంబర్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఆయన నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీలకు తీరని ద్రోహం జరిగిందని, పంచాయతీ రాజ్ వ్యవస్థను కాపుడుకోవడానికి వైసీపీ హయాంలో పోరాటాలు చేసినట్లు రాజేంద్ర ప్రసాద్ చెప్పుకొచ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీల నిధులు దుర్వినియోగం చేశారని రాజేంద్ర ప్రసాద్ ఆరోపించారు. పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా తమను ఇబ్బందులకు గురి చేశారని మండిపడ్డారు. సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించకుండా వారిని వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ హయాంలో తాము ఎన్నో ఉద్యమాలు చేసినట్లు ఆయన చెప్పుకొచ్చారు. తమ ఉద్యమాలు ఫలించి ఏపీలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారం చేపట్టాకే నిధులు విడుదల చేసి తమను ఆదుకున్నట్లు రాజేంద్ర ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

# జగన్‌కు మీడియా ముందు మాట్లాడే ధైర్యం లేదా?: దేవినేని ఉమా..



ఎన్టీఆర్: ఏపీ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా మాజీ ముఖ్య మంత్రి, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి విధ్వంసకర కార్యక్రమాలకు పాల్పడుతున్నారని టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌కు మీడియా ముందు మాట్లాడే ధైర్యం లేదని, అందుకే ఆయన తాడేపల్లి ప్యాలెస్‌లో బ్లూ మీడియాకు పరిమితం అయ్యారని ఎద్దేవా చేశారు. 151సీట్లు గెలిచి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మీరు మీడియా ఎదుటికి రాలేదు, మరిప్పుడు 11సీట్లకే పరిమితమైనా రారా? అంటూ జగన్‌ను ప్రశ్నించారు. చెరువు మీద అలిగినవాడి పరిస్థితి ఏమైందో నేడు అసెంబ్లీపై అలిగిన జగన్ పరిస్థితి కూడా అంతే అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

**ఏపీని అప్పులమయం చేశారు..** ఐదేళ్లలో జగన్ రెడ్డి రూ.12,93,216 కోట్ల ఆర్థిక విధ్వంసం చేశారని, ప్రజలపై రూ.9,74,556కోట్ల భారం మోపారని మాజీ మంత్రి దేవినేని ఉమా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ బటన్ నొక్కుడుతో పేద వర్గాలకు ఎంత వెళ్లాయో, తాడేపల్లి ప్యాలెస్‌కు ఎంత వెళ్లాయో ఆర్థికశాఖ లోతైన విచారణ జరపాలని మాజీ మంత్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని దుయ్యబట్టారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు 11సీట్లకే పరిమితం చేసినా ఆయన ముఖంలో పశ్చాత్తాపం, పరివర్తన కనిపించడం లేదని మాజీ మంత్రి అన్నారు. ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ జగన్ సిగ్గులేకుండా న్యాయస్థానాల చుట్టూ తిరుగుతున్నారని ఆయన మండిపడ్డారు.

# హరిరామ జోగయ్య మళ్లీ స్టార్ట్ చేశారు.. ఈసారి చంద్రబాబును కూడా..

ఏలూరు: హరిరామ జోగయ్య.. కాపు బలిజ సంక్షేమ సేన అధ్యక్షుడు.. ఏపీ ఎన్నికలకు ముందు ఈయన పేరు పదే పదే వినిపించేది. ఊ అంటే ఆ అంటే పేపరు పట్టుకుని జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు లేఖలు రాసేవారు. పవన్‌ను ఇబ్బంది పెట్టడమే పనిగా పెట్టుకునేవారు. ఇవన్నీ ఎవరు రాయించారనేది జనమందరికీ తెలిసిందే. అయితే కూటమి ఎన్నికల్లో గెలిచాక మాత్రం హరి రామ జోగయ్య సైలెంట్ అయ్యారు. ఒకరకంగా ఆయన చేత లేఖలు రాయించిన వారు సైలెంట్ అవడంతో ఆయన కూడా కామ్ అయ్యారు. ఇప్పుడు మళ్లీ కాస్త ఊపు వచ్చినట్టుంది. తిరిగి పెన్నూ.. పేపర్ అందుకున్నారు. ఈసారి పవన్‌ను మాత్రమే కాదండోయ్.. ముఖ్యమంత్రి చంద్రబాబును కూడా కలిపే లేఖ రాశారు. ఎందుకంటారా? ఉండనే ఉందిగా కాపు రిజర్వేషన్ అంశం. ఎప్పుడూ దీనిని రావణ కాష్టంలా మండించేందుకు యత్నిస్తూనే ఉంటారు. కాపులకు విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కాపు బలిజ సంక్షేమ సేన అధ్యక్షుడు చేగొండి హరి రామ జోగయ్య లేఖ రాశారు. కాపులకు విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్ కల్పించాలని బ్రిటీష్ కాలం నుంచి డిమాండ్ చేస్తున్నామని లేఖలో పేర్కొన్నారు. ఈడబ్ల్యూఎస్ 10 శాతం కోటాలో కాపులకు 5 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ గతంలో టీడీపీ ప్రభుత్వం ఆమోదించిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్ కాపుల రిజర్వేషన్ అమలు చేయకుండా నిలిపివేశారన్నారు. కాపులకు రిజర్వేషన్ వ్యవహారం కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉందంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రకటన చేశారని తెలిపారు. తమ సామాజిక వర్గానికి రిజర్వేషన్ కల్పించాలంటూ కాపు సంక్షేమ సేన అనేక ఉద్యమాలు చేసిందని హరిరామ జోగయ్య తెలిపారు. ఈడబ్ల్యూఎస్ కోటాలో కాపులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ కాపు సంక్షేమ సేన రాష్ట్ర న్యాయస్థానంలో పిటిషన్ సైతం వేసిందన్నారు. కాపులకు రిజర్వేషన్ కల్పించడానికి వైసీపీ ప్రభుత్వం విముఖత తెలుపుతూ న్యాయ స్థానంలో పిటిషన్ దాఖలు చేసిందన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం కాపు రిజర్వేషన్ పై సానుకూలంగా స్పందిస్తూ న్యాయస్థానంలో కొత్త అఫిడవిట్ దాఖలు చేయాలని కోరుతున్నామని హరిరామ జోగయ్య తెలిపారు. త్వరలో కాపు రిజర్వేషన్ పై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు సానుకూల నిర్ణయం తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామని అన్నారు.

## బులుగు ఫ్రాకులో ప్రగ్య మంటలు

అందం ఉంది .. ప్రతిభ ఉంది .. కొన్ని పెద్ద అవకాశాలు వచ్చాయి... కానీ ఎక్కడో తేడా కొట్టింది. కారణం ఏదైనా కానీ ప్రగ్య జైశ్వాల్ తాను ఆశించిన స్టార్ డమ్ ని దక్కించుకోలేకపోయింది. ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడం కోసం ఇంకా ఇంకా వేచి చూడాల్సిన పరిస్థితి. ఇటు సౌత్.. అటు నార్త్ రెండు చోట్లా ఇదే పరిస్థితి. పెద్ద స్టార్లు అవకాశాలు కల్పించినా కానీ తనకు విజయాలు కరువవ్వడం కెరీర్ పై తీవ్ర ప్రభావం చూపుతోంది. అయినా ప్రగ్యా మాత్రం నిరాశ చెందక తనవంతు ప్రయత్నాలను ఆపడం లేదు. ఇప్పటికీ తెలుగులో ప్రముఖ దర్శకనిర్మాతలకు ఈ భామ ఫీలర్స్ పంపుతూనే ఉంది. పలువురు అగ్ర హీరోల సరసన అవకాశం వచ్చినట్టే వచ్చి



మిస్సయిందని ఇటీవల కథనాలొచ్చాయి. అయినా ఇవేవీ తనని ప్రభావితం చేయడం లేదు. ఎప్పటిలానే వరుస ఫోటోషూట్లను షేర్ చేస్తూ ప్రగ్య తన అభిమానులకు టచ్ లో ఉంది. తాజాగా ప్రగ్య షేర్ చేసిన ఓ హాట్ ఫోటోషూట్ ఇంటర్నెట్ ని షేక్ చేసింది. అందమైన నీలిరంగు మినీ దుస్తులలో ప్రగ్య ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా కనిపిస్తోంది. స్లీవ్ లెస్ డిజైనర్ ఫ్రాకులో ప్రగ్య అందచందాలను వర్ణించడానికి గమ్మత్తయిన పదాల్ని వెతుక్కోవాలి. ప్రగ్య కొత్త లుక్ ఇప్పుడు అంతర్జాలంలో వైరల్ గా దూసుకెళుతోంది. ప్రగ్యా స్టైలింగ్ గురించి యువతరం ప్రత్యేకంగా తరచి చూస్తోంది. మునుపటి కంటే బోల్డ్ ఫ్యాషన్ ఎంపికతో అందరి దృష్టిని ఆకర్షించింది. చివరిగా ఇలాంటి సిన్సియర్ ప్రయత్నాలు ఫలించి ఏదైనా కొత్త సినిమాని ప్రకటిస్తుందేమో చూడాలి.

## 18 ఏళ్ల వయసులో చీవాట్లు తిన్న సుస్మితాసేన్!

తాలీ లాంటి సక్సెస్ ఫుల్ సిరీస్ తర్వాత మాజీ విశ్వ సుందరి సుస్మితా సేన్ బాలీవుడ్ లో ఫుల్ బిజీ అవ్వడం ఖాయమనుకున్నారంతా. కానీ ఆమె కెరీర్ అలా కనిపించలేదు. తాలి హిట్ అందుకుని ఏడాది సమీపిస్తున్నా ఇంత వరకూ కొత్త ప్రాజెక్ట్ కి సైన్ చేసింది లేదు. అటు సినిమాలు చేయలేదు. ఇటు కొత్త సిరీస్ లకు సైన్ చేసింది లేదు. కానీ ఎఫైర్ల వార్తలతో మాత్ర నెట్టింట హాట్ టాపిక్ గా మారుతుంది. లలిత్ మోదీతో బ్రేకప్ తర్వాత మళ్లీ పాత బోయ్ ఫ్రెండ్ కే దగ్గరవుతుందని ప్రచారం సాగింది. ఇద్దరు జంటగా కనిపించిన సందర్భాలతో అది స్నేహమా? రిలేషన్ షిప్ నా? అన్నది మరో డౌట్ గా మారింది. అదంతా పక్కనబెడితే నేటి సమాజం తీరును..నాటి సమాజం తీరును సరిపోల్చుతూ 18 ఏళ్ల వయసులో వాడిన అసభ్య పదజాలన్ని గుర్తు చేసుకుంది సుస్మితా సేన్. ఆ రోజుల్లో సమాజం ఇప్పటిలా ఓపెన్ గా లేదు. ఏం చెప్పాలన్నా సంకోచించేవారు. 18 ఏళ్ల వయసులో శోభా దేతో ఇంటర్వ్యూ సందర్భంగా ఉద్దే



శపూర్వకంగానే ఓ బూతు పదం తీసుకొచ్చా.

ఎందుకంటే ఓ మనిషిగా నిజమైన స్వేచ్ఛ కావాలనుకున్నాను. ఆ ప్రయత్నంలోనే భారతదేశపు మొట్ట మొదటి మిస్ యూనివర్స్ అయ్యా. కానీ ఆ పదం వాడినందుకు ఇంటికెళ్లిన తర్వాత అమ్మ-నాన్న హెచ్చరించారు. నేను వాడిన పదజాలం వాళ్లకు ఎంత మాత్రం నచ్చలేదు. నీ భుజాలపై పెద్ద బాధ్యత ఉంది. అలాంటి బూతు పదం ఇంటర్వ్యూలో ఎందుకు మాట్లాడావు అని దండించారు. శోభా దే మీ గురించి చెడుగా రాస్తున్నారని చెప్పారు. దీంతో నేను ఆశ్చర్యపోయాను. స్వేచ్ఛ అనే విషయంలో నేను పూర్తిగా ఛాన్స్ తీసుకున్నాను అనిపించింది అని తెలిపింది.




## ఈ స్త్రీలో ఆ కొంటెతనం ఛమత్కారం ఏదీ?




శ్రద్ధా కపూర్ నటించిన స్త్రీ 2018లో బ్లాక్ బస్టర్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ సినిమా కథ, కంటెంట్ తో పాటు పాత్రల తీరుతెన్నులు, మ్యూజిక్ కూడా విజయంలో కీలక పాత్ర పోషించాయి. ఆ సినిమాలో టైటిల్ పాత్రలో నటించిన శ్రద్ధా కపూర్ నటనకు గొప్ప పేరు వచ్చింది. అందులో కొంటెతనం నిండిన ఛమత్కారమైన పాత్రలో శ్రద్ధా నటనకు గొప్ప ప్రశంసలు కురిసాయి. అదంతా అటుంచితే పార్ట్ 2 ఈ ఆగస్టులో విడుదలకు వస్తుండగా ప్రమోషనల్ మెటీరియల్ గురించి కొన్ని విమర్శలు వస్తున్నాయి. స్త్రీ ఫ్రాంఛైజీలో ఇప్పుడు రెండో సినిమా పూర్తిగా కొత్త పంథా కథతో రూపొందుతోందని ఈ ప్రచార మెటీరియల్ చెబుతోంది. కానీ ఇది ప్రజలకు ఎంతమాత్రం నచ్చడం లేదు. ఇటీవల విడుదలైన తమన్నా స్పెషల్ సాంగ్ బావుంది. అందులో తమన్నా మూవ్స్ బావున్నాయి. కానీ ఈ పాటను నోరా ఫతేహి పార్ట్ 1 సాంగ్ తో పోల్చి చూస్తున్నారు. అలాగే సీక్వెల్‌లో టైటిల్ పాత్రలో కొంటెతనం కానీ, ఛమత్కారం కానీ కనిపిస్తాయా లేదా? అన్న సందిగ్ధత అందరిలో నెలకొంది. శ్రద్ధా పాత్రను ఇప్పుడు పూర్తిగా కొత్త విధానంలో డిజైన్ చేయడం నిరాశను కలిగిస్తోంది. అయితే ప్రచార మెటీరియల్ కంటే భిన్నంగా థియేటర్లలో స్త్రీ2ని ఎలా చూపిస్తారో చూడాలని అంతా వేచి చూస్తున్నారు. పార్ట్ 1లో నోరా ఫతేహి కమరాయి.. అభిమానులు ఎంతగానో ఇష్టపడిన మిలేగీ మిలేగి, ఆవో కభీ హవేలీ పే వంటి పాటల్లో ఉన్న పెప్ ఇప్పటి రెండో భాగం పాటల్లో మిస్సయిందని కూడా విమర్శలొస్తున్నాయి. సాహిత్యం, సంగీతం పరంగా స్త్రీ రేంజులో ఏదీ కుదరలేదని కూడా విశ్లేషిస్తున్నారు. ఈసారి స్త్రీ వినోదం స్థాయి తగ్గిందని కూడా కొందరు చెబుతున్నారు. అమర్ కౌశిక్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఆగస్టు 15న సినిమా విడుదల కానుంది. పార్ట్ 3 ఉంటుందా లేదా? అన్నది రెండో భాగం విజయంపై ఆధారపడి ఉంది.

## బెల్లంకొండ కొత్త మూవీ.. బాబు మళ్ళీ స్పీడ్ పెంచాడు



టాలీవుడ్ యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్.. కొన్ని నెలలుగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం వరుస సినిమాలను లైన్ లో పెడుతున్నారు. ఎలా అయినా హిట్ కొట్టాలనే పట్టుదలతో కథలు సెలెక్ట్ చేసుకుంటున్నారు. టైసన్ నాయుడు మూవీని పూర్తి చేస్తున్న సాయి శ్రీనివాస్.. ఇటీవల కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వంలో మరో సినిమా స్టార్ట్ చేశారు. అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా నటిస్తోంది. తాజాగా సాయి శ్రీనివాస్ మరో కొత్త మూవీ అనౌన్స్మెంట్ వచ్చేసింది. లెజెండరీ డైరెక్టర్ కోడి రామకృష్ణ 75వ జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటూ సినిమాను అనౌన్స్ చేశారు మేకర్స్. కొత్త డైరెక్టర్ లుధీర్ బైరెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీని మూన్ షైన్ పిక్చర్స్ బ్యానర్ పై మహేష్ చందు నిర్మిస్తున్నారు. మూవీని ప్రకటిస్తూ స్పెషల్ పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. ప్రస్తుతం అది సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. పోస్టర్ లో హీరో పురాతన ఆలయం ముందు నిలబడి దీర్ఘంగా చూస్తున్నారు. టెంపుల్ పై సూర్యకిరణాలు పడడంతో పోస్టర్ అంతా డివోషనల్ వైబ్ తో ఆకట్టుకుంటోంది. సాయి శ్రీనివాస్ తుపాకీ పట్టుకుని గుడి వైపు చూస్తూ రాళ్లపై నిలుచున్నారు. 400 ఏళ్ల నాటి గుడి నేపథ్యంతో సూపర్ నేచురల్ థ్రిల్లర్ గా రూపొందుతున్న ఈ మూవీలో సాయి శ్రీనివాస్ ను ఇప్పటి వరకు ఎవరూ చూడని అవతార్ లో మేకర్స్ చూపించనున్నారట. కమర్షియల్ అంశాలతో కూడిన ఇంట్రెస్టింగ్ అండ్ పవర్ ఫుల్ స్క్రిప్ట్ ను సినిమా కోసం దర్శకుడు లుధీర్ బైరెడ్డి సిద్ధం చేశారు. భారీ బడ్జెట్ తోపాటు అత్యున్నత సాంకేతిక విలువలతో నిర్మిస్తున్నారు మేకర్స్. సాయి శ్రీనివాస్ కెరీర్ లో హైయెస్ట్ బడ్జెట్ మూవీగా శివన్ రామకృష్ణ సమర్పిస్తున్నారు. కొన్ని రోజుల క్రితమే ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ఒక షెడ్యూల్ పూర్తి కూడా అయింది. బుధవారం నుంచి రెండో షెడ్యూల్ స్టార్ట్ కానుంది. ఈ సినిమాకు గాను.. ప్రముఖ టెక్నీషియన్లను రంగంలోకి దించారు మేకర్స్. శివేంద్ర కెమరామ్యాన్ గా వ్యవహరిస్తున్నారు. లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నారు. కార్తీక్ శ్రీనివాస్ ఎడిటర్ గా, శ్రీ నాగేంద్ర తంగాల ఆర్ట్ డైరెక్టర్ గా పనిచేస్తున్నారు. పాన్ ఇండియా లెవల్ లో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాపై ఫస్ట్ పోస్టర్ తో మంచి అంచనాలు నెలకొన్నాయి. మరి ఈ మూవీతో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఎలాంటి విజయం అందుకుంటారో వేచి చూడాలి.

## 'సీతారామం'ని మర్చిపోలేని మృణాల్!

2022 బ్లాక్ బస్టర్ మూవీ సీతారామంని ఎప్పటికీ మర్చిపోలేదు మృణాల్ ఠాకూర్. ఈ సినిమా విజయం ఈ బ్యూటీ కెరీర్‌కి ఆక్సిజన్ ని నింపింది. అలాంటి గొప్ప అవకాశం కల్పించిన వైజయంతి మూవీస్ ని, హను రాఘవపూడిని, అలాగే దర్శకుడు నాగ్ అశ్విన్ ని మృణాల్ ఎప్పటికీ మర్చిపోలేదు. ఈ సినిమాలో నటనకు గాను ఉత్తమ నటిగా మృణాల్ ప్రతిష్ఠాత్మక ఫిలింఫేర్ పురస్కారాన్ని గెలుచుకుంది. ఈ అవార్డును మరోసారి షేర్ చేసిన మృణాల్ తాజాగా మరోసారి వైజయంతిని తలచి వారికి ధన్యవాదాలు తెలిపింది. ఆసక్తికరంగా మృణాల్ ఇటీవల విడుదలై సంచలన విజయం సాధించిన కల్కి 2989 ఏడిలోను అతిథి పాత్రలో నటించిన సంగతి తెలిసిందే. వైజయంతి మూవీస్, నాగి మరో కీలక ప్రాజెక్టులో మృణాల్ కి అవకాశం కల్పించడంతో వారికి మరోసారి ధన్యవాదాలు



తెలిపింది. వైజయంతి బ్యానర్ కి సర్వదా రుణపడి ఉంటానని మృణాల్ తన విధేయతను చాటుకుంటూనే ఉంది సోషల్ మీడియాల్లో. స్నేహితులు నా కోసం ఈ మినీ అవార్డ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు కూడా తెలియజేసింది ఇన్ స్టాలో.

**ప్రభాస్ సరసన ఛాన్స్? :** అదంతా అటుంచితే మృణాల్ తదుపరి ప్రభాస్ సరసన నటించనుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రభాస్ కథానాయకుడిగా హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కించనున్న భారీ పీరియడ్ డ్రామాలో మృణాల్ ఠాకూర్ ఛాన్స్ దక్కించుకోనుందని కథనాలొస్తున్నాయి. ఇందులో ప్రభాస్ ప్రేమికురాలిగా మృణాల్ నటించే అవకాశం ఉందని చెబుతున్నారు.

నిజానికి జాన్వీ కపూర్, రష్మిక మందన్న వంటి ఇతర అగ్ర నటీమణుల పేర్లను మేకర్స్ పరిశీలించారు. కానీ మేకర్స్ మృణాల్‌ను నటింపజేయడానికి ఆసక్తిగా ఉన్నట్లు సమాచారం. సీతారామంలో యువరాణిగా మృణాల్ నటనకు ఎక్కువ స్కోర్ చేసింది. అందంగా కనిపించడమే కాకుండా హృదయాలను హత్తుకునే నటనను ప్రదర్శించింది. అందుకే దర్శకుడు మృణాల్‌ని తన తదుపరి పీరియాడిక్ డ్రామాలో హను తనను రిపీట్ చేస్తారని భావిస్తున్నారు. ఇంతకుముందు హాయ్ నాన్నలోను నాని సరసన అద్భుత ప్రదర్శనతో మృణాల్ ఆకట్టుకుంది. అలాగే ది ఫ్యామిలీ స్టార్ లో విజయ్ దేవరకొండతో స్క్రీన్ స్పేస్‌ను షేర్ చేస్కుంది. ఇప్పుడు ప్రభాస్ సరసన అవకాశం దక్కించుకోబోతోందని ప్రచారం వేడెక్కిస్తోంది.

## భారతదేశపు అత్యంత సంపన్న కథానాయిక

స్టార్ హీరోల ఆదాయంతో పోలిస్తే కథానాయికల ఆదాయం చాలా తక్కువ. పరిశ్రమ ఏదైనా కానీ ఏలేది హీరోలే. హీరోయిన్ల ముఖ విలువ మార్కెట్ రేంజ్ తక్కువ. గ్లామర్ రంగంలో ఇది విచిత్రమైన పరిస్థితి. ఆర్జన పరంగా హీరోలకు ధీటుగా హీరోయిన్లు సంపాదించడం అనేది అరుదు. కానీ చాలా మంది నటీమణులు ఇప్పుడు అగ్ర హీరోల కంటే ధనవంతులుగా ఉన్నారు. భారతదేశానికి చెందిన అత్యంత ధనిక నటి నిజానికి తన భర్త కంటే మూడు రెట్లు ధనవంతురాలు. తన భర్త కంటే చాలా మంది హీరోల కంటే పెద్ద స్టార్. తన ఆస్తి విలువ ఏకంగా రూ. 862 కోట్లు. హీరో అయిన తన భర్త కంటే మూడు రెట్లు ఎక్కువ రూ. 862 కోట్ల (105 మిలియన్ల డాలర్లకు పైగా) నికర ఆస్తి విలువతో ఐశ్వర్య రాయ్ భారతదేశంలో అత్యంత ధనిక నటిగా ఉన్నారు. చాలామంది తన సహచరులు, జూనియర్ల కంటే ధనికురాలు. ఆదాయ ఆర్జనలో దశాబ్దాలు హవా సాగించిన నటి. భారతదేశంలోని ఇతర సంపన్న నటీమణులంతా తన కంటే చాలా కింది స్థాయిలో ఉన్నారు. అనేక మిలియన్ డాలర్ల



అంతర్జాతీయ బ్రాండ్ డీల్‌లతో పాటు బాలీవుడ్, తమిళ సినిమా, హాలీవుడ్‌లో ఐశ్వర్యారాయ్ హిట్ సినిమాల్లో నటించింది. ఐశ్వర్య ఒక్కో సినిమాకు 10-15 కోట్లు తీసుకుంటుందని సమాచారం. గత సంవత్సరం తమిళ బ్లాక్‌బస్టర్ రెండు భాగాల పొన్నియిన్ సెల్వన్ కోసం 15 కోట్ల రూపాయలు వసూలు చేసింది. బ్రాండ్ షూట్‌ల కోసం రోజుకు 6-7 కోట్లు సంపాదిస్తుంది. భర్త అభిషేక్ బచ్చన్ కంటే ఐశ్వర్యరాయ్ మూడు రెట్లు ధనవంతురాలు. ఐశ్వర్య రాయ్ రూ. 862-కోట్ల నికర ఆస్తులతో దేశంలో నంబర్ వన్ హీరోయిన్ గా వెలుగొందుతున్నారు. భారతదేశంలో అత్యంత ధనిక నటిగా మాత్రమే కాకుండా భారతదేశంలోని అనేక మంది హీరోల కంటే ధనవంతురాలిగా హోదాను కలిగి ఉన్నారు. తన భర్త అభిషేక్ బచ్చన్ కంటే మూడు రెట్లు ధనవంతురాలు. అభిషేక్ నికర ఆస్తుల విలువ రూ. 280 కోట్లు. భారత దేశ అగ్ర హీరోలు రణబీర్ కపూర్ -రూ. 345 కోట్లు, ప్రభాస్ -రూ. 200 కోట్లు, రణ్‌వీర్ సింగ్ (రూ. 500 కోట్లు) నికర ఆదాయాలను కలిగి ఉన్నారు. వారి కంటే ఐష్ రేంజ్ ఎక్కువ. ప్రియాంక చోప్రా-రూ. 650 కోట్లు, అలియా భట్ రూ. 550 కోట్లు, దీపికా పదుకొనే రూ. 500 కోట్లు, కరీనా కపూర్ రూ. 485 కోట్లు, కత్రినా కైఫ్ రూ. 250 కోట్లు, నయనతార రూ. 200 కోట్లు ఆర్జనతో మెరుస్తున్నారు. వీరందరి కంటే కూడా ఐశ్వర్యారాయ్ ఆస్తి విలువ చాలా ఎక్కువ.




## బతుకమ్మ చీరలు, గొర్రెల పంపిణీపై విచారణకు సిద్ధమా?: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: భారాస ప్రభుత్వ హయాంలో గొర్రెల పంపిణీ పథకంలో రూ.700 కోట్ల అవినీతి జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. "అప్పుల లెక్కలు చెప్పిన హరీశ్‌రావు అమ్మకాల లెక్కలు చెప్పట్లేదు. భారాస హయాంలో రూ.లక్షల కోట్ల విలువైన ఓఆర్‌ఆర్‌ను రూ.7 వేల కోట్లకు అమ్మారు. పదేళ్లలో పాలమూరు జిల్లా ప్రాజెక్టులు పూర్తి చేయలేదు. కేసీఆర్ పాలనలో రంగారెడ్డి జిల్లాలో భూములు అమ్ముకున్నారు. బతుకమ్మ చీరలు అని చెప్పి సూరత్ నుంచి కిలోల లెక్క తీసుకువచ్చి పంపిణీ చేశారు. బతుకమ్మ చీరలు, గొర్రెల పంపిణీపై విచారణకు సిద్ధంగా ఉన్నారా" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

## మా పాలన బాగా లేదని చెబితే సరిపోతుందా?.. ఆధారాలు చూపండి



హైదరాబాద్: బడ్జెట్ ప్రసంగం ఒక రాజకీయ ప్రసంగంలా ఉందని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. శాసనసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. రూ. 4.5 లక్షలు లేని జీఎస్‌డీపీని.. రూ.14 లక్షలకు తీసుకెళ్లింది భారాస ప్రభుత్వమని చెప్పారు. రూ.200 పింఛన్‌ను రూ.2 వేలకు పెంచినట్లు తెలిపారు. భారాస ప్రభుత్వ పాలన బాగా లేదని మాటలు చెబితే సరిపోతుందా అని ప్రశ్నించారు. దానికి ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. "మా పనితీరు తెలియకూడదని పదేళ్ల ప్రభుత్వ సమాచారాన్ని తొలగించారు. కంప్యూటర్ నుంచి తొలగిస్తారేమో కానీ.. ప్రజల మెదడు నుంచి తొలగించలేరు. రాష్ట్ర బడ్జెట్ అవాస్తవాలతో నిండి ఉంది. ట్యాక్స్ రెవెన్యూ ఎక్కువ వస్తుందని బడ్జెట్‌లో పెట్టారు. విధానాల రూపకల్పన కంటే మమ్మల్ని తిట్టడంపైనే ఎక్కువ దృష్టి పెట్టారు. నాన్ ట్యాక్స్ రెవెన్యూలో రూ.35 వేల కోట్లు వస్తుందని బడ్జెట్‌లో చూపారు. గతంలో రుణమాఫీ కోసం భూములు అమ్మితే భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు విమర్శించారు. ఇప్పుడు రూ.10 వేల కోట్ల విలువ చేసే భూములు అమ్మి నిధులు సమీకరిస్తామని చెప్పారు. మీ మాటపై గౌరవం ఉంటే భూములు అమ్ముకునే ప్రతిపాదన ఉపసంహరించుకోవాలి. సాధ్యం కాని తరహాలో ఆదాయం ఎక్కువ చూపారు. తప్పని సరి ఖర్చులను తక్కువ చేసి చూపారు. ఏకకాలంలో రుణమాఫీ అన్నారు. బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు మాత్రమే వస్తోంది. ఆలస్యం అయిందని వడ్డీ రైతు నుంచి వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ఆలస్యం చేసి వడ్డీ భారాన్ని రైతులపై మోపుతోంది" అని హరీశ్‌రావు విమర్శించారు.

**ఒక్క మంత్రికి అవగాహన లేదు.. : జగదీశ్ రెడ్డి** – వ్యవసాయంపై రాష్ట్రంలో ఒక్క మంత్రికి అవగాహన లేదని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. "ఆంధ్రా బాసుల మోచేతి నీళ్లు తాగిన వీళ్లకు తెలంగాణ గురించి ఏం తెలుసు..?మేడిగడ్డకు ఏదో జరిగిందని ప్రభుత్వం చెప్తోంది. మేడిగడ్డ దగ్గర 10 లక్షల క్యూసెక్కుల నీళ్లు వృథాగా పోతున్నాయి. ఎన్‌డీఎస్‌ఏ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం సాకులు చెబుతోంది. ప్రభుత్వానికి నీళ్లు ఇచ్చే ఉద్దేశం లేదు. కాంగ్రెస్, భాజపా కలిసి కాళేశ్వరంపై నాటకాలు ఆడుతున్నాయి" అని మండిపడ్డారు.

## కాళేశ్వరం వెళ్లి ఏం సాధించావ్ కేటీఆర్..



కరీంనగర్, జూలై 27: కాళేశ్వరంకు పోయిన వాళ్ళందరూ నాస్తికులే అని.. అందుకే గుడి యొక్క సాంప్రదాయాలను పాటించలేదని బీఆర్ఎస్ నేతలపై కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... గర్భగుడి లోపలికి వెళ్లేముందు ఎలా ఉండాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తెలీదా అని ప్రశ్నించారు. గర్భగుడిలోకి వెళ్లే భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించి వెళ్లాలని గుడి వద్ద బోర్డు ఉంటుందన్నారు. దీన్ని ధిక్కరించి బీఆర్ఎస్ నేతలను గుడిలోకి వెళ్లారని విమర్శించారు. "టెంపుల్ ముందు బోర్డు కనపడలేదా..కళ్ళు దొబ్బినాయా కేటీఆర్" అంటూ మండిపడ్డారు. అసలు కేసీఆర్ కొడుకు కేటీఆర్ దేవుడిని నమ్ముతారా.. ఆయన అతి పెద్ద నాస్తికుడు అంటూ వ్యాఖ్యలు చేశారు. గుడికి వెళ్లిన వారిలో సంగం మంది నాస్తికులే కాబట్టి అక్కడి సాంప్రదాయాలను పాటించలేదని మండిపడ్డారు. ఇది పూర్తి హిందూ ధర్మాన్ని అవమానించినట్లే అని అన్నారు. తాము ఉన్నామని చెప్పుకోడానికి బీఆర్ఎస్ ఇన్ని పాట్లు పడుతోందన్నారు. కాళేశ్వరం సందర్శించి ఏం సాధించారని ప్రశ్నించారు. తప్పు జరలేదు అన్న విషయాన్ని కూడా చెప్పలేకపోయారన్నారు.

కొండను తవ్వి ఎలుకను కూడా పట్టుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. అక్కడకు వెళ్లి కేవలం దేవుడిని అవమానించడం తప్ప సాధించింది ఏమీ లేదన్నారు. హిందూ సమాజానికి బీఆర్ఎస్ క్షమాపణలు చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

**కేటీఆర్ ఒప్పుకున్నట్టేనా? :** ఎన్డీఎస్ఏకు పోలవరంపై లేని శ్రద్ధ కాళేశ్వరంపై ఎందుకన్న కేటీఆర్ వ్యాఖ్యలపై బండి మండిపాడ్డారు. కాళేశ్వరంలో తప్పు జరిగిందని కేటీఆర్ ఒప్పుకున్నట్టేనా అని ప్రశ్నించారు. పోలవరానికి కాళేశ్వరంకు లింక్ ఎందుకు అని అడిగారు. పోలవరంలో తప్పు జరిగితే.. ఫిర్యాదు చెయ్యి కేటీఆర్ అని అన్నారు. కాళేశ్వరంలో కేసీఆర్ లక్ష కోట్లు తిన్నారని దుయ్యబట్టారు. అవకాశం ఉంటే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో బీఆర్ఎస్ కలిసినా ఆశ్చర్యపోనవసరం లేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ గురించి ప్రజల్లో చర్చ లేదన్నారు. ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా బీఆర్ఎస్‌ను వీడుతున్నారన్నారు. తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఒక్కటయ్యారని... బీజేపీ ఎమ్మెల్యేలు హీరోలుగా ఫైట్ చేశారన్నారు. వికసిత్ భారత్ అజెండాగా నీగి ఆయోగ్ సమావేశం ఈరోజు జరగబోతోందని తెలిపారు. 2047 భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే లక్ష్యంగా ఈ సమావేశం జరుగుతోంది. అన్ని రాష్ట్రాలు ఇందులో పాల్గొని సలహాలు ఇవ్వాలని అన్నారు. ఇందులో పాల్గొనేందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. అసెంబ్లీ వేదికగా కేంద్రాన్ని దూషించారు కాబట్టే.. తిరిగి మొహం చెల్లక నీతి ఆయోగ్ సమావేశానికి కాంగ్రెస్ హాజరుకావడంలేదని అన్నారు. ఇది ముమ్మాటికి తెలంగాణ రాష్ట్రాన్ని నష్టాన్ని చేకూరుస్తుందని కేంద్రమంత్రి వెల్లడించారు..

## సీఎం నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించడం సరికాదు : కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి



హైదరాబాద్: వికసిత్ భారత్ దిశగా అద్భుతమైన బడ్జెట్‌ను మోదీ సర్కారు ప్రవేశపెట్టిందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "పేదల సాధికారత కోసం ఎన్నో పథకాలు తీసుకొచ్చాం. ఈ బడ్జెట్‌లో పేదల అభ్యుదయానికి పెద్దపీట వేశాం. రైతుల పంటకు కనీస మద్దతు ధర కల్పించే దిశగా చర్యలు తీసుకున్నాం. ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార భద్రత స్కీం ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన. ఉత్పాదకత, వ్యవసాయం, యువతకు ఉపాధి వంటి ప్రధాన అంశాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చాం. గతంలో తెలంగాణలో భారాస ప్రభుత్వం పీఎం ఆవాస్ యోజన పథకాన్ని అమలు చేయలేదు. ఈ ఏడాది 5 వేల కోట్ల రూపాయలకుపైగా రైల్వే బడ్జెట్‌ను తెలంగాణకు కేటాయించాం. 48 వేల కోట్ల రూపాయల రోడ్డు ప్రాజెక్టులు తెలంగాణలో చేపడుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం భూములు కేటాయిస్తే మరిన్ని రోడ్లు విస్తరణ చేస్తాం. రామగుండం ఎరువుల కర్మాగారం తిరిగి ఓపెన్ చేశాం. సీఎం నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించడం సరికాదు. ముఖ్యమంత్రికి ఏవైనా విభేదాలు ఉంటే.. తన అభిప్రాయాన్ని నీతి ఆయోగ్ సమావేశానికి హాజరై తెలపాలి" అని సూచించారు.

## చిలుకూరులో 30 వరకు 144 సెక్షన్.. - మత ఘర్షణలు తలెత్తకుండా పోలీసుల పహారా

మొయినాబాద్(రంగారెడ్డి): రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిలుకూరులో 144 సెక్షన్ కొనసాగుతున్నది. చిలుకూరు రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్.134లో ఓ ప్రవాస భారతీయుడికి పట్టా భూమి ఉంది. దాని పక్కనే మరో సర్వే నంబర్ 133లో వక్ఫ్‌బోర్డుకు చెందిన పురాతన స్థలం, ఓ కట్టడం ఉంది. అయితే, ఓ వర్గానికి చెందిన స్థలంలో నిర్మాణం తొలగించడంపై రెండు వర్గాలు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. మతపరమైన వివాదాలకు దారితీయకుండా సైబరాబాద్ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ రెండు వర్గాల వారికి నచ్చజెప్పి ఎవరినీ అక్కడికి రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వక్ఫ్‌బోర్డు స్థలం వద్దకు వెళ్లకుండా ఉండేందుకు బారికేడ్లను ఏర్పాటు చేశారు. హిమాయత్‌నగర్ చౌరస్తా, చిలుకూరు బాలాజీ ఆలయం(%జష్ట్రఅశ్రీబఎబతీ ద్ముశ్రీఖయఱ ుఎఎజూశ్రీవ%) వద్ద బారికేడ్లను ఏర్పాటు చేశారు. పురాతన కట్టడం వద్ద పోలీసుల పహారా కొనసాగుతోంది. బాలాజీ ఆలయానికి వచ్చే భక్తులను సైతం వివరాలు అడిగిన తర్వాతనే దర్శనానికి అనుమతిస్తున్నారు. ఈ నెల 30 వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు.




## ఉగ్రరూపం దాల్చుతున్న గోదావరి.. పరివాహక ప్రాంత ప్రజలకు బిగ్ అలర్ట్..

భద్రాచలం: గోదావరి వరద ఉధృతి మరింత పెరుగుతోంది. భద్రాచలం వద్ద గోదావరి పరవళ్ళు తొక్కుతోంది. మూడో ప్రమాద హెచ్చరిక దిశగా గోదావరి ఉగ్ర ప్రవాహం కొనసాగుతోంది. 50.80 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. 53 అడుగులు దాటితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. వరద ఉధృతి 13,01,496 క్యూసెక్కులకు చేరుకుంది. భద్రాచలం నుంచి ఆంధ్రా ఒడిషా, ఛత్తీస్ గడ్ కు నిలిచిన రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం నుంచి దుమ్ముగూడెం చర్ల స్టేట్ హైవే పై రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు ధవళేశ్వరం వద్ద ప్రస్తుత ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 12.49 లక్షల క్యూసెక్కులు కావడం గమనార్హం. మొదటి ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. విపత్తుల సంస్థలోని స్టేట్ కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. అత్యవసర సహాయక చర్యల కోసం స్టేట్ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ 1070,112,18004250101 నెంబర్లు సంప్రదించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. ఇక శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వ 200 టీఎంసీలకు చేరితే గేట్లు ఎత్తేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గేట్లు ఎత్తివేత కార్యక్రమానికి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హాజరుకానున్నారు. నేడు పోతిరెడ్డిపాడు గేట్లను ఇరిగేషన్ అధికారులు ఎత్తనున్నారు. మరో రెండు రోజుల్లో మల్యాల హంద్రీనీవా ఎత్తిపోతల పథకం నుంచి కూడా ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదల చేయనున్నారు. మరోవైపు సుంకేసుల ప్రాజెక్టు 28 గేట్లను అధికారులు ఎత్తివేసి నీటిని విడుదల చేశారు. 80 వేల క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. మత్స్యకారులు నదిలోకి దిగవద్దని అధికారులు సూచిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అల్లూరి జిల్లా సీలేరు కాంప్లెక్స్ డొంకరాయి జలాశయానికి వరద నీటి తాకిడి పెరిగింది. ప్రమాద స్థాయి నీటిమట్టానికి అల్లూరి జిల్లా సీలేరు కాంప్లెక్స్ లోని డొంకరాయి జలశయం చేరుకుంది. డొంకరాయి జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు కాగా ప్రస్తుతం 1037 అడుగులకూ చేరుకుంది. దీంతో శుక్రవారం అర్ధరాత్రి డొంకరాయి జలాశయంలోని రెండు గేట్లు ఎత్తి 4,500 క్యూసెక్కుల నీటిని జెన్కో అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు.

## తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



మెదక్: తెలంగాణ అభివృద్ధికి కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి రామదాస్ అథవాలే తెలిపారు. శనివారం నాడు మెదక్ బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి రామదాస్ అథవాలే , మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రామదాస్ అథవాలే మాట్లాడుతూ... కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ సామాజిక, ఆర్థిక న్యాయం దిశగా ఉందని ఉద్ఘాటించారు. సబ్ కా సాత్ సబ్‌కా వికాస్ కోసం మోదీ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.

**అందుకు ఏపీకి ఎక్కువ నిధులు :** అన్ని వర్గాల సంక్షేమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృషి చేస్తున్నారని తెలిపారు. ఎలాంటి గ్యారెంటీ అవసరం లేకుండా ముద్ర రుణాలను రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచినట్లు వ్యాఖ్యానించారు. ఉజ్వల యోజన పథకం ద్వారా ఇంటింటికీ గ్యాస్ అందిస్తున్నామని చెప్పారు. ప్రధాన మంత్రి అవాస్ యోజన పథకం ద్వారా పేదలకు 3 కోట్ల ఇల్లు ఇచ్చామని అన్నారు. ఎన్డీయే ప్రభుత్వానికి అన్ని రాష్ట్రాలు సమానమేనని వివరించారు. దేశంలోని 85 శాతం మంది పేదల కోసం మోదీ సర్కార్ పనిచేస్తుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని లేకపోవడంతో ఎక్కువ నిధులు కేటాయించామని పేర్కొన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కు ఒక్క ఎంపీ సీటు రాలేదని బీజేపీకి 8 ఎంపీలను ఇచ్చారని తెలిపారు. సౌత్ ఇండియాలో ఎన్డీయే మెజార్టీ స్థానాలు సాధించిందని.. అందులో తెలంగాణ, ఆంధ్రప్రదేద్ రాష్ట్రాలు ఉన్నాయని ఉద్ఘాటించారు. తమ ప్రభుత్వానికి ఎలాంటి ఢోకాలేదని.. ఐదేళ్లు మోదీ నేతృత్వంలో పనిచేస్తామని తెలిపారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం తమ పార్టీ పనిచేస్తుందని రామదాస్ అథవాలే పేర్కొన్నారు.

**సీఎం రేవంత్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు...** నీతి ఆయోగ్ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి పోకున్నా రాష్ట్రానికి రావాల్సిన నిధులు వస్తాయని మెదక్ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. కేంద్రం రూ.26 వేల కోట్లను కేటాయించిందని రాష్ట్ర బడ్జెట్ సమావేశంలోనే ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారని గుర్తుచేశారు. సీఎం రేవంత్ అవగాహన లేకుండా కేంద్ర బడ్జెట్‌పై మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని మారుస్తున్నామని బట్టకాల్చి మీదేసి కాంగ్రెస్ సీట్లు పెంచుకుందని ఆరోపించారు. నెహ్రూ తర్వాత మోదీ మూడేళ్లు వరుసగా ప్రధాని అయ్యారని గుర్తుచేశారు. నాలుగోసారి గెలిచేందుకు మోదీ సర్కార్ ముందుకు సాగుతోందని వివరించారు. తెలంగాణ పేరు వచ్చిందా.. అని అడుగుతున్నారని.. సీఎం కొడంగల్‌కు కేటాయించిన నిధుల్లాగే మెదక్ నియోజకవర్గానికి కూడా రూ.4,600 కోట్లు ఇవ్వాలి కదా అని ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు.

## అక్బరుద్దీన్‌కు మాట ఇస్తున్నా.. నాలుగేళ్లలో పూర్తి చేస్తాం



హైదరాబాద్, జూలై 27: పాతబస్తీ మెట్రో నిర్మాణాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పాత బస్తీలో మెట్రో నిర్మాణంపై ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలపై సీఎం మాట్లాడుతూ...పాతబస్తీ అంటే ఓల్డ్ సిటీ కాదని.. అది ఒరిజినల్ సిటీ అని పేర్కొన్నారు. జైపాల్ రెడ్డి కేంద్ర అర్బన్ డెవలప్‌మెంట్ మంత్రిగా వయబుల్ గ్యాప్ ఫండ్ తీసుకువచ్చి హైదరాబాద్ మెట్రో నిర్మాణానికి కృషి చేశారని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఓల్డ్ సిటీకి మెట్రో రైల్ అందుబాటులోకి తీసుకురాలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పాతబస్తీ మెట్రోకు శంఖుస్థాపన చేశామన్నారు. రెండో దశలో 78 కి.మీ మెట్రో ప్రాజెక్టు కోసం కేంద్రానికి నివేదిక సమర్పించామన్నారు. నాలుగేళ్లలో ఓల్డ్ సిటీ మెట్రో పనులు పూర్తి చేసే బాధ్యత తమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## ఎక్కడ గంజాయి పట్టుబడినా ధూల్‌పేట్‌లోనే మూలాలు: ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్



హైదరాబాద్: ముఖ్యమంత్రి ఆదేశాలతో డ్రగ్స్ నియంత్రణకు ఎక్సైజ్ శాఖ తీవ్రంగా కృషి చేస్తోందని అబ్కారీ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొన్ని రోజులుగా మాదకద్రవ్యాల నిరోధానికి స్పెషల్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా పెద్దఎత్తున గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ధూల్‌పేటలో గతంలో నాటుసారా తయారీని నియంత్రించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ ప్రాంతం గంజాయి హబ్‌గా మారిందని చెప్పారు. "కొద్దిరోజులుగా ధూల్‌పేట్‌లో ఎక్సైజ్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులతో ప్రత్యేక సోదాలు నిర్వహిస్తున్నాం. సోదాల్లో భాగంగా కొద్ది మొత్తాల్లో గంజాయి స్వాధీనం చేసుకున్నాం. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఎక్కడ గంజాయి పట్టుబడినా మూలాలు ఇక్కడే ఉంటున్నాయి. మాదకద్రవ్యాల నిరోధానికి ప్రత్యేకంగా 1000 మంది పోలీసులకు శిక్షణ ఇచ్చాం. పట్టుబడ్డ నిందితులకు శిక్షలు పడేవిధంగా కేసుల విచారణ చేస్తున్నాం. ఆగస్టు 31లోపు ధూల్‌పేట్‌ను గంజాయి రహిత ప్రాంతంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇక్కడ మాత్రమే కాకుండా సమాంతరంగా మిగతా ప్రాంతాల్లో దృష్టి పెడుతున్నాం. ఇక్కడ జరిపిన సోదాల్లో 15 మందిని అదుపులోకి తీసుకున్నాం" అని కమలాసన్‌రెడ్డి తెలిపారు. నిందితులు నగరంలోని శివారు ప్రాంతాల్లో గంజాయిని నిల్వ చేస్తున్నారని.. ధూల్‌పేట్‌కు తీసుకువచ్చి విక్రయిస్తున్నారని ఎక్సైజ్ శాఖ జాయింట్ కమిషనర్ ఖురేషి పేర్కొన్నారు. ఈ రెండు రోజుల్లో మూడు కేసుల్లో 66 కిలోల గంజాయి పట్టుకున్నామన్నారు. ఆపరేషన్ మొదలుపెట్టాక ధూల్‌పేటలో 12 కేసులు పెట్టినట్లు చెప్పారు.

## బ్రోకర్లకు కమీషన్లు ఇచ్చి అధిక వడ్డీలకు వేల కోట్ల అప్పు తెస్తున్నారు : బండి సంజయ్

కరీంనగర్: బ్రోకర్లకు కమీషన్లు ఇచ్చి మర్చంట్ బ్యాంకర్స్ ద్వారా అధిక వడ్డీలకు వేల కోట్లు అప్పు తెచ్చే కుట్రకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరతీసిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిక వడ్డీలకు అప్పు తీసుకువస్తే రాష్ట్ర ప్రజలపై మోయలేని భారం పడబోతుందన్నారు. ఈ అంశంపై అసెంబ్లీలో చర్చ జరపాల్సిందేనని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్, కాంగ్రెస్ 6 గ్యారంటీలు గాడిద గుడ్డు అని ఎద్దేవా చేశారు. 6 గ్యారంటీలను అమలు చేయలేక కేంద్రాన్ని బద్నాం చేసేందుకు కుట్ర చేస్తోందన్నారు. నీతి ఆయోగ్ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి డుమ్మా కొట్టడం దుర్మార్గమన్నారు. "కేసీఆర్ బాటలోనే రేవంత్‌రెడ్డి నడుస్తున్నట్లుంది. సీఎం తీరు తెలంగాణకు పెద్ద నష్టం. భారత్‌ను నంబర్ వన్‌గా తీర్చిదిద్దడం, కేంద్ర రాష్ట్ర సంబంధాలను బలోపేతం చేయడం నీతి ఆయోగ్ సమావేశం లక్ష్యం. ముఖ్యమంత్రికి ముఖం చెల్లకనే నీతి ఆయోగ్ సమావేశానికి వెళ్లలేదు. కాంగ్రెస్, భారాస నేతలు అవకాశవాదులు. అసెంబ్లీలో రెండు పార్టీలు కలిసే భాజపాకు వ్యతిరేకంగా తీర్మానం చేసింది నిజం కాదా? అవకాశమొస్తే కాంగ్రెస్‌లో భారాస విలీనమవడం ఖాయం. కాళేశ్వరంపై ఆ రెండు పార్టీలు కలిసి డ్రామాలాడుతున్నాయి. మూసీ రివర్ ఫ్రంట్‌పై కేంద్రాన్ని నిధులు అడిగిన రాష్ట్ర ప్రభుత్వం.. బడ్జెట్‌లో ఎందుకు భారీ నిధులు కేటాయించలేదో సమాధానం చెప్పలేదు" అని బండి సంజయ్ విమర్శించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com